VISALAANDHRA Phone No. 75301 ఉదయం *** Regd. No. H/VJ 47

విశాలాంధ్ర

704930

సం॥ టి 26 సంచిక 180 | విజయువాడ 26—10—76 మంగళవారం | 6 పేజీలు 30 పైసలు

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంట్లుద్వారా	పోస్టుద్వారా
నెల చందా	9_20	9_80
మూడు నెలలు	27_60	29_40
ఆరు నెలలు	55_20	58_80
సంవత్సరం	110_40	117_60

ఈ రేటు అడ్వాన్సుగా చందా చెల్లించినవారికి మాత్రమే వర్తించును

అరబ్ శిఖరాగ్ర సభ ప్రారంభం

కైరో, అక్టోబరు 25

లెబనాన్‌లో జరుగుతున్న రక్తపాతాన్ని నివారించుటకు అరబ్ శిఖరాగ్ర సభ నేడు కైరోలో ప్రారంభమయ్యింది

14 దేశాధిపతులు, పాలస్తీనా విముక్తి ఉద్యమ సంస్థ నాయకుడు యాసర్ అరాఫత్ ప్రారంభ సమావేశంలో పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థికలక్ష్యాల సాధనకు తోడ్పడే చారిత్రాత్మక సవరణ

లోక్‌సభ పరిశీలనకై రాజ్యాంగ సవరణబిల్లును ప్రతిపాదిస్తూ న్యాయశాఖామంత్రి శ్రీ గోఖలే అభివర్ణన

న్యూఢిల్లీ, అక్టోబరు 25

దేశ సామాజిక, ఆర్థిక విప్లవ లక్ష్యాల సాధనలో రాజ్యాంగం 44 వ సవరణ బిల్లు ప్రధానమైన, చారిత్రాత్మకమైన ముందడుగని న్యాయశాఖమంత్రి శ్రీ హెచ్ ఆర్. గోఖలే నేడు లోక్‌సభలో బిల్లును సభ పరిశీలనకు ప్రవేశపెడుతూ అన్నారు

పార్లమెంట్ ఆధిక్యతను నిలబెట్టుకోవడం కొన్నిప్రాథమికహక్కులకన్నాఆదేశకసూత్రాలకు ప్రాధాన్యతనివ్వడం 59 క్లాజులుగల ఈ బిల్లు ప్రధానోద్దేశమని ఆయన అన్నారు.

దేశ ఫెడరల్ స్వరూపం లేదా న్యాయవ్యవస్థ గౌరవం, స్వేచ్ఛలను ఈ బిల్లులోని నిబంధనలేవీ తగ్గించవని శ్రీ గోఖలే అన్నారు

బిల్లు పరిశీలనకు తీసుకునేముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ కె.రఘురామయ్య ఈ ప్రత్యేక సమావేశం ప్రధానంగా రాజ్యాంగ సవరణల పరిశీలనకు ఆమోదానికి కేటాయించబడుతుందని ఒక తీర్మానాన్ని ప్రతిపాదించగా సభ ఆమోదించింది

ఈ ప్రత్యేక సమావేశం 44 వ సవరణ బిల్లు పరిశీలనకు యితర "అత్యవసర" "విస్మరించ వీలులేని" తదితర ప్రభుత్వ కార్యకలాపాలకు పరిమితమై వుంటుందని శ్రీ రఘురామయ్య వివరించారు

ప్రస్తుత సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయం సావధాన తీర్మానం, అనధికార బిల్లు ప్రతిపాదనలాంటి కార్యక్రమాలను రద్దుచేస్తూ ప్రభుత్వం ప్రతిపాదించిన తీర్మానాన్ని ప్రతిపక్షాల సవరణలను తిరస్కరించిన అనంతరం సభ ఆమోదించింది

లంచ్ విరామ సమయాన్ని వదులుకొని శనివారం కూడా సభను కొనసాగించాలని సభ్యులను శ్రీ రఘురామయ్య కోరారు.



ఈ బిల్లును రాజ్యసభ నవంబరు మూడు నుండి పరిశీలనకు తీసుకోవాల్సివున్నందున నవంబరు ఒకటి నాటికి బిల్లుపై చర్చలు ముగియాలని ఆయన అన్నారు.

సెప్టెంబరు ఒకటిన సభలో ప్రవేశపెట్టబడిన ఈ బిల్లుపై దేశవ్యాపితంగా చర్చ జరిగిందని హర్షధ్వానాలమధ్య శ్రీ గోఖలే అన్నారు ఈ సవరణలపై లాయర్లు, టీచర్లు, లెజిస్లేటర్లు, యితర ఎలువృత్తులవారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు.

బిల్లులో 59 క్లాజులున్నంత మాత్రాన 59 సవరణలున్నాయని అర్థంకాదు మౌలికంగా ఏడెనిమిది అంశాలకు మాత్రమే సవరణలు జరుగుతాయన్నారు.

రాజ్యాంగాన్ని రూపొందించి 25 సంవత్సరాలకు పైగా అయినది. ఏ ఉద్దేశాలకై ప్రాధాన్యత యివ్వాలని రాజ్యాంగ నిర్ణాయక సభలో జవహర్‌లాల్ నొక్కి చెప్పారో అవి సాధించామా అనే విషయం మనం సింహావలోకనం చేయాలని శ్రీ గోఖలే కోరారు.

ఆ లక్ష్యాల సాధన జరగనప్పుడు వానికి గల అవరోధాలను తొలగించాలన్నారు.

రాజ్యాంగం కేవలం శాసనపత్రమేకాదు- అది సామాజిక రాజకీయ పత్రం కూడా. దానిలో ప్రజల కోరికలు, భావాలు ప్రతిబింబించాలి. సామాజిక ఆర్థిక విప్లవాని కవసరమయిన అటువంటి మార్పులను తేగల సమర్థవంతమయిన ఆయుధంగా అది వుండాలని శ్రీ గోఖలే వివరించారు.

సామాజిక ఆర్థిక లక్ష్యాల సాధనకు1971 అనంతరం చేయబడిన సవరణలు ప్రత్యేకంగా 24 వ సవరణను ఆయన ప్రస్తావించారు.

కోర్టుల తీర్పులవల్ల కొన్నిఇబ్బందులు కలిగాయి. లక్ష్య సాధనకు ఏదైనా చేసినప్పుడు ప్రతిదశలో న్యాయస్థానాలు ఒక ప్రతిబంధకాన్ని విసిరినట్టు వానిచరిత్రతెలియజేస్తున్నది. గత ఎన్నికలకుముందురాజభరణాలరద్దు సమస్యమనకు ఎదురైంది బ్యాంకుల జాతీయకరణసమస్యకూడాఎదురయింది.కొన్ని బ్యాంకులజాతీయకరణకునష్టపరిహారాన్నిదేశం ఎక్కడనుండి చెల్లించాలనే పరిస్థితి దాపురించింది. న్యాయస్థానాలు కొన్నిసమయాల్లో యిచ్చిన తీర్పులు ఎంత విరుద్ధంగా వున్నాయంటే అసలుదేశపు చట్టమేదో తెలుసుకోవడం కష్టతరమైందని మంత్రి అన్నారు.

ప్రాథమిక హక్కులపై 1967 లో సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పును శ్రీ గోఖలే ప్రస్తావించారు. ఇది 24 వ రాజ్యాంగ సవరణకు దారితీసిందనీ అపుడు మనం మరోసారి పార్లమెంటు ఆధిక్యతను ధృవపరచుకున్నామన్నారు.

రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకుగల అధికారమనేది రాజ్యాంగ నిర్ణయాధికారం. అది శాసనాధికారంకన్నా భిన్నమైంది రాజ్యాంగంలోని ఏ నిబంధనైనా సవరించే అధికారం దాని ద్వారా పార్లమెంటుకు వుంటుందని ఆయన అన్నారు.

24 వ సవరణతోనే యిబ్బందులు నిలిచిపోలేదు సామాజిక ఆర్థిక లక్ష్యాలతో సంబంధంగల 25 వ సవరణకు కూడా వెళ్ళవలసి వచ్చిందని ఆయన అన్నారు.

25 వ సవరణ అనంతరం కూడా పార్లమెంటు అధికారమే సంపూర్ణమైనది కాదని కోర్టు తీర్పులు వచ్చాయి రాజ్యాంగమౌలిక స్వరూపం సవరించ వీలులేనిదని చెప్పాయని మంత్రి తెలిపారు.

కోర్టుతీర్పులలోగల అస్పష్టత,వైరుధ్యాలను ప్రస్తావిస్తూ శ్రీగోఖలే "మౌలిక స్వభావం" కేసులో సుప్రీంకోర్టు జడ్జి ఒకరుఒకతీర్పులో అనర్హతదాయకమైన విశ్లేషణ చేశారన్నారు. ఒక జడ్జి అభిప్రాయాలకు మరో జడ్జి అభిప్రాయాలకు పొంతన లేకుండా మౌలిక స్వభావం లాంటిదేదీ లేదని చెప్పడానికి మనం సమయాన్ని ఏమాత్రం వృధాచేయకూడదు. రాజ్యాంగంలోని ఏ నిబంధననైనా సవరించే పార్లమెంటు అధికారానికి ఏదీ ప్రతిబంధకంగా వుండకూడదని ఆయన స్పష్టపరిచారు.

పార్లమెంటుకు ఆధిక్యత వుంది. రాజ్యాంగాన్ని సవరించేందుకు దానికి గల అధికారానికి పరిమితులు లేవనే విషయాన్ని పక్కాఢింపుతో సుస్పష్టం చేయాలనేదే యీబిల్లు ప్రధాన వుద్దేశమని ఆయన అన్నారు.

పార్లమెంటు ఆధిక్యత, సార్వభౌమాధికారాన్ని పునరుద్ఘాటించే ప్రతిపాదన ఒక క్లాజులో పొందుపరచబడింది. "ఏ కోర్టు అయినా అది ఎంత పెద్దదైనా దానికి రాజ్యాంగ సవరణ చెల్లుబడిని పరిశీలించే అర్హత వుండదు" అనిపేర్కొనబడిందన్నారు. ఈ నిబంధన విమర్శకు గురైందన్నారు.

శ్రీ ఎ. ఎస్. రే పై హత్యాప్రయత్నం కేసు తీర్పు 28 న

న్యూఢిల్లీ, అక్టోబరు 25

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎ ఎస్. రే పై హత్యాప్రయత్నానికి సంబంధించిన కేసుపై ఈ నెల 28 న తీర్పు యివ్వబడుతుందని అడిషనల్ సెషన్స్‌జడ్జి శ్రీ కె ఎస్. సిద్ధు నేడు తెలిపారు

ముగ్గురు ఆనందమార్గ్ కార్యకర్తలతో సహా నలుగురిపై కేసుపెట్టబడింది. ఆనందమార్గ్ అవధూతలయిన సంతోషానంద్, సుదేవానంద్, రామ్‌జనమ్ దివేదీలపై హత్యాప్రయత్నం, ప్రేలుడు పదార్థాల చట్టం ఉల్లంఘన కేసులు పెట్టబడ్డాయి.

నాలుగవ ముద్దాయి రామ్‌నగీనాపై ప్రేలుడు పదార్థాల చట్టం ఉల్లంఘన కేసు మాత్రమే పెట్టబడింది,

సత్తుపల్లిలో నూతన బస్ స్టేషన్‌కు ప్రారంభోత్సవం

(విశాలాంధ్ర విలేకరి)

ఖమ్మం, అక్టోబర్ 25

ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద రు. 8లక్షల వ్యయంతోనిర్మించబడిననూతనబస్‌స్టాండ్‌కు రాష్ట్ర రవాణా మంత్రి శ్రీ చేబ్రోలు హనుమయ్య నేడు ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగిస్తూ శ్రీ హనుమయ్య రాష్ట్రంలో అన్ని బస్‌స్టాండులలో ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగు పరచేందుకు రోడ్డు రవాణా కార్పొరేషన్ రు. 2 46 కోట్లు ఖర్చు చేయనున్నదని చెప్పారు.

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నాయకత్వాన ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆదర్శవంతమైనరాష్ట్రంగారూపొందుతున్నదనిచెప్పారు.

సభకు అధ్యక్షత వహించిన రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ శ్రీ పి నరసింగరావు ప్రసంగిస్తూ ఖమ్మం జిల్లా గిరిజన ప్రాంత అవసరాలను తీర్చేందుకుగానూ సత్తుపల్లి భద్రాచలంలలో రెండు బస్ డిపోలను నెలకొల్పటం జరుగుతుందని ఆయన చెప్పారు

తిరువూరు నుండి వేంసూరు, సత్తుపల్లి, వటా రిగూడెంమీదుగా అశ్వారావుపేటకుతిరువూరునుండి బయ్యనగూడెం సత్తుపల్లి, పట్వారిగూడెం, దమ్మగీత మీదుగా అశ్వారావు పేటకు త్వరలో ఆర్. టి సి. బస్సులు నడ నున్నట్లు ఆయన తెలిపారు.

తొలుత కార్పొరేషన్ జనరల్ మేనేజింగ్ శ్రీ ఆర్ పద్మాకరరావు స్వాగతం పలికారు.

జిల్లాకలెక్టర్ శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్, నాగార్జున గ్రామీణ బ్యాంకు డైరెక్టర్ శ్రీ జె కొండలరావు, డి సి.సి అధ్యక్షులు శ్రీ వై. రంగారెడ్డి, శ్రీ వి. సుబ్బారావు (యం. ఎల్ ఎ.) శ్రీ టి వెంకటప్పయ్య (యం. ఎల్ సి) ఇంకా శ్రీయుతులు జె ప్రసాదరావు, వి సత్యన్, తదితరులు ప్రసంగించారు.

ఆర్ టి.సి జాయింట్ జనరల్ మేనేజర్ శ్రీ పి వి అనంత వందన సమర్పణ చేశారు [illegible] గినికి సంబంధించిన ఫొటో మూడవ [illegible] వుంది.)

లోక్‌సభ శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ, అక్టోబరు 25

నేడు ప్రారంభమైన లోక్‌సభ ప్రత్యేక సమావేశం ఇటీవల మరణించిన ప్రముఖ విప్లవకారులు సురేంద్రమోహన్ ఘోష్, మరో ఇద్దరు మాజీ సభ్యులకు శ్రద్ధాంజలి ఘటించింది

మిగతా యిద్దరిలో ఒకరు ప్రొవిజనల్ పార్లమెంటు సభ్యులైన సర్దార్ సోచెత్ సింగ్, రెండవ సభ్యుడు తులసీదాస్ కిలాచంద్ యీయన మొదటి లోక్‌సభ సభ్యులు

సభ పక్షాన స్పీకర్ శ్రీ బి. ఆర్. భగత్ వీరి మరణ వార్తను తెలిపారు సభ వారిపట్ల గౌరవ పురస్సరంగా రెండు నిముషాలు మౌనం పాటించింది.

గుంటూరులో కుంభవృష్టి

గుంటూరు, అక్టోబరు 25

గుంటూరులో నేటి మధ్యాహ్నం 1_30 గంటల నుండి కుంభవృష్టిగా వర్షంప్రారంభమయింది.

10 నిమిషాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జిల్లాలో వర్షం ఇలాగేవుంటే పత్తి తదితర వాణిజ్య పంటలకు ఈ వర్షం లాభదాయకమనీ: వరిపంటకు నష్టం తెస్తుందనీ భావిస్తున్నారు, (వి. వి.)

ముఖ్యమంత్రిచే లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రారంభోత్సవం

హైదరాబాదు అక్టోబరు 25

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జె వెంగళరావు ఈనెల 27 వ తేదీన ఖమ్మంజిల్లా భద్రాచలం తాలూకాలోని ప్రగళ్ళపల్లి గ్రామంవద్ద గోదావరినదిపై లిఫ్టుఇరిగేషన్‌కు ప్రారంభోత్సవం చేస్తారు

ఈ ఇరిగేషన్ పథకంవల్ల ఖరీఫ్‌సీజన్‌లో 1200 ఎకరాలకు రాబీ సీజన్‌లో 1200 ఎకరాలకు నీటి సౌకర్యం లభిస్తుంది.

పథకం నిర్మాణానికి దాదాపు రు. 13 1/2 లక్షలు ఖర్చవుతుంది. 39 31 అడుగుల ఎత్తునుంచి నీరు తోడిపేయడానికి 75 హెచ్ పి నిలువు టర్బైన్ పంపులను అమర్చుతున్నారు.

రాయనపాడు వద్ద భారీ ఇంజనీరింగ్ ఫ్యాక్టరీ ?

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, అక్టోబరు 25

కృష్ణాజిల్లాలో నెలకొల్పదలచిన భారీ ఇంజనీరింగ్ ఫ్యాక్టరీని విజయవాడ సమీపానగల రాయనపాడు వద్ద స్థాపించనున్నట్లు తెలియవచ్చింది.

నేడిక్కడ జరిగిన "కృష్ణాజిల్లా భద్రతా వారం" గోష్ఠిలో పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రీ టి. కె. దివన్ సూచనప్రాయంగా యీ విషయాన్ని వెల్లడించారు

అధికార భాషా కమిషన్ చర్చలు

హైదరాబాదు, అక్టోబరు 25

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, సభ్యులు శ్రీయుతులు కంభంపాటి సత్యనారాయణ, ఖాన్మాదార్యులు, కార్యదర్శి శ్రీ జి. రామకృష్ణారావు ఇటీవల భువనేశ్వర్‌లో ఒరిస్సా అధికార్లతో చర్చలు జరిపారు.

గంగా జలాల సమస్యపై భారత్ వ్యతిరేక ప్రచారం

అగర్తలా, అక్టోబరు 25

పరక్కా సమస్యను భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య ద్వైపాక్షిక సంప్రదింపుల ద్వారానేపరిష్కరించుకోవాలనిబంగ్లాదేశ్‌లో భారత్ హైకమిషనర్ శ్రీ సమర్ సేన్ నేడు చెప్పారు

శ్రీ సేన్ నిన్న ఇక్కడకు వచ్చారు గంగా జలాల సమస్యపై భారత్ వ్యతిరేక ప్రచారాన్ని సాగించటంద్వారా బంగ్లా ప్రజలను తప్పుదారి పట్టించటం జరుగుతున్నదని ఆయన సమాచార్‌కు చెప్పారు.

భారత, డెన్మార్క్‌ల మధ్యవాణిజ్యచర్చలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25

రెండు దేశాలమధ్య వాణిజ్యాన్ని పెంపు చేసుకోవటం, సంయుక్త ప్రాజెక్టులను చేపట్టటానికిగల అవకాశాలను పరిశీలించేందుకు భారత్, డెన్మార్క్‌ల వాణిజ్య ప్రతినిధివర్గాల మధ్య నేడు చర్చలు ప్రారంభమయ్యాయి.

బషీరుద్దీన్ నియామకం

హైదరాబాద్, అక్టోబరు 25

శ్రీ బషీరుద్దీన్ అహమ్మద్‌ను అడిషనల్ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ (హైదరాబాదు) ఛైర్మన్‌గా నియమించారు.

పార్లమెంటుకే రాజ్యాంగసవరణాధికారం

బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ శ్రీ ఇంద్రజిత్ గుప్తా స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 25

44 వ రాజ్యాంగ సవరణ బిల్లులోని ప్రధాన ఆదేశాలు, లక్ష్యాల పట్ల నేడు లోక్‌సభలో కమ్యూనిస్టుపక్ష నాయకులు శ్రీ ఇంద్రజిత్‌గుప్తా హర్షం ప్రకటించారు.

నూతన రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటు డిమాండ్‌ను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ సామాజిక_ఆర్థిక పరివర్తనకు గల ప్రతిబంధకాలను తొలగించేందుకు బిల్లులో గల క్లాజులను యింకా పటిష్టం చేయాలని తమ పార్టీ అభిప్రాయపడుతూందని ఆయన అన్నారు. బిల్లులోని కొన్ని క్లాజులకు ఆయన తన వ్యతిరేకతను తెలిపారు. అవి బిల్లు ప్రకటిత లక్ష్యాల కనుగుణంగా లేవన్నారు. అటువంటి అంశాలను నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ప్రస్తుత రాజ్యాంగం ధనిక వర్గాలు, విస్తృత సంఖ్యలోగల శ్రామిక ప్రజలమధ్య రాజీని ప్రతిబింబించింది ఈ రాజీని తొలగించేందుకు పోరాటం సాగుతూనే వున్నది. అయితే ప్రస్తుత సవరణ బిల్లు యీ రాజీని

పూర్తిగా అధిగమించలేదు. ఈ బిల్లు ఆ దిశగా ఒక నిర్ణయాత్మకమయిన ముందడుగు - అందువల్లనే యిది హర్షణీయమైన చర్య అని ఆయన అన్నారు.

గత కొద్ది రోజులనుండి ఈ బిల్లు ఆమోదానికి వ్యతిరేకంగా కొన్ని విరుద్ధ శక్తులు పనిచేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రస్తుత పార్లమెంటుకురాజ్యాంగాన్ని సవరించే అధికారం లేదని బిల్లు విమర్శకులు కొందరువాదిస్తున్నారు. కొన్ని కాంగ్రెస్ కమిటీలు రాజ్యాంగసవరణలను హర్షిస్తూనే రాజ్యాంగ సవరణ నిమిత్తం నూతన రాజ్యాంగ నిర్ణాయక సభను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలతో ముందుకువస్తున్నాయని శ్రీ గుప్తా వివరించారు.

పై రెండు పరస్పర విరుద్ధమైన వాదనలుగా కనిపించినప్పటికీ వాటి అర్థం మాత్రం ఒకటే-వారు పార్లమెంటు అధిక్యతను, దానికిగల రాజ్యాంగ సవరణ అధికారాలు ప్రశ్నిస్తున్నారు. కమ్యూనిస్టుపార్టీ ఈరెండు రకాల వాదనలను ఖచ్చితంగా వ్యతిరేకిస్తున్నది. ప్రస్తుత పార్లమెంటులో రాజ్యాంగాన్ని సవరించే అధికారంవున్నదని గట్టిగా విశ్వసిస్తున్నదని ఆయన అన్నారు.

శ్రీ గుప్తా యింకా ఇలా అన్నారు:

"ప్రస్తుతంవున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంస్థానే అధ్యక్ష పాలన లేదా మరొక విధమయిన పద్ధతి ప్రవేశ పెట్టాలని ఎవరైనా అనుకొనప్పటికీ రాజ్యాంగ నిర్ణాయకసభ అవసరం వుత్పన్నమౌతుంది. భారతదేశం లాంటి సువిశాలదేశం యొక్క ఐక్యత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా మాత్రమే కొనసాగించబడుతుంది.సంరక్షించబడుతుంది. ఇతరత్రా ఏపద్ధతి అయినా ప్రమాదకరమైనది మాత్రమే."

రాజ్యాంగంలోని ఉపక్రమణికలో సోషలిజం, లౌకికవ్యవస్థఅన్నమాటలను చేర్చడం పట్ల శ్రీగుప్తా హర్షం ప్రకటించారు. అంతేకాక సోషలిజంయొక్క ప్రధాన అంశాలు కొన్నింటిని ఆదేశక సూత్రాలలో నిర్దిష్టంగా [illegible] చేయాలని ఆయన అన్నారు. సమిష్టిగా బేరసారాలాడే హక్కును ఆదేశక సూత్రాలలో చేర్చాలని గుప్తా చెప్పారు.

యువజనులు శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడారంగ సంబంధమైన హక్కునుగూడా వీటిలో పొందుపరచాలని అన్నారు.

లక్షా80వేల ఎకరాలపై ట్రిబ్యునళ్ళ ముందు భూస్వాముల అప్పీళ్ళు

రెవిన్యూమంత్రి శ్రీనరసారెడ్డి ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, అక్టోబరు 25

సెప్టెంబరు చివరినాటికి రాష్ట్రంలో లభించిన మిగులు భూమి 4,36,532 ఎకరాలలో 1,80,283 ఎకరాలపై ట్రిబ్యునళ్ళ ముందు అపీళ్ళకు వెళ్ళినట్టు రెవిన్యూ మంత్రి ప్రకటించారు

భూగరిష్ట పరిమితి చట్టానికి మించి అధికంగాగల భూస్వాములు మిగులుగా తేలిన తమ భూములగూర్చి ట్రిబ్యునళ్ళ ముందు అప్పీళ్ళు చేసుకున్నారు.

ఇలాంటి అప్పీళ్ళు చేసుకున్న భూస్వాముల కేసులు పశ్చిమగోదావరిజిల్లాలో 1089 నెల్లూరులో 854, కర్నూలులో 848, తూర్పు గోదావరిజిల్లాలో 781, మెదక్‌లో 524 వున్నాయన్నారు

అప్పీళ్లు అతితక్కువ సంఖ్యలో వున్న జిల్లా ఆదిలాబాదు అని అయన అన్నారు. ఆ జిల్లాలో 76 అప్పీళ్లు వచ్చాయి.

సెప్టెంబరు చివరినాటికి మిగులు తేలిన 25 వేల ఎకరాల మాగాణిలో 18 వేల ఎకరాలు ట్రిబ్యునల్స్ ముందు తీర్పుకు వున్నాయి

ఇప్పటివరకూ 4 వేల ఎకరాల మాగాణి 51 వేల ఎకరాల మెట్ట మాత్రమే మిగులుగా తేలిన భూములనుండి ప్రభుత్వ స్వాధీనమయింది.

రాష్ట్రంలో పని చేస్తున్న 93 ట్రిబ్యునల్స్ మొత్తం 4.4 లక్షల డిక్లరేషన్‌లలో 3 33 లక్షలను విచారించింది. మిగులుభూమి ఉన్న 22531 డిక్లరేషన్‌లవల్ల 25 వేల ఎకరాల మాగాణి 4,11,532 ఎకరాల మెట్ట లభించింది.

ట్రిబ్యునల్‌ముందు అప్పీలు చేసుకున్న కేసుల సంఖ్య కడప, నిజామాబాద్, అదిలాబాద్‌లలో తప్ప ఎక్కడా 200 కు తక్కువగా లేదు.

ప్రభుత్వానికి స్వాధీనపరచిన మిగులు భూముల పంపకం తాజా సమాచారం ఇంకా అందలేదని రెవిన్యూమంత్రి వెల్లడించారు.

రాజ్యాంగసవరణ, పరిరక్షణలకు సర్వాధికారాలుకల సంస్థ పార్లమెంటు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, లెజిస్లేచర్ కాంగ్రెస్‌పార్టీల తీర్మానం:

అత్యవసర కర్తవ్యాలుగా ఆరు అంశాల అమలుకు పిలుపు

[విశాలాంధ్ర విలేకరి]

హైదరాబాద్, అక్టోబరు 25

రాజ్యాంగ సవరణకు, పరిరక్షణకు సర్వాధికారాలుగల సంస్థ పార్లమెంటేనని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ, రాష్ట్ర లెజిస్లేచర్ కాంగ్రెసు పార్టీల సంయుక్త సమావేశం నేడిక్కడ పునరుద్ఘాటించింది.

పి. సి. సి. అధ్యక్షులు శ్రీ తాడేపల్లి మునలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పై మేరకు ఒక తీర్మానం ఆమోదించింది.

దేశ ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు తగిన విధంగా రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని పార్లమెంటుకు రాజ్యాంగ నిర్మాతలు దఖలు పరచినట్లు ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

ప్రస్తుతం పార్లమెంటు ముందున్న 44 వ సవరణ బిల్లును పూర్తిగా సమర్థిస్తూ ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు.

అత్యవసరంగా చేపట్టవలసినకర్తవ్యాలుగా ఆరు అంశాలను ఈ తీర్మానంలో పేర్కొని, వీటి అమలుకు అవసరమైనమేరకు ప్రస్తుత లోక్‌సభ, శాసన సభల కాల పరిమితిని పొడిగించాలని సమావేశం కోరింది.

ఆ అంశాలు యివి :

1. పారిశ్రామిక శాంతి పరిరక్షణ.
2. శాస్త్రీయ సాంకేతిక పారిశ్రామిక పురోగతి.
3. గ్రామీణ రంగంలో సస్య విప్లవం కొనసాగింపు.
4. అంతర్జాతీయ వ్యాపార వాణిజ్యాల అభివృద్ధిని మరింత శీఘ్రతరం చేయడం.
5. ఉత్పత్తి శక్తుల సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం.
6. బలహీనవర్గాలకు సంక్షేమ, ఆర్థిక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు పరచడం.

ఈ దృష్ట్యా ప్రస్తుత ఆర్థిక అభివృద్ధి రేటును శీఘ్రతరం చేసేందుకు అత్యవసర పరిస్థితివల్ల ఒనకూడిన జాతీయ ప్రయోజనాలను మరింత దృఢపర్చుకునేందుకు, ప్రధాన మంత్రి ఆర్థిక కార్యక్రమాన్ని పూర్తిగా అమలుపర్చడానికి వీలుగా అవసరమైనంత మేరకు ప్రస్తుత లోక్‌సభ, శాసనసభల కాల పరిమితిని పొడిగించాలని తీర్మానం కోరింది.

సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన సమావేశం 5½ గంటల వరకు జరిగింది. సమావేశంలో 310 మంది సభ్యులకుగానూ 245 మంది హాజరయ్యారు వీరిలో కాంగ్రెస్ అడ్‌హాక్ కమిటీ సభ్యులు కూడా పలువురు వున్నారు.

సమావేశ ప్రారంభంలో ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ప్రసంగించారు అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ పి. రామచంద్రారెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అంతకు ముందు ఆయన రాజ్యాంగసవరణ బిల్లు గురించి సవివరంగా చర్చించారు.

విజ్ఞానదాయకమైన చర్చ జరిగిందని సమావేశానంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ శ్రీ రామచంద్రారెడ్డి తెలిపారు

శ్రీ రామచంద్రారెడ్డి తీర్మానాన్ని శ్రీ అయ్యపురెడ్డిబలపరిచారు శ్రీకొండాలక్ష్మణ్ బాపూజీకూడా తీర్మానానికి అనుకూలంగా మాట్లాడారు.

ఎవరూతీర్మానాన్ని వ్యతిరేకించ లేదని, ఏకగ్రీవంగా ఆమోదించబడిందని శ్రీ మునలయ్య తెలిపారు.

సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన మంత్రి ఎస్. వెంకట్రామరెడ్డి, శాసనమండలి సభ్యుడు తిరుపతిరావు, శివరామప్రసాద్, ఆస్థానకవి విశ్వనాథల మృతికి సంతాప తీర్మానాన్ని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు.

సమావేశం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది

చైనాకు సోవియట్ మంగోలియావిజ్ఞప్తి

మాస్కో, అక్టోబరు 25

చైనాతో సాధారణ సంబంధాలు, సహకార పునరుద్ధరణకై చిరకాలంగా ఎన్నోసార్లు చేస్తున్న విజ్ఞప్తిని సోవియట్, మంగోలియాలు నిన్న పునరుద్ఘాటించాయి.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి లియోనిడ్ బ్రెజ్నేవ్‌తో మంగోలియా అధ్యక్షులూ, పార్టీ నాయకులైన యుండాగిన్ సెడెన్‌బాల్ చర్చలు ముగిసిన సందర్భంగా విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ విజ్ఞప్తి చేయబడింది.

చైనాతో సోవియట్, మంగోలియా, సంబంధాల సాధారణ స్థితిపై బ్రెజ్నేవ్, సెడెన్‌బాల్ చర్చించారు.

త్వరలో అమెరికా వియత్నాం చర్చలు

వాషింగ్టన్, అక్టోబరు 25

దౌత్యసంబంధాల పునరుద్ధరణపై చర్చలకు అమెరికా ప్రతిపాదనను వియత్నాం అంగీకరించిందని విదేశాంగమంత్రి కిసింగర్ నిన్న ధృవీకరించారు.

వియత్నాంలో జాడ తెలియని అమెరికన్‌ల సమస్యల పరిష్కారాన్ని ముందు షరతుగా అమెరికా ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది వివరాలను కిసింగర్ వెల్లడించలేదు.

విక్టోరియా కాలంనాటి నాణాలు; వరహాలు

గిద్దలూరు, అక్టోబరు 25

గిద్దలూరులో యీ నెల 19న బి.డి.ఓ. ఒంగోలుకు చెందిన సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు దాడిచేసి ఒక వ్యక్తి నివాసంనుండి స్వాధీన పర్చుకున్న బంగారంలో విక్టోరియా కాలంనాటి నాణాలు లభ్యమయ్యాయి.

అవి 55.7 గ్రాముల బరువు వున్నాయి వాటితోపాటు రు. 3,500 విలువగల 20.5 గ్రాముల బరువున్న 6 వరహాలు కూడా స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రంలో 47 కొత్తతాలూకాలు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 25

రాష్ట్రంలో నూతనంగా మరో 47 తాలూకాలు ఏర్పాటుచేసినట్లు రెవిన్యూ మంత్రి శ్రీ పి నరసారెడ్డి నేడిక్కడ వెల్లడించారు

దీనితో రాష్ట్రంలో మొత్తం తాలూకాల సంఖ్య 243 కు పెరుగుతుంది

రెవిన్యూబోర్డుకు ప్రత్యామ్నాయంగా పునర్నిర్మించబడుతున్న రెవిన్యూ శాఖ పరిపాలన సమర్థవంతంగా, గ్రామ, తాలూకా స్థాయివరకూ ప్రభుత్వ విధానాలు త్వరితగతిన అమలు చేసేరీతిలో ఉండగలవని తెలిపారు.

ప్రస్తుతమున్న సబ్ తాలూకాలన్నీపూర్తి తాలూకా స్థాయికి అప్‌గ్రేడ్ చేయబడతాయి. ఇవికాక, ప్రతిజిల్లాలో అదనంగా మరో తాలూకా ఏర్పాటు చేయబడుతుందని సచివాలయంలో పత్రికా విలేకరులకు ఆయన తెలిపారు.

కొత్త తాలూకాలతోపాటు మరో 9 కొత్త రెవిన్యూ డివిజన్‌లను కూడాఏర్పరుస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 67 రెవిన్యూ డివిజన్‌లు పనిచేస్తున్నాయి. గిరిజన ప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న నాగార్జునసాగర్, పోచంపాడు ప్రాజెక్టు ఏరియాలలో పరిపాలనా సౌలభ్యానికి కొత్త డివిజన్‌లు ఏర్పరుస్తున్నామని వివరించారు.

తాలూకాల పునర్వ్యవస్థీకరణ ఫలితంగా పంచాయతీ సమితి, తాలూకా కోటెర్మినస్ (ఏకీకరణ) అవుతుంది దీనివల్ల పంచాయతీ సమితులు తగ్గి తాలూకాల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 321 పంచాయతీ సమితులున్నాయి

వీటిలో 70 సమితులు తగ్గిపోగలవని మంత్రి అన్నారు

పునర్నిర్మాణంవల్ల ప్రస్తుతం వున్న 196 తాలూకాలను కలుపుకొని రాష్ట్రం మొత్తంలో మొత్తం 243 తాలూకాలు ఏర్పడతాయి

ఇందుకు సంబంధించి ఇటీవల పంచాయతీరాజ్ అధికార్లు ముఖ్యమంత్రి కార్యదర్శి, రెవిన్యూ అధికార్ల సమావేశం జరిపారని శ్రీ నరసారెడ్డి అన్నారు.

కోర్టు తీర్పుపై ప్రభుత్వంఅప్పీల్

హైదరాబాద్, అక్టోబర్ 25

భూ సంస్కరణల చట్టానికి భిన్నంగా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేయడానికి నిర్ణయించింది.

ఇటీవల రెండు మూడు కేసుల్లో ఒక హైకోర్టు న్యాయమూర్తి ఆ చట్టానికి భిన్నంగా తీర్పిచ్చిన విషయాన్ని రెవిన్యూ మంత్రి శ్రీ నరసారెడ్డి నేడిక్కడ ప్రస్తావించారు

కంపెనీలు, సంస్థలకుచెందిన భూములు ఇల్లరికం సమస్యలకు సంబంధించి ఈ తీర్పులు చెప్పారన్నారు.

విశాలాంధ్ర

1976 అక్టోబరు 26 మంగళవారం

దుష్టత్రయం వీటో

నమీబియాకు స్వాతంత్ర్యం ప్రకటించకుండా, దురాక్రమణను కొనసాగిస్తున్న శ్వేతజాతి దురహంకార దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై వత్తిడితెచ్చేందుకు వీలుగా ఆ దేశానికి జరిగే ఆయుధ సరఫరాలను నిషేధించాలన్న వర్ధమాన దేశాల తీర్మానంపై దుష్టత్రయం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, భద్రతా సంఘంలో తాజాగా ప్రయోగించిన వీటో ఆయుధం కొత్తదేమీ కాదు. ఆఫ్రికా ప్రజల స్వేదం, రక్తం రుచిమరగి ఇన్నాళ్ళుగా కొనసాగిస్తున్న తమ నిత్యదోపిడీ పీడనను శాశ్వతం చేసుకోవాలనీ, దక్షిణాఫ్రికాలో పాలన సాగించే ముష్కర జాత్యహంకార కీలుబొమ్మ ప్రభుత్వాలకు రక్షణవలయాలను కల్పించాలని సిగ్గుయెగ్గులుమాని పన్నుతున్న దుష్ట పన్నాగాలలో భాగమే యిది.

దక్షిణాఫ్రికాప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని సమర్థిస్తామనీ, అక్కడ న్యాయం జరిగేట్లు చూస్తామనీ ఒక ప్రక్క నయవంచనతో మొసలికన్నీరు కార్చుతూ మరొక ప్రక్క ఆవిమోచన పోరాటాలకు తీవ్రమైన అవరోధాలు, ప్రతిబంధకాలుకల్పిస్తున్న నయావలసవాదుల సహజనైజాన్ని యీ వీటో మరొక్కసారి ప్రపంచానికి సుస్పష్టం చేసింది.

జాత్యహంకార విధానాలను అనుసరిస్తున్నందుకు ఐక్యరాజ్యసమితి నుండి దక్షిణాఫ్రికాను బహిష్కరించాలని రెండేళ్ళ క్రితం ప్రతిపాదించిన తీర్మానాన్ని అలాగే గత ఏడాది ఆయుధ సరఫరాలను నిలుపుదల చేయాలన్న తీర్మానాన్ని యీ మూడుదేశాలు ప్రపంచ సంస్థ అయిన ఐ. రా. స. సభ్యదేశాల అభిప్రాయాన్ని తోసిరాజని వీటోచేశాయి. 1976 ఆగస్టు నెలలోపల నమీబియాకు స్వాతంత్ర్యం ప్రకటించాలన్న నమీబియా వ్యవహారాల ఐ రా.స. సంఘంపెట్టిన గడువును కాలదన్ని యింక రెండు సంవత్సరాల నాటికి స్వాతంత్ర్యం ప్రకటించే సమస్యనుపరిశీలిస్తామన్న దక్షిణాఫ్రికా ప్రధాని వోర్‌స్టర్ ప్రకటనను అందరూ ఖండిస్తే యీ అగ్రరాజ్యాలకు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వున్నది.

అదేవిధంగా నమీబియా స్వాతంత్ర్య పోరాటంలోఏకైక ప్రతినిధియైన 'స్వాపో' (నైరుతి ఆఫ్రికాప్రజాసంఘటన)ను వదలివేసి తమ అడుగులకు మడుగులొత్తే కొంత మంది "గిరిజన నాయకులతో వోర్‌స్టర్ రాజ్యాంగ చర్చలు, సమాలోచనలు జరుపుతుంటే, వారిని తన ప్రభుత్వంలో నియమించుకొంటుంటే "నమీబియా ప్రజల పక్షాన నిలచే" యీ అగ్రరాజ్యాలకు ఆలోచించే శక్తి లేకపోయేంత దివాళాకోరు తనానికి దిగజారిపోయాయి.

రొడీషియాలో శ్వేతజాతి దురహంకారి ఇయాన్‌స్మిత్ ప్రభుత్వంపై ఐ. రా. స. విధించిన అనేక ఆంక్షలను బరితెగించి ఉల్లంఘించి, కోట్ల డాలర్ల విలువగల ఆయుధాలను అమ్ముకొని బ్రతికే యీ అగ్రరాజ్యాలకు దక్షిణాఫ్రికా ప్రజల స్వాతంత్ర్య పోరాటసమస్య ఆ జాతి దురహంకార ప్రభుత్వంపై విధించిన ఆంక్షల ప్రాముఖ్యత ఏమాత్రం అర్థంకావు.

ఏమైనా శిఖండులవలె ఎన్నిసార్లు అడ్డం నిలిచినా ఆఫ్రికా ప్రజల విమోచనోద్యమ మహావెల్లువను అపుచేయాలన్న నయావలస వాదుల ప్రయత్నాలు తుత్తునియలై పోకమానవు. రాగల శుభ పరిణామాలలోభాగమే నేడు దక్షిణాఫ్రికాలో జరుగుతున్న విముక్తియోధుల రక్తతర్పణ. జింబాబ్వే ప్రజల సాయుధ సమర శంఖారావం 'స్వాపో' విజయపరంపర, జెనీవా మహాసభల, సంరంభం, ఐ రా.స. వంటి ప్రపంచ సంస్థలలోని స్వేచ్ఛాకాముక స్వాతంత్ర్య పిపాసుల ప్రగతిశీల శక్తుల రణన్నినాదం.

కాంగ్రెస్ వాదుల వాదనలు అనవసరమూ, అవాంఛనీయం

రాజ్యాంగ సవరణలపై మాజీ పి సి.సి అధ్యక్షుని అభిప్రాయం

సామర్లకోట, అక్టోబరు 24

రాజ్యాంగ 44వ సవరణ బిల్లును ప్రవేశపెట్టే అధికారం పార్లమెంటుకు వున్నదా లేదా అనే విషయంపై కొందరు కాంగ్రెస్ వాదులలో చెలరేగిన అభిప్రాయ భేదాలు అనవసరమూ అవాంఛనీయమని మాజీ పి. సి సి. అధ్యక్షులు శ్రీ మహమ్మద్ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇటువంటి వాదన దేశమంతటా గందరగోళం, తప్పు ఆలోచనలకు దారితీస్తుందని ఆయన అన్నారు రాజ్యాంగాన్ని సవరించే హక్కుపై 1971 ఎన్నికలలోనే ప్రజల నుండి స్పష్టమైన తీర్పుపొందటం జరిగిందని ఆయన అన్నారు

ప్రతి రంగంలోనూ పెంపొందే ప్రగతినంతను నాశనం చేసేందుకు దొంగచాటుగా కుట్ర పన్నుతున్న సంఘవ్యతిరేక శక్తుల తప్పుడు ప్రచారానికి కొందరు కాంగ్రెస్‌వాదులు గురికావడమే లేదా 1971 ఎన్నికల మ్యానిఫెస్టోలోని రాజ్యాంగానికి సంబంధించిన 1) వ ఆర్టికల్ వారి కనుమరుగవడమో ఎడిపోవడమో జరిగివుంటుందని ఆయన అన్నారు.

రాజ్యాంగ సవరణపై తాజాగా ఎన్నికలు జరపాలనీ లేదా రాజ్యాంగ నిర్ణాయక సభను ఏర్పాటు చేయాలనీ ఇతరత్ర వినాశకరప్రత్యామ్నాయ సూచనలను ప్రతిపక్షపార్టీలు చేయవచ్చునుగాక కాంగ్రెస్ వాదులంతా ప్రజలకు సరైన మార్గనిర్దేశకత్వం వహించాలని ఆయన అన్నారు

ఖర్గపూర్‌లో మట్కా ఆట నిర్మూలనకై విజ్ఞప్తి

ఖర్గపూర్, అక్టోబరు 2)

అత్యవసర పరిస్థితి ప్రకటనకు పూర్వం 'మట్కా' "సట్కా" అనే పేర్లతో బ్రాకెట్ ఆట ఖర్గపూర్‌లో పెద్దఎత్తున జరుగుతుండేది. ఈ ఆటలో డబ్బు కట్టి అదృష్టాన్ని పరీక్షించుకొని పస్తులు వుండు చున్న కార్మిక కుటుంబాలెన్నో వున్నాయి. దివాలా తీసిన చిన్న దుకాణా దారులున్నారు. ఎంతమంది యువకులు, ఉద్యోగులు దీనికి బానిసలై ప్రక్కదారులు పట్టారు. అత్యవసర పరిస్థితి అనంతరం ఇది తగ్గిపోయింది

అయితే ఇది తిరిగి ఇటీవల పట్టణంలో ఆరంభించింది కనుక వెంటనే బాధ్యులు తగు చర్యలు గైకొనాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇటీవల పోలీసులు రెండు ప్రెస్‌లపై దాడిచేసి బ్రాకెట్ టికెట్టు పుస్తకాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిని కస్టడీలోనికి తీసుకున్నట్లు కూడా తెలిసింది. (వి వి)

దక్షిణాఫ్రికాప్రజల సమరజ్వాల

"నీగ్రో ప్రజల విముక్తి ఉద్యమం దక్షిణాఫ్రికాలో సంపూర్ణ సాయుధ పోరాటం జరిపేందుకు పరిస్థితి పరిపక్వమైంది" అని ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్ సభ్యులలో ప్రముఖురాలయిన డాక్టర్ ఫ్రెనె గిన్వాలా చేసిన ప్రకటనను అతి కొద్దిమంది రాజకీయ పరిశీలకులు మాత్రమే తీవ్రమైనదిగా పరిగణించి వుండవచ్చు. ఇటీవల ఢిల్లీలో పత్రికా విలేకర్లతో మాట్లాడుతూ, దక్షిణాఫ్రికా సైన్యాలమీద అంగోలాలోని ఎం. పి ఎల్ ఏ. దళాలు విజయం సాధించడాన్ని ఆమె ప్రత్యేకంగా పేర్కొన్నారు. "గొరిల్లా దళాలకన్నా దక్షిణాఫ్రికా సైన్యం శక్తివంత మయిందన్న భ్రమను తుడిచిపెట్టింది" అని ఆమె అన్నారు.

ఆమె చెప్పినదాన్నిబట్టి, మరొక అనుకూల పరిణామం కార్మికవర్గ పోరాటం ఉధృతం కావడం. దక్షిణాఫ్రికా అధికార వర్గాలు ఏ ఒక్క కార్మిక సంఘాన్ని గుర్తించక పోయినప్పటికీ, "సమ్మె లేకుండా అక్కడ ఒక్కవారం గడవడం కనాకష్టం"గా వుంది అన్నారు.

డా॥ గిన్వాలా చేసిన పై ప్రకటన, నిజానికి దక్షిణాఫ్రికాలో రూపుగొంటున్న పరిస్థితినంతటినీ విశదీకరించే సంపూర్ణ ప్రకటన కాదు. అయినప్పటికీ, ప్రస్తుత దశలో దక్షిణాఫ్రికా ప్రజా విముక్తి పోరాటాన్ని గురించిన ఆమె అంచనా, నేడక్కడకేవలం దాడులు జరగడం, లేక అక్కడ అత్యవసర పరిస్థితి అమలు జరుపుతూండడమో, ప్రిటోరియాలోని జాత్యహంకార పాలకులు, విదేశాలలోని వారి పోషకులు, అక్కడి పరిస్థితిని సమర్థించుకొనడానికి నానా తిప్పలు పడుతూండడమో మున్నగు విషయాలకు మాత్రమే సంబంధించినది కాదనే స్పష్టం చేస్తున్నది. ఐ రా స లోని భారతీయ ప్రతినిధి దక్షిణాఫ్రికా పరిస్థితిని అభివర్ణిస్తూ, "తరతరాల ఆవేశం అనంతరం ప్రతిష్ట, స్వయం ప్రతిపత్తి కోసం పెల్లుబికిన మానవుని మనో స్థైర్యంయొక్క వాంఛల అనివార్య విజృంభణ" అని అన్నారు.

'శాంతియుతంగా మేము 60 ఏళ్ళ పాటు సుదీర్ఘ పోరాటం జరిపాము. కాని, శాంతియుత ప్రదర్శకులను పోలీసులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతూంటే మేమేమి చేయగలం! ఈ సైనిక ప్రభుత్వానికి సాయుధ పోరాట మొక్కటే సరైన సమాధానమని మా యీ క్లిష్టతర మార్గంలో తెలుసుకున్నాము" అని డా. గిన్వాలా చెప్పారు.

జోహాన్స్‌బర్గులో ముఖ్యంగా నగర శివార్లలోని సావెటో అనే గ్రామంలో ప్రారంభమైన పోరాటం నేడు యితర పట్టణాలకు, నూతన ప్రదేశాలకు పాకుతూంది. ఇంతకూ యిదంతాకూడ, నీగ్రో పౌరులను తమ భవిష్యత్ సంతతిని తమ స్వదేశంలోనే రెండవ తరగతి పౌరులుగానే వుంచడానికి ఉద్దేశించిన దక్షిణాఫ్రికా ప్రభుత్వ జాతి వివక్షతకూ అమానుష దమనకాండకూ వ్యతిరేకంగా నిరనిరసన తెలుపుతూ పాఠశాల విద్యార్థులు జరిపిన శాంతియుత ప్రదర్శనతో ఆరంభమయింది

దక్షిణాఫ్రికా జనాభాలో 80 శాతానికి పైగా నీగ్రోలు వీరికి కేవలం 14 శాతం సాగుకు లాయకీ అయిన భూమిని వదలి, మిగతా భూమినంతనూ అల్ప సంఖ్యాకులైన శ్వేత జాతీయులు ఆక్రమించుకున్నారు. ఒకే విధమైన పనికి శ్వేతజాతి కార్మికునికి సాధారణంగా చెల్లించే వేతనంలో 10వ శాతం మాత్రమే నీగ్రో పనివానికి చెల్లించబడుతుంది. నేడు, యీ కృత్రిమవర్గ విభజనను శాశ్వతంచేసే ప్రయత్నంలో భాగంగా, అధికార వర్గాలు, నీగ్రో విద్యార్థులకు 'ఆఫ్రికాన్స్' భాషను బోధన భాషగా ప్రవేశ పెట్టారు.

ఇందుకు నిరసనగా 10,000 మంది విద్యార్థులు శాంతియుత ప్రదర్శనను జరిపారు కాని, జాత్యహంకార ప్రభుత్వ పోలీసులు వారిని నిలువునా కాల్చి చంపుతున్నప్పుడు ఎవరేమి చేయగలరు. అని డా॥ గిన్వాలా పేర్కొన్నారు. ఈ పోరాటంలో నూరు మందికి పైగా బలైనారు వేలాది మంది గాయపడ్డారు. అది ఒక సంకుల సమరం! న్యాయం, ప్రతిష్టకోసం డిమాండు చేస్తూ వున్న ప్రజలపైన ఆ ఘాతుక యుద్ధాన్ని శ్వేత జాతి పాలకులు ప్రయోగించారు

ఆఫ్రికాన్ భాషా వ్యతిరేక నిరసన కేవలం జాత్యహంకార ప్రభుత్వం పైన పెల్లుబికినఅనంతృప్తికి చిహ్నం మాత్రమే: వోస్టర్ సైనిక ప్రభుత్వం క్రూరమయిన మారణ హోమం జరుపుతున్నప్పటికీ, ప్రజా పోరాటం తిరిగి మరింత ఉధృతంగా పెరుగుతూ వుంది చరిత్ర ఎల్లప్పుడు పీడితుల పక్షమే వహిస్తుంది. అంగోలా, మొజాంబిక్‌లలోనూ, యితర శ్వేతజాతి వలస రాజ్యాలలోనూ అక్రమపాలకుల గతిఏమైంది! దక్షిణాఫ్రికాలోని జాత్యహంకారులు వాస్తవానికి అత్యంతాందోళన చెందుతున్నారు వారు ఎంత క్రూరంగా ప్రవర్తిస్తే అంత ఎక్కువగా వారిపై వత్తిడి ప్రబల మవుతూ వుంది.

సామ్రాజ్యవాదులా, అభివృద్ధి నిరోధకుల కుట్ర

జాత్యంహకారులు తమను రక్షించుకొనేందుకు పశ్చిమ ప్రపంచంలోని తమ పోషకుల మీదనే ఆశలుపెట్టుకొని బ్రతుకుతున్నారు. నేడు ప్రిటోరియా, శాలిస్‌బరీ, టెల్-అవీవ్ వాషింగ్టన్, బాన్‌ల మధ్య విస్పష్టంగా తుదిరూపం దిద్దుకుంటున్న అసహ్యాకరమైన రహస్య కుట్ర, దక్షిణాఫ్రికాప్రజల విముక్తి క్రమాన్ని కాస్త ఆలస్యం చేయగలగవచ్చు. కాని, చివరకు పరాస్తం కాక తప్పదు.

ఏ ఆయుధమైనా, అది ఎంత అధునాతనమైనదైనప్పటికీ, కృతనిశ్చయంతో విముక్తిపథంలో పురోగమించే ప్రజలను అణచివేయజాలదు. చరిత్రాత్మకమైన వియత్నాం ప్రజల విజయం, ఇటీవలి అంగోలా ప్రజల విజయం యిందుకు ప్రత్యక్ష నిదర్శనలు.

ఎస్. డబ్ల్యియు. దాంటె

నేటి వర్తమాన ప్రపంచంలో, పాతకాలపు పద్ధతులనే పట్టుకు వ్రేలాడుతున్న జాత్యహంకారుల, వారి సామ్రాజ్యవాద మద్దతుదార్ల ఎత్తుగడలు పసలేనివని తేలిపోయింది. బలవత్తరమైన సోషలిస్టు ప్రపంచమూ, ప్రపంచ వ్యాపిత సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తూవున్న ప్రజ, శాంతినీ, జాతుల స్వాతంత్ర్యాన్నీ కాంక్షించే ప్రభుత్వాలు న్యాయమైన హక్కులకోసం పోరాడుతూన్న ప్రజల పక్షాన అచంచలంగా నిలబడ్డాయి.

'టాస్'వార్తా సంస్థ రాజకీయ పరిశీలకుడు గొంచరోవ్ యిలా చెప్పారు. '18 సంవత్సరాల క్రితం షార్పెవిల్లెలో కాల్పులు జరిగిన చందంగానే, సావెటోలో జరిగిన ఘటనలు కూడా ప్రస్ఫుటమయ్యాయి. వోర్‌స్టర్, ఆయన ముఠా ముసుగులో నుండి బయట పడి, ప్రిటోరియాలో ఎవరున్నారో, అత్యధిక సంఖ్యాకులయిన తన ప్రజలకే దక్షిణాఫ్రికా ఎంతటి నరకంగా తయారైందో ప్రపంచానికి మరొకసారి చూపిస్తున్నారు.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ 25 వ మహాసభ దక్షిణాఫ్రికా జాత్యంహకారుల గురించి చెప్పిన విషయాన్ని ఆ విలేకరి గుర్తుచేశారు. "దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే ప్రజలపైన జాత్యహంకారుల ఆధిపత్యం, మానవాళి న్యాయమైనహక్కునే సవాలు చేస్తున్నది"

జాత్యహంకార ఘాతుకాలకు సభ్య ప్రపంచ నిరసన

దక్షిణాఫ్రికాలో నేడు జరుగుతున్న ఘాతుకమైన రక్తపాతాన్ని నాగరికత ప్రపంచమంతా నిరసిస్తూ వుంది. ఇటీవల ఐ. రా. స. భద్రతాసమితి ప్రిటోరియా సైనికవాద ప్రభుత్వాన్ని ఖండిస్తూ చేసిన తీర్మానంలో కూడా యిదే ప్రస్ఫుటమైంది. జాతి వివక్ష విధానం "మానవాళి న్యాయమైన హక్కులకు, ప్రతిష్టకు వ్యతిరేకంగా నీచమైన నేరం అంతర్జాతీయ శాంతి, భద్రతలను తీవ్రంగా దెబ్బతీస్తుంది" అని ఆ తీర్మానం పేర్కొంది. "దక్షిణాఫ్రికా ప్రజల న్యాయమైన పోరాటాన్ని" ఈ తీర్మానం గుర్తించింది.

దక్షిణాఫ్రికా ప్రజల న్యాయమైన పోరాటాన్ని గుర్తిస్తూ భద్రతా సమితి తీర్మానం, ప్రిటోరియా సైనిక ప్రభుత్వాన్ని ఖండించింది. విముక్తి పోరాట యోధుల మనోస్థైర్యం ఇతోధికంగా పెరుగుతూ వుందనడంలో ఎలాంటి సందేహం లేదని కూడా తీర్మానం పేర్కొంది. ఇది వోర్‌స్టర్ ప్రభుత్వంనుండి నీగ్రోపౌరులకుకొన్ని రాయితీలకు దారితీయవచ్చు. దుష్ట బుద్ధితో కూడిన, అల్పమైన యీ రాయితీలకు కాలం చెల్లిపోయింది. విజృంభించిన ఆఫ్రికన్ యోధులు, అధికారం తమ చేతులలోకి వచ్చేవరకు నిద్రపోరు. ఈ విధంగా దక్షిణాఫ్రికా ప్రజల స్వాతంత్ర్య పోరాటం అనివార్యమైన "అంతిమపోరాటం"గా ఆరంభమైంది. "దక్షిణాఫ్రికాలో అత్యధిక సంఖ్యాకులదే రాజ్యం" అనేదే నేటి నినాదం. నేడు సావెటోలో రగిలిన యీస్వాతంత్ర్య సమరజ్వాల వోర్‌స్టర్ శ్వేతజాతి దురహంకార ప్రభుత్వాన్ని మసిచేసి, దక్షిణాఫ్రికాలో స్వేచ్ఛా పతాకాన్ని ఎగురవేస్తుందనడం నిస్సందేహం.

"చెక్ షర్టింగ్" రకాలకు కనీస గిట్టుబాటు ధర మీటర్ రు. 5-75

కృష్ణాజిల్లా చేనేత పారిశ్రామిక సమాఖ్య కార్యవర్గం విజ్ఞప్తి

మచిలీపట్నం, అక్టోబరు 25

కృష్ణాజిల్లా చేనేత పారిశ్రామిక సమాఖ్య తాత్కాలిక కార్యవర్గం జిల్లాలోని చేనేత పెద్దలతో కలసి యీనెల 14 న శ్రీ బందారు బలరామయ్య అధ్యక్షతన జిల్లా హాండ్‌లూమ్ క్లాత్ ప్రొడ్యూసర్స్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలో సమావేశమై కొన్ని తీర్మానాలు చేసింది.

ప్రభుత్వ ఏజెన్సీలు, ప్రభుత్వ ఆదరణ పొందుతున్న సంస్థలు "చెక్ షర్టింగ్" రకాలను మీటరు రు. 3 నుండి 3-50 కు కొనుగోలు చేస్తున్నాయనీ, ప్రభుత్వం వెంటనే పునరాలోచించి యీ "చెక్ షర్టింగ్" రకాలకు కనీస గిట్టుబాటు ధర మీటరుకు రు. 5-75 చొప్పున యిప్పించి జిల్లాలో నిల్వవున్న సుమారు 2,25,000 మీటర్లు ఖరీదు చేయించాలని యీ సమావేశం కోరింది

ప్రభుత్వం వెంటనే రిబేటు బకాయీలు నగదుగా చెల్లించాలని, నూలు వర్తకులు, నూలు వినియోగదారులనుండి వసూలు చేస్తున్న సేల్స్ టాక్స్‌ను వెంటనే ఉపసంహరించాలని యీ సమావేశం విజ్ఞప్తి చేసింది.

చేనేతశాఖ మంత్రి శ్రీ కె. వి. కేశవులు జిల్లా పర్యటన సందర్భంగా మచిలీపట్నం ఆహ్వానించాలని తీర్మానించి శ్రీ జాగాబత్తుల కోట వెంకటశివయ్య నాయకత్వాన ఆహ్వాన కమిటీని ఏర్పాటుచేశారు.

జెసీస్ ఆధ్వర్యాన ప్రముఖ సాంఘిక కార్యకర్తలకు సన్మానం

మచిలీపట్నానికి సంబంధించి 1976 సంవత్సరానికి ప్రముఖ యువ కార్యకర్తగా చార్టర్డ్ ఎక్కౌంటెంటు, సాంఘిక కార్యకర్త శ్రీ సి. ఎన్. రంగస్వామిని పట్టణ జేసీస్ వారు యీ నెల 10న సత్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు జెసీస్ అధ్యక్షులు శ్రీ వి. బాబూరావు అధ్యక్షత వహించారు. ఇండియన్ జెసీస్ ఉపాధ్యక్షుడు శ్రీ ఎం. ఎ. ఆర్. బేగ్ శ్రీస్వామికి వెండి షీల్డు బహూకరించారు. పట్టణానికి చెందిన ఉత్తను హైస్కూలు ఉపాధ్యాయునిగా శ్రీ ఎ. లక్ష్మణస్వామిని ఉత్తమ ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయునిగా శ్రీ టి పి ఆర్.వి.కె. తులసీదాస్‌లకు కూడా జెసీస్‌వారు సన్మానించారు శాలువలు, మొమెంటోలు, గొడుగులు యిచ్చారు.

సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ జి లక్ష్మణరావుకు కూడా షీల్డు బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ పత్రిక తాజా సంచికను విడుదల చేశారు. శ్రీ బేగ్ సంస్థ సేవలను అభినందించారు కె. సి. శ్రీ ఎం.ఎస్. త్రివిక్రమరావు వందన సమర్పణ చేశారు.

సభలు- సమావేశాలు

ఖమ్మంజిల్లా యువజన, విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యాన నవంబరు 2 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మం "మార్క్స్ భవన్"లో "శాంతి మండలంగా హిందూ మహాసముద్రం" అంశంపై జరిగే సంయుక్త సదస్సులో అఖిలభారత యువజన సమాఖ్య నాయకులు శ్రీ సురవరం సుధాకరరెడ్డి ప్రసంగిస్తారు.

పెండ్లి కానుక

ప్రకాశంజిల్లా పొదిలి తాలూకా చినారకట్ల గ్రామంలో శ్రీ బొల్లా వెంకటేశ్వర్లు తన వివాహ సందర్భంగా తాలూకా కమ్యూనిస్టుపార్టీకి రు. 25, శ్రీ యం. మాలకొండయ్య తమ కుమార్తె కుమారి వెంకటరత్నమ్మ వివాహ సందర్భంగా రు. 25 లు కానుకగా యిచ్చారు

రేడియో లైసెన్సు చెల్లించనందుకు రు. 70 జరిమానా

తణుకు, అక్టోబరు 25

తణుకు తాలూకా దువ్వ గ్రామానికి చెందిన శ్రీ వంకాయల హరనాథకు రేడియో లైసెన్సు రెన్యూ చేయనందుకు తణుకు రెండవ అదనపు మెజిస్ట్రేటు శ్రీ ఎస్. కాశీ విశ్వనాధం రు. 70 జరిమానా విధించారు,

వైర్‌లెస్ లైసెన్సు ఇన్‌స్పెక్టర్ శ్రీ సి హెచ్. ప్రభాకరరావు కేసును నమోదు చేశారు.



రాజోలుతాలూకా సహకార సూపర్‌బజార్‌కు ప్రారంభోత్సవం

రాజోలు, అక్టోబరు 25

రాజోలు తాలూకా సహకార సూపర్ బజార్‌ను రాష్ట్ర సహకార శాఖ మంత్రి శ్రీ బత్తిన సుబ్బారావు యీ నెల 19 న ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా స్థానిక వీరభాను మందిరంలో తూర్పుగోదావరిజిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు శ్రీ ఎస్.బి.పి.బి.కె.సత్యనారాయణ రావు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

కోనసీమ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధ్యక్షులు శ్రీ రుద్రరాజు రామలింగ రాజు సూపర్‌బజారుకు కావలసిన ఆర్థిక సహాయం చేసేందుకు వాగ్దానం చేశారు

గన్నవరం సమితి మాజీ అధ్యక్షులు శ్రీ బోళ్ళ సత్యనారాయణ, స్థానిక శాసనసభ్యులు శ్రీ బిక్కిన గోపాలకృష్ణరావు, గెడ్డం మహాలక్ష్మి కూడా మాట్లాడారు.

రాజోలు సమితి మాజీ అధ్యక్షులు శ్రీ రుద్రరాజు భీమరాజు వందన సమర్పణ చేశారు. (వి.వి)

గుడివాడలోని ప్రకాశం మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల రజతోత్సవం

గుడివాడ, అక్టోబరు 25

నేటి విద్యా విధానంలోవున్న అనేక అవకతవకలవల్ల విద్యార్థులు యిబ్బందులకు గురి కావలసి వస్తున్నదని స్థానిక ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం మున్సిపల్ గరల్స్ హైస్కూలు రజతోత్సవ సభలో మాట్లాడుతూ శాసనసభ్యులు శ్రీ కఠారి సత్యనారాయణ అన్నారు.

గత పాతికేళ్ళుగా హైస్కూలు భవనం ఎదుగూ బొదుగూ లేకుండావుందని, పట్టణంలోని బాలికలందరికీ యిక్కడ తగినంత విద్యా సౌకర్యం లభించటంలేదని, స్కూలు అభివృద్ధికి ప్రజలు, ప్రభుత్వం తోడ్పడా లన్నారు.

ఈ నెల 18వ తేదీ సాయంత్రం జరిగిన యీ ఉత్సవం పార్లమెంటు సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు రజతోత్సవ చిహ్నంగా జ్యోతిని వెలిగించటంతో ప్రారంభమైంది మాజీ శాసన సభ్యులు శ్రీమతి వల్లభనేని శీతామహాలక్ష్మమ్మ హైస్కూలు ఆవరణలో స్వాతంత్ర్యయోధుల చిహ్నాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎస్. రాజశేఖరన్ స్వాగతం చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి వై. లీలారూత్ పాఠశాల నివేదిక నిచ్చారు రజతోత్సవ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి ఎం వి. నాగమణి శ్రీ అంకినీడుకు స్వాగత పత్రం సమర్పించారు

ఈ సందర్భంగా వెలువరించిన రజతోత్సవ సంచికను శ్రీ కె. రాజబాపయ్య ఆవిష్కరించారు. గత పాతికేళ్ళుగా హైస్కూలు ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తున్న శ్రీమతి వై. లీలారూత్‌ను శ్రీమతి వి. సీతామహాలక్ష్మి రజతోత్సవ ఆహ్వాన సంఘం తరపున సన్మానించారు.

శ్రీయుతులు వి. ఎన్. బ్రహ్మానందం, కె రాజబాపయ్య, డా॥ ఎం. కుటుంబరావు, శ్రీమతి కె. పద్మసులోచన ప్రభృతులు ప్రసంగించారు. శ్రీ మాగంటి అంకినీడు ప్రసంగిస్తూ సమగ్ర విద్యాచట్టం తెచ్చేందుకు రాష్ట్ర విద్యామంత్రి నిమగ్నులై వున్నారని, ఈ హైస్కూలు భవనానికి ప్రజలెంత విరాళమిస్తే, అంత మొత్తాన్ని ప్రభుత్వంనుండి యిప్పించుటకు తాను కృషిచేయగలనని, సాధ్యమైనంతవరకు వెంకటేశ్వర దేవస్థానంనుండి విరాళమిచ్చుటకు ప్రయత్నించ గలమన్నారు మున్సిపల్ కమిషనర్ శ్రీ రాజశేఖరన్ మాట్లాడుతూ, ప్రజలు, ప్రభుత్వం యిచ్చిన మొత్తానికి సమానమైన మొత్తాన్ని తాము మున్సిపల్ నిధులనుండి హైస్కూలు భవన నిర్మాణానికి కేటాయించ గలమన్నారు.

కమిటీ ఉపాధ్యక్షురాలు కుమారి కోగంటి విజయలక్ష్మి వందన సమర్పణ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థినులచే సాంస్కృతిక కార్యక్రమాలు యివ్వబడ్డాయి.

భూ సమస్యలపై నవంబర్ 5 న విజయవాడలో ప్రదేశ్ మహాసభ

కార్యకర్తలకు సూచనలు

హైదరాబాద్, అక్టోబరు 25

నవంబరు 5 విజయవాడలో భూ సమస్యలపై జరిగే ప్రదేశ్ మహాసభకు ఈ క్రింద పేర్కొన్న సమాచారాన్ని వ్రాతపూర్వకంగా తీసుకరావాలని ప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షులు శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ కొండ్రు సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు.

(1) గ్రామం పేరు, అడ్రసు(జిల్లాతో సహా).

(2) సమస్య స్వభావం భూ సంస్కరణల చట్టం వెంటనే అమలు జరుపుటకుగాను నిరుపయోగమైన చెరువులు సాగుకు ఇవ్వడానికి, ఫారెస్టులకు నిరుపయోగమైన ఫారెస్టు బంజర్లు సాగుదార్లకు ఇచ్చుటకు, లంక భూములు అర్హత కలిగిన పేదలకు పంచుటకు, భూస్వాముల ఆక్రమణలోవున్న అన్ని రకాల ప్రభుత్వ బంజర్లను విడగొట్టి పేదలకుఇవ్వడానికి, పేదలందరికివెంటనే ఇండ్లస్థలాలు ఇవ్వడానికి, భూసమస్యలపై ప్రభుత్వ చట్టాలను అమలు జరపనీయకుండా వుండే కోర్టు తీర్పులను, స్టే ఆర్డర్లను అధిగమించుటకు ప్రభుత్వం తగిన చర్యలను వెంటనే తీసుకొని భూ సమస్యలను పరిష్కరించడానికి.

(3) అర్జీ ఎప్పుడు పెట్టింది? ఎవరెవరికి? ఏ దశలో వున్నది? ఫలితం ఏమిటి?

(4) సమస్యపై ప్రస్తుత పరిస్థితి ఏమిటి? ఏ దశలో వున్నది?

(5) బంజరు భూములు ఎన్ని సంవత్సరాల నుండి సాగు చేస్తున్నారు? సాగు లెక్కల్లో నమోదయిందా? రశీదు లున్నవా? వాటి నెంబర్లు?

(6) ఈ సమస్యపై కోర్టులో వేశారా? ఎందుకు, ఎవరువేశారు? కేసు వివరం, కోర్టు తీర్పు లేదా స్టే ఇచ్చినదా? ఇస్తే దాని నెంబర్ కాపీ.

(7) భూ సంస్కరణల చట్టం అమలుపై కోర్టుకు వెళ్ళారా? ట్రిబ్యునల్ తీర్పు ఎలా వుంది? దాని వివరాలు, చట్టం అమలు ఎంతవరకు జరిగింది?

పైన రెండవ పాయింటులో తెలిపిన 7 సమస్యలపైన మీ మీ గ్రామాలలో ఇంతవరకు ప్రజల వైపునుండి, ప్రభుత్వం వైపు నుండి జరిగిన పని సవివరంగా, వ్రాతపూర్వకంగా తగిన ఆధారాలతో మహాసభకు అందచేయాలి. వీలున్నచోట పబ్లిక్ కాపీలు' నంబర్లు మొదలైన ఆధారాలు కూడా తీసుకరావాలి. ఒక్కొక్క సమస్యపై ప్రత్యేకంగా వేరు వేరుగా వ్రాయాలి.

బందరు సమితి గ్రామాలలో బలహీనవర్గాలకు రు. 21 లక్షల రుణాలు

బందరు, అక్టోబరు 25

బందరు సమితి గ్రామాలలో బలహీన వర్గాలకు రు. 21 లక్షలు రుణాలు పంపిణీ చేసేందుకు సమితి పథకం రూపొందించింది.

పాడిపశువులు, బండ్లు, ఎడ్లు, బాతులు, సైకిల్ రిక్షాలు, కుట్టు మిషన్లు, గొర్రెలు, మేకలు కొనుగోలుకు, కార్పెంటరీ బోటు నిర్మాణంలకు చేనేత వారికి నూలు కొనుగోలుకు 1976-77 ఆర్థిక సంవత్సరంలో యీ రుణాలు యివ్వాలని నిశ్చయించింది.

జాతీయం చేయబడిన యితర వాణిజ్య బ్యాంకులు క్రింది విధంగా రుణాలు యిస్తాయని బి. డి. ఓ. శ్రీ వి. కోటేశ్వరరావు తెలియజేశారు.

ఆంధ్రాబ్యాంకు, మచిలీపట్నం, రు. 2 లక్షలు, ఇండియన్ బ్యాంకు, రు. 3 లక్షలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రు. లక్ష, స్టేట్‌బ్యాంకు మచిలీపట్నం, రు 3 లక్షలు, సిండికేట్ బ్యాంకు రు. లక్ష, కృష్ణా సహకార సెంట్రల్ బ్యాంకు రు. 3 లక్షలు ఆంధ్ర బ్యాంకు రు. 1 లక్ష, స్టేట్ బ్యాంకు పెడన రు. 2 లక్షలు, వ్యవసాయాభివృద్ధి బ్యాంకు, పెడన రు. 1 లక్ష, ఇండియన్ బ్యాంకు, పోలవరం రు 3 లక్షలు.

ఈ రు. 20 లక్షలుగాక, కృష్ణాజిల్లా షెడ్యూల్ కులాల సహకార సొసైటీ,మచిలీపట్నం రు. 1 లక్ష కేటాయించినట్లు బి. డి. ఓ. తెలిపారు.

పెడనలో 22 చేనేత కుటుంబాలకు రుణాలు

ఇక్కడకు 5 మైళ్ళ దూరంలోనిపెడనలో 22 చేనేత కుటుంబాలకు బందరు బి. డి. ఓ శ్రీ వి. కోటేశ్వరరావు రుణాలు పం పెట్టారు.

ఈ బ్లాకులో చేనేత వారికి రుణాలివ్వటము యిదే మొదలు. నూలు కొనుగోలుకై ఒక్కొక్కరికి రు. 330 యివ్వబడిన యీ రుణాలతోవారు మాస్టర్ వీవర్ల దయాదాక్షిణ్యాల నుండి బైట పడతారు. ఈ రుణాల పొందిన వారంతా కుటుంబ నియంత్రణ పాటించిన వారు కావటం విశేషం.

ఈ సందర్భంగా శ్రీ కోటేశ్వరరావు మాట్లాడుతూ బలహీన వర్గాలకు రుణాలకై స్టేట్ బ్యాంకు పెడన బ్రాంచి రు. 2 లక్షల కేటాయించిందన్నారు. సమావేశానికి పెడన స్టేట్ బ్యాంకు ఏజెంటు శ్రీ వి. శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు.

మెడికల్ ఆఫీసర్ డా॥ ఎస్. రామబ్రహ్మం, టి. సి. ఆర్. ఓ. శ్రీ యం రామారావు, బ్లాకు యువజన కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఎన్. వెంకటేశ్వరరావు, సర్పంచ్ శ్రీ వై. త్రిశూలపాణి, బి. డి. ఓ., శ్రీ సి. హెచ్. నారాయణరావు సభలో పాల్గొన్నారు.

రేడియో రూరల్ ఫోరంలు

బందరు తాలూకా పేమవరం, కూడూరు, వల్లమర్రాడు, పెడన గ్రామాలలో రేడియో రూరల్ ఫోరంలు ఏర్పాటు చేయబడ్డాయి.

వాటికి శ్రీయుతులు కె. మల్లిఖార్జునరావు (పేమవరం), పి. నాగేంద్రుడు (కూడూరు) తోట రాఘవయ్య (వల్లమర్రాడు), కంఠంనేని శివాజి (పెడన) కన్వీనర్లు.

మురుగునీరు త్రాగి 40 గొర్రెల మృతి

రోమ్, అక్టోబర్ 24

ఇక్కడ ఒక మురుగు కాల్వలో నీరు త్రాగిన కొద్ది నిముషాల్లోనే 40 గొర్రెలు మృతి చెందాయి.

ఆ నీటిలో తెలియని విష పదార్థాలు వున్నాయని నిపుణులు కనుగొన్నట్లు ఒక వార్తా సంస్థ తెలియ చేసింది. పూర్తి దర్యాప్తుకు ఉత్తర్వులుచేయబడ్డాయి.

ఇటలీలో ఇలా జరగడం ఇది మూడో సారి.

రు. 60 వేల వైర్లు, కేబుల్సు స్వాధీనం

న్యూఢిల్లీ, అక్టోబరు 25

ఢిల్లీ సెంట్రల్ ఎక్సైజ్ నిఘా శాఖ అధికారులు ఒక ట్రాన్సుపోర్టు కంపెనీనుండి రు 60 వేల విలువచేసే వైర్లు, కేబుల్స్ స్వాధీనంచేసుకున్నారు.

ఎక్సైజ్‌సుంకం చెల్లించకుండా ఉత్పత్తి చేసిన చోటు నుండి మరొక చోటికి వీటిని తరలింపు చుండగా పట్టుకోవడం జరిగిందని సెంట్రల్ ఎక్సైజ్ కలెక్టర్ శ్రీ యం. ఎల్. బిహ్వార్ తెలియ చేశారు.

బోగస్ మిల్లులపై బూటకపు సంస్థల పేరిట వీటిని పంపడం జరిగిందని ఆయన తెలిపారు.

పుదుచ్చేరి లాయర్ల ఫోరం హర్షం

పుదుచ్చేరి, అక్టోబరు 25

44 వ రాజ్యాంగ సవరణ బిల్లును పుదుచ్చేరి లాయర్ల ఫోరం హర్షించింది.

ఇందుకోసం రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటు చేయవలసిన అవసరమే లేదని తీర్మానంలో స్పష్టీకరించింది.

అమెరికాలో భారత్ రాయబారిగా నియమితులైన శ్రీ కేవల్‌సింగ్‌తో కలిసి విదేశాంగమంత్రి శ్రీ వై. బి. చవాన్ యిటీవల శాన్‌ఫ్రాన్సిస్కో సందర్శించారు. చిత్రంలో వారితోబాటు అమెరికా విదేశాంగశాఖ అధికారిణి వి. డబ్ల్యు. బ్రెహెన్స్, భారత కాన్సల్ జనరల్ శ్రీ మల్హోత్రాలను చూడావచ్చు.

అత్తిలిలో బలహీనవర్గాలకు స్వయం ఉపాధి కల్పనక్రింద రు. 3½ లక్షల రుణ సౌకర్యం

తణుకు, అక్టోబరు 25

సుఖప్రదమైన జీవితం, పిల్లల భవిష్యత్ దృష్ట్యా కుటుంబ నియంత్రణ ఎంతైనా అవసరమని యిక్కడకు 15 కి మీ దూరంలోని అత్తిలిలో బలహీన వర్గాలకు చెందిన 512 మందికి స్వయం ఉపాధికల్పన నిమిత్తం రు 3,51,556 ఋణసౌకర్యాన్ని ఎరికరాలను అందిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీ జి. కుమారస్వామిరెడ్డి అన్నారు

పెనుమంట్ర సమితికి చెందిన యీ బలహీన వర్గాలకు సైకిల్ రిక్షాలు, పాడి పశువులు, బండ్లు, ఎడ్లు, ఇటుకం ఎర్రకమ, ఇస్త్రీ పెట్టెలు, క్షౌరవృత్తి ఎరికరాలు మేకల పెంపకం, బట్టల వ్యాపారం, కుట్టు మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ ఋణాలలో 20 శాతం ఆయా కార్పొరేషన్లు సహాయం చేయగా, స్థానిక వాణిజ్య బ్యాంకులు మిగతా ఋణ సౌకర్యం కల్పించాయి.

ఈ సందర్భంగా శాసన సభ్యులు శ్రీ కలిదిండి విజయనరసింహరాజు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా పరిషత్ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావు మాట్లాడుతూ పంచాయతీలు బలహీన వర్గాల సంక్షేమ పథకాలలో కూడా తోడ్పడాలనే లక్ష్యంతో పంచాయతీ స్థాయిలో యీ కార్యక్రమం ఏర్పాటుచేయబడిందన్నారు.

అత్తిలి పంచాయతీ సమర్పించిన వినతి పత్రానికి సమాధానంగా గ్రామంలో డోబీ ఖానా నిర్మాణానికి ఆర్థిక సహాయం, డిస్పెన్సరీని ఆస్పత్రిగా మార్చటానికి తగిన సహాయం చేయగలమని కలెక్టరు వాగ్దానం చేశారు

అంతకు ముందు రు 75 వేలతో నిర్మించనున్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి కలెక్టరు శ్రీ రెడ్డి శంకుస్థాపన చేశారు.

బ్యాంకు మేనేజర్లు శ్రీ ఎ వెంకట్రావు, శ్రీ శేషగిరిరావు, కృష్ణమూర్తి తమ తమ బ్యాంకులు అందజేస్తున్న సహాయాన్ని వివరించారు శ్రీయుతులు పోలిశెట్టి అప్పారావు, ఎ. ప్రభాకరరావు, సత్తి సూర్యనారాయణరెడ్డి, బాలకవి ప్రభృతులు మాట్లాడారు. ముందుగా శ్రీ వైట్ల బాపన్న స్వాగతం చెప్పారు.

కొవ్వూరు డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీ వెంకట్రాజు, తణుకు తహశీల్దారు శ్రీ బి. రామకృష్ణారెడ్డి మంజూరైన ఋణాలను, యిళ్ళ స్థలాల పట్టాలను చరపుగా కలెక్టరు పంచిపెట్టారు

మహిళా సూపర్ బజార్

అత్తిలిలోనే నూతనంగా నెలకొల్పిన మహిళా సూపర్‌బజార్‌ను శ్రీమతి నిర్మలా కుమారస్వామిరెడ్డి ప్రారంభోత్సవంచేశారు

కొవ్వూరు ఆర్. డి. ఓ. శ్రీ కె. ఎస్. హయగ్రీవమూర్తి పర్యవేక్షణలో బి. డి. ఓ శ్రీ వి. సుబ్బిరెడ్డి యీ కార్యక్రమాలు నిర్వహించారు.

పైడిపర్రులో కుటుంబ నియంత్రణ కృషి

తణుకుకు ఆనుకొని ఉన్న కుగ్రామం పైడిపర్రులో 150 మందివరకూ ఆపరేషన్లు చేయించుకోవాల్సిన దంపతులున్నారు. నూటికి నూరుపాళ్ళు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలనే పట్టుదల గ్రామ సర్పంచ్ శ్రీ చినిమిల్లి సూర్యారావుకు కల్గింది ఉప సర్పంచ్ శ్రీ కళ్ల వీరన్న గ్రామాధికారులు శ్రీయుతులు తేతలి శ్రీరామమూర్తి, కొత్తపల్లి పుల్లయ్య సహాయమందించారు ప్రారంభంగా పెరవలి సమితి సహాయంతో ఊరిలో క్యాంప్ పెట్టించారు. భోరున వర్షం పడుతున్నా యింటింటికెళ్ళి ఆపరేషన్లు చేయించుకునేవారిని ఒప్పించి మరీ తీసుకొచ్చారు. 30 ఆపరేషన్లు ఒకే రోజున చేయించారు. ప్రభుత్వమిచ్చే పారితోషికంతోబాటు నలుగురు పిల్లలుండి ఆపరేషను చేయించుకొన్నవారికి ఒక్కొక్కదుప్పటిని శ్రీ సూర్యారావు ఉచితంగా బహూకరించారు. పెట్టదోమే శిబిరాల్లో మిగిలిపోయినవారిని కూడా ఒప్పించి ఆపరేషన్లు చేయించగలమన్న దృఢ విశ్వాసంతో శ్రీ సూర్యారావు కృషి చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ప్రజాపనులు(రహదార్లుమరియు భవనముల) శాఖ

ఎగ్జిక్యూటివ్ యింజనీరు వారి కార్యాలయము రహదార్లు మరియు భవనముల డివిజను
విజయవాడ - 520010 -

సవరణ నెం 1 తేది 14-10-76

చిట్ టెండరునోటీసు నెంబరు 9/1976-77 తేది 10-9-76 కూడ కలిపి చదవవలయును.

ఈ క్రింద సుదహరించిన పనికి 16-10-76 వ తేదీ గం. 2-30 ల వరకు తీసుకొన వలసిన టెండర్ల వాయిదా వేయడమైనది.

పనిపేరు నందిగామ - పొక్కునూరు రోడ్డులో కిలోమీటరు 16/4 8 వద్ద అండర్ వెంటెడ్ రోడ్డు డామ్ నిర్మించుట

వాయిదా వేయబడిన తేదీ 16-11-76 మధ్యాహ్నము గం 2-30 ల వరకు

అప్లికేషన్లు చేరవలసిన తేదీ 9-11-76 సాయంత్రం గం 5-00 ల వరకు.

టెండరు షెడ్యూల్సు యిచ్చు తేదీలు . 10-11-76 మరియు 11-11-76

చిట్ టెండరునోటీసునెం 9/1976-77లో సూచించిన అన్ని నియమములు దీనికి వర్తించును.

(సం.) యస్.యస్. హుదా
ఎగ్జిక్యూటివ్ యింజనీరు
రహదార్ల భవనముల శాఖ

DIPR/1694/76

కూనవరాజువర్వ
గ్రామ పంచాయతీ

వేలం ప్రకటన

కృష్ణాజిల్లా తిరువూరు తాలూకా కూనవరాజవర్వ పంచాయతీ యేరియాలో రెవెన్యూ వారి ఆధీనంలోవున్నటువంటి R S No 205/2 423/1 సర్వే నెంబర్లలోగల తుమ్మచెట్లు గ్రామ పంచాయతీ వేలంవేసి, సదరు వేలంలో వచ్చిన సొమ్మును కూనవరాజువర్వ గ్రామంలో ప్రభుత్వం వారు శాంక్షన్ చేసిన హైస్కూలుకు డిపాజిటు చేయుటకుగాను శ్రీ నూజివీడు రెవెన్యూ డివిజనల్ ఆఫీసరు గారు ఆర్డర్ నెం. 12653/76 ప్రకారము పర్మిషన్ ఇచ్చినందున సదరు తుమ్మచెట్లను 28 10-76 తారీఖున సదరు గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద సాయంత్రం మూడు గంటలనుండి వేలం పాట పెట్టబడును సదరు వేలంపాటలో పాల్గొనువారు ముందుగా అయిదు వందల రూపాయలు డిపాజిట్టు చెల్లించి పాటలో పాల్గొనవలయును. సదరు పాట తాలూకు మొత్తం సొమ్మును 29-10-76 వ తేదీన చెల్లించి పంచాయతీ సర్పంచ్‌గారిద్వారా రశీదు పొందవలయును సదరు తుమ్మచెట్లు పాట సందర్భమున సరియైన పాట రాలేదని పంచాయతీ భావించిన యెడల సదరు పాటను రద్దుపరచి డిపాజిట్లు తిరిగి యివ్వబడునని తెలియజేయడమైనది.

ఇట్లు,
పూల వెంకయ్య,
సర్పంచ్, గ్రామ పంచాయతీ.
కూనవరాజువవ్వ,
23-10-76

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
సూపరింటెండింగు యింజనీరు
రహదారులు - భవనముల శాఖ
ఏలూరు ది. 11-10-76.
సవరణ నెం॥ 8

చిట్ టెండరు నోటీసు

నెం॥ 6/76-77 ది. 14-7-76.

ఈ క్రింద తెలపబడిన పనికిగాను టెండర్లు ది 15-10 76కు బదులుగా ఈ క్రింద తెలిసిన విధముగా మార్పు చేయటమైనది

వరుస నెంబరు - 9

పని వివరము - భీమవరము - గుడివాడ రోడ్డులో (భీమవరము వైపు కైకలూరు బైపాసు రోడ్డు నిర్మించుట అనగా భీమవరము - గుడివాడ రోడ్డు డీవియేషను పాయింటునుండి ఏలూరు కైకలూరు రోడ్డు కలియు జంక్షనువరకు కి మీ 0 00 నుండి 3 76 వరకు

1 టెండరు షెడ్యూల్సు కొరకు దరఖాస్తు స్వీకరించు కడపటి తేది 4-11-76

2 ది. 9-11-76 నుండి ది 12-11-76 వరకు కార్యాలయము పనిచేయు దినములలో టెండరు షెడ్యూల్సు యివ్వబడును

3 టెండర్లు స్వీకరించుతేదీ 17-11-76 షరతులు మార్పు లేదు

(సం) శ్రీనివాసముదలి,
సూపరింటెండింగు యింజనీరు,
DIPR 1697/76 ఏలూరు

పల్నాడు తా॥లో మహేంద్రులకు సహాయానికై విజ్ఞప్తి

గుంటూరు, అక్టోబరు 25

పల్నాడు తాలూకాలో సుమారు 18 గ్రామాల్లో మహేంద్రులు (మేదర్లు) చాలా దుర్భర పరిస్థితిని అనుభవిస్తున్నారు. వీరికి తగిన ఆర్థిక సహాయాన్ని బ్యాంకుల ద్వారా యిప్పించాలని తాలూకా మహేంద్రుల సంఘ అధ్యక్షులు శ్రీ తమ్మినేని నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వారికి అవసరమైన వెదురును మొదటి రకం 00 ఒకటికి 50 రూపాయలకు యిప్పించి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. వారి కుటుంబాలలో అక్షరాస్యులు శూన్యం కనుక వారికి విద్యావసతి కల్పించాలని కూడా కోరారు. ఇండ్లస్థలాలకు పట్టాలు యివ్వాలని కూడా శ్రీ నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

శ్రీ వి. కామశాస్త్రి మృతి

కాకినాడ, అక్టోబరు 25

స్వాతంత్ర్య యోధులు శ్రీ వడ్లమూరి కామశాస్త్రి ఇటీవల కాకినాడలో మృతి చెందారు ఆయన వయస్సు 80 సంవత్సరాలు. కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ వర్క్సు శాఖలో ఇంజనీరుగా పనిచేశారు 1919 లో మహాత్మా గాంధీ పిలుపు నందుకొని స్వాతంత్ర్యోద్యమంలో చేరారు

1922 లో కాకినాడలో లలితా ఇంజనీరింగ్, కాంక్రీటు సిమ్మెంటు వర్క్సును స్థాపించారు. అవి ఇప్పటికి కొనసాగుతున్నాయి ఆయనకు ఒక కుమారుడున్నారు.

ఖమ్మంజిల్లా సత్తుపల్లిలో ఆర్. టి సి బస్ స్టాండ్‌కు రవాణా మంత్రి శ్రీ చేబ్రోలు హనుమయ్య ప్రారంభోత్సవం చేసినప్పటిచిత్రం. ఎడమ వరుసలో శ్రీయుతులు పి నర్సింగరావు (ఆర్. టి. సి చైర్మన్), ఆర్. ప్రభాకరరావు (ఆర్. టి. సి. జనరల్ మేనేజరు), పి వి. ఆర్. కె. ప్రసాద్ (జిల్లా కలెక్టర్), జలగం ప్రసాదరావు (జిల్లా యువజన కాంగ్రెసు అధ్యక్షులు).

కాకినాడలో స్టేడియంకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

(విశాలాంధ్ర విలేకరి)

కాకినాడ, అక్టోబర్ 25

అన్ని జిల్లా కేంద్రాల్లోను స్టేడియంలను నిర్మించడం జరుగుతుందని ఈ నెల 21 వ తేదీన కాకినాడలో నిర్మించిన స్టేడియంకు ప్రారంభోత్సవం చేస్తూ ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు తెలిపారు. నిధులకొరకు ప్రజలనుండి విరాళాలనుసేకరించా లన్నారు.

కాకినాడలో నిర్మించే నాగార్జున ఎరువుల కర్మాగారానికి నీరు, విద్యుత్‌లాంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలను కల్గించడంతో పాటు 9 కోట్ల రూపాయల వాటాపెట్టుబడి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ ప్రాంతంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి మంచి అవకాశాలుండటం చేతనే ప్రత్యేకంగా కాకినాడలో ఫిషరీస్ కార్పొరేషన్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు.

ఇకపై ఫిషరీస్ కార్పొరేషన్‌లో ఏర్పడే ఉద్యోగాలు మత్స్యకారుల వర్గానికి చెందిన వారికే కేటాయించటం జరుగుతుందన్నారు.

ప్రస్తుతం అమలు జరుపుతున్న కార్యక్రమాల క్రింద ప్రయోజనాలు పొందడానికి బలహీన వర్గాలవారు కుటుంబ నియంత్రణను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి డాక్టర్ జి యస్. ధిల్లాన్ ఈ సందర్భంగా ప్రసంగించారు.

1034 ఇండ్లస్థలాల పట్టాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. పాడి పశువుల కొనుగోలుకు, సైకిల్ రిక్షాలకు, చేపలు పట్టేందుకు ఉపయోగించే ట్రాలీలకు, చిన్న వ్యాపారులకు మంజూరు చేసిన 33 లక్షల రూపాయల ఋణ పత్రాలను డాక్టర్ ధిల్లాన్ అందజేశారు.

సభకు అధ్యక్షత వహించిన సహకార శాఖ మంత్రి శ్రీ బత్తిన సుబ్బారావు మాట్లాడుతూ యువకులు క్రీడల్లో ముందంజ వేయాలన్నారు. నాగపూర్ నుండి, రాజమండ్రికి రోడ్డు నిర్మాణానికి మంజూరు చెయ్యాలని రోడ్లు, భవనాల మంత్రి శ్రీ పి. హెచ్. వెంకట్రావు డాక్టర్ ధిల్లాన్‌ను కోరారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీ యు. బి. రాఘవేంద్రరావు ప్రసంగించారు.

డాక్టర్ ధిల్లాన్‌ను శ్రీ ఎం. ఎస్. సంజీవరావు పరిచయం చేశారు. అంతకుముందు ఎస్. పి. శ్రీ వి. వెంకటరమణారెడ్డి స్వాగతోపన్యాసంతో స్టేడియం 33 లక్షల రూపాయలతో 12.73 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నట్లు చెప్పారు.

శాసనసభ్యులు శ్రీయుతులు పి. వి. కె. రావు, కె. ప్రభాకరరావు డా॥ డి.వి. రామారావు శ్రీమతి సావిత్రీదేవి (ఎం. ఎల్. సి) శ్రీ గిడ్డం వెంకట్రావు తదితరులు ప్రసంగించారు.

అనంతరం పేరాజుపేటలో మత్స్యవ్యాపారులకి సహాయంచేసే రిజిష్టర్డు సొసైటీ భవనానికి శ్రీ వెంగళరావు ప్రారంభోత్సవం చేశారు. సొసైటీ కార్యదర్శి శ్రీ కె. జాకబ్ వివరాలను చెప్పారు శ్రీ సి అప్పారావు కుష్టు వ్యాధి సంస్థకు రు 2 వేల విరాళాన్ని ప్రకటించారు

డాక్టర్ టి. శ్రీనివాసరావు సభికులకు స్వాగతంపలికారు శ్రీ పి. ప్రసాద్ వందన సమర్పణ చేశారు. అంతకుముందు శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కుషాపులను శ్రీ వెంగళరావు డాక్టర్ ధిల్లాన్‌లు సందర్శించారు.

ఆర్. టి. సి. ఉద్యోగుల కబాడీ పోటీల్లో హైదరాబాద్ గెలుపు

గుంటూరు, అక్టోబర్ 25

గతరాత్రి యిక్కడ ముగిసిన ఎ. పి.ఎస్. ఆర్ టి సి, రిక్రియేషన్ క్లబ్‌వారి అంతర్ కబాడీ పోటీలో గుంటూరు సిటీ డివిజన్‌పై హైదరాబాద్ సిటీ డివిజన్ ఉద్యోగుల జట్టు విజయం సాధించింది.

టీమ్‌లలో కె ఎస్. ఎస్. ఎస్. క్లబ్, రాష్ట్రస్థాయి ఆర్. టి. సి. జట్టుపై గెలుపొందాయి.

ఈనెల 21 నుండి 24 వరకు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలకు 10 జిల్లాలనుండి ఆర్. టి. ఆర్. సి. జట్లు అహ్వానించబడిన మరో మూడు జట్లు పాల్గొన్నాయి.

విజేతలకు గుంటూరుజిల్లా సెషన్స్‌జడ్జి శ్రీ జి. రామానుజులు నాయుడు బహుమతులు అందజేశారు. పోలీస్ డి. ఐ. జి. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. (వి. పీ.)

మంత్రిపాలెంలో 106 మంది హరిజనులకు ఇండ్లస్థలాల పట్టాలు

చల్లపల్లి, అక్టోబరు 25

కృష్ణాజిల్లాలోని మంత్రిపాలెం గ్రామంలో 106 మంది హరిజనులకు బందరు ఆర్. డి. ఒ. ఇటీవల ఇండ్లస్థలాలకు పట్టాలను అందజేశారు దివి తాలూకా తహసీల్‌దారు, గ్రామ సర్పంచ్ తాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి ఈ సందర్భంలో హాజరయ్యారు.

మిగులు భూములు కేటాయించిన వారి సహాయానికై రు. 5 కోట్లు

లోక్‌సభకు సమర్పించిన పద్దుల్లో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 25

మిగులుభూములు కేటాయించిన వారికి సహాయం అందచేయుటకుగాను రు. 5 కోట్లు నేడు పార్లమెంటులో ప్రవేశ పెట్టబడినరెండో సప్లిమెంటరీ పద్దులో కేటాయించబడింది.

ఇంతకుముందు బడ్జెట్ లో ఇందుకు రు. 99.59 లక్షలు కేటాయించడం జరిగింది.

ఇంతవరకు దేశవ్యాపితంగా 26 లక్షల ఎకరాలు మిగులు భూమిగా ప్రకటించబడింది. ఇందులో 18 లక్షల ఎకరాలురాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. 10 లక్షల ఎకరాలు ఇప్పటికేపంపిణీ చేయడం జరిగింది.

మొత్తం సొమ్ములో రు. 3 75 కోట్లు గ్రాంట్లక్రింద, మిగతా రు. 1.25 కోట్లు ఋణాలక్రిందను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వబడతాయి. మొత్తం రు. 149.99కోట్ల, పద్దులోకుటుంబనియంత్రణపథకానికి, నూనె అనిజవాయువుల కమిషన్ కార్యక్రమాలకు ఎక్కువ భాగం కేటాయించబడింది.

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అయిదు నెలల్లో కుటుంబనియంత్రణ ఆపరేషన్లసంఖ్య 5 రెట్లు పెరగడంవల్ల ఎక్కువ పరిహారం చెల్లించాల్సి వుండటంచేత అదనంగా రు. 42 కోట్ల కేటాయింపును ప్రభుత్వం కోరింది.

ప్రభుత్వ ప్రకటన ప్రకారం గత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో జరిగిన 6 98 లక్షల ఆపరేషన్లతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో 39.79 లక్షల ఆపరేషన్లు జరిగాయి.

ఇంతకుముందు బడ్జెట్ లో కేటాయించిన రు. 8 కోట్లకు తోడు గత ఆగస్టులో సప్లిమెంటరీ గ్రాంటు ద్వారా మరో రు. 6 కోట్లు పెంచడం జరిగింది. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను ఇంకా ఉధృతంగా కొనసాగించడానికి రెండోదఫా ఇప్పుడు ఈ అదనపు మొత్తాన్ని కోరడం జరిగింది.

ఈ రు. 48 కోట్లలో రు. 47 68 కోట్లు రాష్ట్రాలకు, రు. 2 లక్షలు శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలకు, రు. 30లక్షలు ఇతర కేంద్ర ప్రాంతాల్లో నేరుగా ఖర్చు చేయబడుతుంది.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నవారికిచ్చే పరిహారం పెంచబడింది. వేసక్టమీకి రు. 85 నుండి రు. 70 కి ట్యూబెక్టమీకి రు. 70 నుండి రు. 100, రు 150 కి గత ఏప్రిల్‌లో ప్రకటించిన జాతీయ జనాభా విధానం ప్రకటన రీత్యా పెంచడం జరిగింది

నూనె ఖనిజవాయువు కమిషన్ కార్యకలాపాలకు రు. 52.30 కోట్లు కేటాయింపు చూపబడింది. దీనికితోడు రు. 2 85 కోట్లు హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఎస్సో ఈస్టర్న్ ఐ..ఎన్. సి. కంపెనీలలో మైనారిటీ వాటాదార్లకు పరిహారం క్రింద చెల్లించబడుతుంది.

1974-75 సంవత్సరానికి రైల్వేలకు అదనపు గ్రాంట్ల క్రింద రు. 17 95 కోట్ల సప్లిమెంటరీ పద్దును, గుజరాత్ ప్రభుత్వానికి సంబంధించి రు. 15.93 కోట్లు, పుదుచ్చేరి ప్రభుత్వానికి సంబంధించి మరో రు. 14 వేల పద్దులను కూడా సభలో ప్రవేశపెట్టడం జరిగింది.

ఏడాదిలో ఏడు చోరీలు చేసిన గజదొంగ అరెస్టు

రాయచోటి, అక్టోబరు 25

ఒక్క యీసంవత్సరంలోయిప్పటికేఏడు దొంగతనాలుచేసి, తప్పించుకు తిరుగుతున్న శివరామయ్య అనే అతన్ని రాయచోటి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు శ్రీ ఎం. కృష్ణారెడ్డి, రాయచోటి సబ్-ఇన్‌స్పెక్టరు శ్రీ టి శ్రీనివాసరావు చిన్నమండెం సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీ సి. హెచ్ పాపారావు అతి చాకచక్యంతో యిటీవల పట్టుకున్నారు

అతనినుండి రు 8 వేల విలువ గల బంగారునగలు, వాచీలు, ట్రాన్సిస్టర్లు, స్టీల్ పాత్రలు స్వాధీనం చేసుకున్నారు.

మల్లూరులో దొంగతనం

రాయచోటి తాలూకా మల్లూరులో టీచర్ శ్రీ రెడ్డప్ప ఇంట్లో యీ నెల 9 న దొంగతనం జరిగింది. రు. 9,493 విలువగల వెండి, బంగారునగలు, బట్టలు, రేడియో వగైరా పోయాయి.

ఈ సందర్భంగా రాయచోటి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం కృష్ణారెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టరు శ్రీ టి. శ్రీనివాసరావు, శ్రీ సి.హెచ్. పాపారావు, హెడ్‌కానిస్టేబుల్ లాజరస్‌ల సహకారంతో యీ నెల 16 న అడె గ్రామానికి చెందిన ఖాసింసాహెబ్, బుడన్‌సాహెబ్, మహబూబ్ బాషాలను అరెస్టుచేసి వారి యిళ్ళలో, గొట్టలలో దాయబడిన సామాను స్వాధీనం చేసుకొని కేసు పెట్టారు.

నేరం ఒప్పుకున్న ఖాసింసాహెబ్‌కు 21 వ తేదీన రాయచోటి జుడీషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ 6 నెలల శిక్షల విధించారు. మిగిలిన ఇద్దరిమీద విచారణ జరుగుతున్నది,

చిలీ పై కిసింగర్ కరుణ !

వాషింగ్టన్, అక్టోబరు 25

చిలీలో నియంతలను ఒప్పించి, వందలాది రాజకీయ ఖైదీలను విడిపించిన ఘనత అమెరికాకు దక్కుతుందని విదేశాంగమంత్రి కిసింగర్ అన్నారు.

మానవ హక్కుల ఉద్ధరణకు గత రెండేళ్ళుగా ఫోర్డ్ ప్రభుత్వం కృషికి చిలీ ఒక ఉదాహరణ అని కూడా ఆయన భావించారు. అయితే "మన విలువలను కేవలంప్రకటించి ప్రపంచాన్ని మార్చాలనుకుంటే, ప్రపంచంలో ప్రతి చోటా నిరంతరం జోక్యం చేసుకునే పెద్ద చిక్కులో పడాల్సి వస్తుంది. అని "ఫేస్ ది నేషన్" టెలివిజన్ ఇంటర్వ్యూలో అన్నారు.

"ప్రజాతంత్రేతర"పాలన క్రింద ఉన్న "స్నేహ దేశాలు "మన రాజకీయ ప్రజాతంత్ర విలువలను" అనుసరించే విధంగా నచ్చచెప్పటానికి అమెరికా యత్నిస్తున్నదన్నారు. చిలీలో మరింతమంది అరెస్టులను అమెరికా ముందుగా నివారించిందా అని ప్రశ్నించగా "పరివర్తన మనకు నచ్చేంత వేగంగా జరగలేదు. మొత్తంమీద దానికి దోహదం చేశాం" అన్నారు

కిసింగర్ నేతృత్వంలో చిలీలో ప్రజాతంత్ర ప్రభుత్వం నియంతృత్వం రావడం ఫలితంగా పేదప్రజలపై దమనకాండ సాగడం ప్రపంచ పత్రికలన్నీ వెల్లడిచేసిన విషయమే.

కార్టర్‌కు జవాబు

యుగోస్లావియాపై సోవియట్ దాడిచేసే పక్షంలో యుగోస్లావియా రక్షణకు అమెరికా సేనలు పంపబోనని డెమొక్రాటిక్ అభ్యర్థి జిమ్మీ కార్టర్ చేసిన ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ ఒక సంక్షోభం వస్తే అమెరికా ఏమి చేస్తుందో ముందే చెప్పడం అజ్ఞానమన్నారు

యుగోస్లావియా లేదా చైనాలపై సోవియట్ సైనిక వత్తిడికి తీవ్ర పర్యవసానాలు తప్పవని సోవియట్‌నుహెచ్చరించారు అయితే అలాంటి ఒత్తిడి రాగలదని తాను అనుకోవడంలేదన్నారు.

మాకు బ్రతికే హక్కువుంది! ఆయుధ పోటీని ఆపండి!

ఎ. ఎస్. మూర్తి

ప్రేలుడు వస్తువుల పెట్టెపైన కూర్చున్నప్పుడు మీకేమనిపిస్తుంది? ఇబ్బందిగా వుంటుందిగదూ? అవునా? కాని, ప్రపంచమంతా నేడు అత్యంత ప్రమాదకరమైన ప్రేలుడు మందుతో నిండి వున్న అగ్ని పర్వతం శిఖరాన కూర్చునివుందనే చెప్పాలి అత్యంత అధునాతనమైన మిస్సైలీస్, అణు ఆయుధాలు కుప్పపడివుండడం వల్లనేకాదు, అవి ఉధృతంగా పెరుగుతూ వుండడం వల్లనే ప్రపంచం నేడు పెద్ద విపత్తులో చిక్కుకుంది ఆయుధ పోటీని వెంటనే నిలుపుదల చేయకపోయినట్లయితే, యీ అగ్ని పర్వతం దానంతటదే బ్రద్దలయ్యే ప్రమాదముంది.

ప్రపంచ దేశాలు వేలం వెర్రిగా ఆయుధాలనెందుకు తయారుచేయాలి? ఈ ప్రశ్నకిచ్చిన లౌకిక సమాధానం - ఆత్మరక్షణ కోసం! ఎవరి నుండి రక్షణ? ఎవరో శత్రువు లవుతారనే వారికి వ్యతిరేకంగానా?

ప్రపంచ దేశాలు ఒకచోట చేరి తమ మధ్య తగాదాలను శాంతియుత పద్ధతిలో పరిష్కరించుకోగలమని ఒకరికొకరు హామీ యిచ్చుకోగల దశకు నేడు అంతర్జాతీయ వాతావరణం చేరింది హెల్సింకీలో యూరోపియన్ దేశాల మధ్య యిదేస్పష్టమయింది ఈ విషయంలో ఆయుధాల నిర్మాణావసరమే కనిపించలేదు.

అయితే ఆయుధ పోటీ "ఆత్మరక్షణ"కే అనే వాదనను అంగీకరించినా, మొత్తం ప్రపంచాన్ని సమూలంగా అనేక సార్లు నాశనం చేయటానికి సరిపడే ఆయుధాలు ఒక్క అమెరికావద్ద వుండడంలో అర్థం ఏమిటి ?

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో అమెరికా సైనిక వ్యయం మున్నెన్నడూ లేనంతగా 113,000 మిలియన్ డాలర్లకు చేరుతుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా ఖర్చుపెట్టిన మొత్తంకంటే యిది 50 వేల మిలియన్ డాలర్లు అధికం. 1971 లో పోల్చినట్లయితే పశ్చిమజర్మనీలో కూడా సైనిక వ్యయం 80 శాతం పెరుగుతుంది.

బ్రిటన్ సైనిక వ్యయాన్ని మరో 1000 మిలియన్‌పౌండ్లు పెంచుతుంది. ఫ్రాన్స్ సైనిక వ్యయం యీ ఏడాది 50,000 మిలియన్ ఫ్రాంకులు. ఈ మొత్తాన్ని 1982 నాటికి 114,000 మిలియన్లకు పెంచడానికి పథకం వేసింది. ఇటీవల జరిగిన నాటో రక్షణ కమిటీ సమావేశం, యింతకు ముందు నిర్ణయించిన సైనిక కార్యకలాపాల అమలులో అభివృద్ధినిసమీక్షించి, 1977-82 మధ్యకాలానికి ఆయుధ సేకరణకు నూతన పథకాలను రూపొందించింది.

"పెరుగుతున్న సోవియట్ యూనియన్ సైనికశక్తి" "సోవియట్ ప్రమాదం" అన్న అభూత కల్పనలను సాకులు చూపుతూ ప్రతిసారీ యిలాంటి అపరిమితమైన మొత్తాలను కేటాయిస్తున్నారు.

ఏ దేశం మీదా దురాక్రమణను జరపాలనిగానీ, ఎక్కడైనా సైనిక స్థావరాలను నిర్మించాలనిగానీ ఉద్దేశం సోవియట్ యూనియన్‌కు లేదని వివిధ పర్యాయాలు సోవియట్ నాయకులు స్పష్టీకరించారు. శాంతినీ శాంతియుత సహజీవనాన్ని, బలప్రయోగ వర్జనమూ, నిరాయుధీకరణమూ నమ్రతతో ప్రోత్సహిస్తూ వున్నది ఒక్క సోవియట్ యూనియనే. ఐరాసలో శాశ్వత సభ్యులుగా వున్న దేశాలు తమ రక్షణ బడ్జెట్‌లో 10 శాతాన్ని కోత పెట్టాలని సోవియట్ యూనియన్ ప్రతిపాదించినప్పుడు పశ్చిమ రాజ్యాలు ఎందుకు అంగీకరించలేదు?

ఆయుధోత్పత్తిపై ఖర్చును తగ్గించడానికి, నిరాయుధీకరణకోసం, ప్రపంచ సంస్థ అన్నిటి స్థాయిలోనూ నిరంతరాయంగా కృషి సల్పుతూ వున్నది ఒక్క సోవియట్ యూనియనూ, తదితర సోషలిస్టు దేశాలు మాత్రమే.

అత్యంత వినాశకరమైన, అధునాతన ఆయుధాల అభివృద్ధినీ, ఉత్పత్తినీ నిరోధించేందుకు ఒప్పందంపైన సంతకం చేయడానికి అమెరికాను ఆహ్వానించింది కూడ సోవియట్ యూనియనే. 1000 మిలియన్ల డాలర్ల వ్యయంతో కూడిన 'ట్రైడెంట్' జలాంతర్గాములను తయారుచేసే లక్ష పథకాలను విరమించవలసినదిగా అమెరికాకు సలహా యిచ్చింది కూడా సోవియట్ యూనియనే. అదే సమయంలో, సోవియట్ కూడా అలాంటి ఆయుధాల ఉత్పత్తిని విరమించడానికి సిద్ధంగా వుంది అమెరికా సోవియట్ ప్రతిపాదనను అంగీకరించలేదన్నది జగమెరిగిన సత్యం.

ఆయుధోత్పత్తి పరిమితికి ఉద్దేశించిన నిర్మాణాత్మకమైనసోవియట్ ప్రతిపాదనలనుఎవరు అమలు పరుస్తున్నారో, ఎవరు తమ సైనిక బడ్జెటును తగ్గించకపోగా, విపరీతంగాపెంచుతున్నారో, అత్యంత విధ్వంసకాయుధాల అభివృద్ధినిసైతం ఎవరుత్వరితపరుస్తున్నారో కూడా నేడు జగద్విదితమే: "సోవియట్ ప్రమాదం"అనే అభూత కల్పనా ప్రచారం ఎంత ఉధృతంగా చేసినప్పటికీ, ప్రపంచాన్నంతటినీ అత్యంత విధ్వంసకరమైన ఆయుధాలతో ముంచెత్తివేయడంలో పెట్టుబడిదారీ సంపన్న దేశాలూ, నాటో యుద్ధకూటమి దేశాలదే పూర్తి బాధ్యత అన్న నగ్న సత్యాన్ని మరుగుపర్చలేరు.

ఆయుధ పోటీని నిరోధించాలి. ఆయుధ మహా పర్వతాల మీద కూర్చున్న ప్రపంచం విసుగెత్తి పోయింది, అని సోవియట్ నాయకుడు బ్రెజ్నేవ్ పేర్కొన్నారు.

పాశ్చాత్య ప్రపంచానికి వ్యతిరేకంగా ఏ ప్రకటనా చేయని స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనాసంస్థ (సిప్రి) సైతం యిటీవల యిలా హెచ్చరించింది. "సైనిక సాంకేతిక రంగంలో పురోగతి, విశ్వవ్యాపితంగా అధునాతన మారణాయుధాల పరివ్యాప్తి, ప్రపంచ వ్యాపితంగా విస్తరించిన అణ్వాయుధ నిర్మాణ శక్తి ప్రపంచ భద్రతకు మహా ప్రమాదకారులు గణనీయమయిన నిరాయుధీకరణ చర్యలను సాధించని పక్షంలో, ప్రపంచాన్ని మహా విధ్వంసం నుండి రక్షించడం అసాధ్యం."

ఆయుధ పోటీ నివారణకై ప్రపంచ ప్రజానీకం ముక్త కంఠంతో నినదించాలని శాంతి రక్షణకు ఎలుగెత్తి పిలవాలిని ప్రపంచ శాంతి సమితి ప్రపంచంలోని సమస్త జాతులకూ విజ్ఞప్తి చేసింది.

మనకు జీవించే హక్కువుంది. అందుకే శాంతి పరిరక్షణకు మనం ప్రతినబూనుదాం

ఆంధ్రా యూనివర్సిటీ యం. ఎ. డిగ్రీ పరీక్ష ఫలితాలు

వాల్తేరు, అక్టోబరు 25

1976 మేలో సెమిస్టర్ పద్ధతికింద ఆంధ్రాయూనివర్సిటీకాలేజ్‌ఆఫ్‌ఆర్ట్సుకామర్స్ అండ్ లా (ఆంధ్రా యూనివర్సిటీ-వాల్తేరు) నిర్వహించిన క్రింది పరీక్షలో ఉత్తీర్ణులయిన విద్యార్థుల రిజిష్టర్ నంబర్ల తాత్కాలిక జాబితా

ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్ వెల్ఫేర్

(IV సెమిస్టర్ ఎండ్ ఎగ్జామినేషన్)
I II, III అండ్ IV సెమిస్టర్స్ పుట్ టుగెదర్

ఫస్టుక్లాస్ విత్ డిస్టింక్షన్ లేరు.
ఫస్టుక్లాస్ 799 800-ఎ 01 02
04 09
సెకండ్‌క్లాస్. 800 05 10-ఎ 12

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు, ఏరియా II రామగుండం డివిజన్, గోదావరి ఖని ప్రాజెక్టువారిచే కింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుతున్నాయి

1. డోజర్/స్క్రాపర్ ఆపరేటర్ . ఖాళీ స్థానాల సంఖ్య - 9

అర్హతలు అనుభవం 4½ Cu Yd. తక్కువగాని శక్తిగల డోజర్, స్క్రాపర్, ఎలక్ట్రిక్/డీజిల్ డ్రాగ్‌లైన్/ షావెల్‌వంటి హెవీఎర్త్‌మూవింగ్ మెషనరీలను చేపట్టి పనిచేయించడంలో అభ్యర్థులు అత్యంత నైపుణ్యంగలవారై ఉండాలి అనుభవం 7 (ఏడు) సంవత్సరాలకు తక్కువకాకుండా ఉండాలి. ఇది కాక అభ్యర్థికి మెకానిజం గురించి సాధారణ పరిజ్ఞానం ఉండాలి. యంత్ర నిర్వహణలో చిన్న మరమ్మత్తులు చేయగలగాలి.

వేతన స్కేలు రోజుకు రు 20 45—1.00—30.45 ఇంకా ఇతర అలవెన్సులు.

2. మెకానిక్ గ్రేడ్ I . ఖాళీస్థానాల సంఖ్య - 3

అర్హతలు - అనుభవం షోవెల్స్ / డ్రాగ్‌లైన్స్ / డీజల్ ఇంజన్స్, యూక్లిడ్/ లెట్‌మ్యాక్‌డంపర్స్, ట్రాక్టర్స్, డోజర్స్, స్క్రాపర్స్ మొదలైన యంత్రాల మరమ్మతులు, నిర్వహణ, ఓవర్‌హాలింగ్‌లో అభ్యర్థులకు కనీసం 10 (పది) సంవత్సరాల అనుభవం ఉండాలి డీజల్ ఇంజన్‌లు అసెంబ్లీలను మరమ్మత్తు చేయగలిగి ఉండాలి. యాంత్రిక లోపాలను కనిపెట్టి, సరిదిద్దాలి ఈ పనిని స్వతంత్రంగా చేపట్టాలి. మరమ్మత్తులు, నిర్వహణ, లాగ్ బుక్‌లు తయారుచేసి ఉంచడానికి తగిన చదువురావాలి. నిర్వహణ చార్టులు, విడిభాగాల జాబితాలను అర్థం చేసుకోవాలి.

వేతన స్కేలు . రోజుకు రు. 23.00-1.15-34.50 ఇదికాక ఇతర అలవెన్సులు.

3 మెకానిక్/గ్రేడ్ II : ఖాళీ స్థానాల సంఖ్య 6

అర్హతలు - అనుభవం షోవెల్స్, డ్రాగ్‌లైన్స్/ డీజల్‌ఇంజన్స్ యూక్లిడ్/లేట్, మాక్‌డంపర్స్, ట్రాక్టర్స్, డోజర్స్, స్క్రేపర్స్ మొదలైన వాటిని మరమ్మత్తులు, నిర్వహణ, ఓవర్ హాలింగ్‌లో అభ్యర్థులకు కనీసం 6 (ఆరు) సంవత్సరాల అనుభవం ఉండాలి డీజల్ ఇంజన్‌లు స్క్రాపర్‌లను అభ్యర్థి మరమ్మతు చేయగలిగి ఉండాలి. యంత్ర లోపాలను కనిపెట్టి సరిదిద్దగలగాలి. ఈ పనులు స్వతంత్రంగా చేపట్టాలి. మరమ్మత్తులు నిర్వహణ లాగ్‌బుక్స్ రూపొందించడానికి తగినంత చదువువచ్చి ఉండాలి. నిర్వహణ చార్టులు, విడిభాగాల లిస్టులను అర్థం చేసుకోవాలి.

వేతనస్కేలు : రోజుకు రు. 18-60 - 0.87- 27.30 ఇంకా ఇతర అలవెన్సులు.

4. ఫోర్‌మన్ ఇన్‌ఛార్జ్ (ఎక్స్‌కవేషన్)
ఖాళీ స్థానాల సంఖ్య 1

అర్హతలు-అనుభవం మెకానికల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో అభ్యర్థి డిప్లొమాపొంది ఉంటే మంచిది. స్క్రాపర్, డోజర్, డంపర్, డ్రాగ్‌లైన్స్‌వంటి హెవీ ఎర్త్‌మూవింగ్ మెషిన్‌ల ఎరక్షన్, లేక్‌కటింగ్ డ్రిల్లింగ్ పనులువంటి వివిధ రకాలున్న వర్క్‌షాప్ నిర్వహణా పరిజ్ఞానం 7 (ఏడు) ఏళ్ళు తప్పక ఉండాలి. డిప్లొమా హోల్డర్లు కాకుండా హెవీఎర్త్‌మూవింగ్ మెషినరీ మరమ్మత్తులో 10-12 ఏళ్ళ అనుభవంగలవారు కూడా దరఖాస్తు చేయవచ్చుగానీ అక్షరాస్యులై ఉండాలి.

వేతన స్కేలు నెలకు రు 592 - 32-848-36-992 ఇంకా ఇతర అలవెన్సులు.

5 ఫోర్‌మన్ · ఖాళీ స్థానాల సంఖ్య 3.

అర్హతలు-అనుభవం . అభ్యర్థులకు మెకానికల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా ఉంటేమంచిది స్క్రాపర్, డోజర్, డంపర్స్, డ్రాగ్‌లైన్స్ మొదలైన హెవీఎర్త్‌మూవింగ్ మెషన్‌ల ఎరక్షన్, అనేక రకాల లేక్‌కటింగ్, డ్రిల్లింగ్ పనులున్న వర్క్‌షాప్ యాజమాన్య పరిజ్ఞానం; నిర్వహణ అనుభవం కనీసం 4 ఏళ్ళు ఉండాలి డిప్లొమాలేని వ్యక్తులకు హెవీఎర్త్‌మూవింగ్ మెషినరీ మరమ్మత్తులో 7 లేదా 9 ఏళ్ళ అనుభవం ఉంటే వారు కూడా దరఖాస్తు చేయవచ్చు. గానీ అక్షరాస్యులై ఉండాలి.

వేతన స్కేలు . రు. 510-27-726-32-854 ఇంకా ఇతర అలవెన్సులు.

1. వయోపరిమితి : 35 సంవత్సరాలకు మించకూడదు (అసాధారణమైన సందర్భాల్లో సడలించ బడుతుంది)

2. ఉద్యోగాలకు సాధారణ కటువుభత్యం: ప్రావిడెంట్‌ఫండ్, బోనస్, సెలవు సౌకర్యాలు మొదలయినవన్నీ కంపెనీ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు అమలులో ఉన్న నిబంధనల మేరకు ఉంటాయి.

3 ఎంపిక చేసిన అభ్యర్థులు ఆరోగ్యరీత్యా అర్హులని ప్రకటించిన తర్వాత 6 నెలలపాటు ప్రొబేషన్‌లో నియమించ బడతారు. సంతృప్తికరమైన వార్త అందిన అనంతరం ధృవీకరించ బడతారు. ప్రొబేషన్ కాలంలో ఒకనెల నోటీసుతో సర్వీసును రద్దు చేయవచ్చు.

4. స్థానిక భాష, స్థానిక పరిస్థితులు తెలిసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

5 ప్రభుత్వ సర్వీసు ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉన్నవారు తమడిపార్టుమెంట్ అధిపతులనుండి ముందు అనుమతి పొందాలి. వారు ఎంపికయిన పక్షంలో విడుదల చేస్తామని ఆ అనుమతిలో తెలపాలి దరఖాస్తులను తగిన పద్ధతిలోపంపాలి. నేరుగా పంపే దరఖాస్తులు పరిగణించ బడవు

6. ఇంటర్వ్యూకు పిలిచిన అభ్యర్థు లెవ్వరికీ రైలు ఛార్జీలు మరే ఇతర అలవెన్సుగానీ కంపెనీ ఇవ్వబోదు.

7 అభ్యర్థులు కింది వివరాలు తెలపాలి.

1. పేరు (అచ్చు అక్షరాలలో).
2 తండ్రిపేరు
3 పుట్టినతేదీ (వి) వయస్సు
4. ప్రస్తుత చిరునామా
5. శాశ్వత చిరునామా
6. అర్హతలు (విద్యా, సాంకేతిక)
7. మొత్తం మార్కులు .
(1) హెచ్ ఎస్ సి / మెట్రిక్యులేషన్, ఎస్ ఎస్ ఎల్ సి మరియు క్లాస్
(11) డిప్లొమా - క్లాస్ (డిప్లొమా కోర్సులో ప్రతి ఏడాది మార్కులు, ఎటెస్టెడ్ కాపీలతో సహా)
8. నేటివిటీ (పుట్టిన ప్రాంతం)
9. ప్రస్తుత ఉద్యోగం, అనుభవం.
10 దరఖాస్తుతోపాటు సర్టిఫికెట్లు, టెస్టిమోనియల్స్ అటెస్టెడ్ కాపీలు పంపాలి
11 మీరు షెడ్యూలు కులం/షెడ్యూలు జాతి/వెనుకబడిన తరగతికి చెందినవారా ?

(తహశీల్దారు స్థాయికి తక్కువగాని ఆఫీసర్ ఇచ్చిన సర్టిఫికెట్ అటెస్టెడ్ ప్రతి దరఖాస్తుతో పంపాలి.)

అడిషనల్ జనరల్ మేనేజర్
ఏరియా II : రామగుండం డివిజన్,
పి. ఒ గోదావరిఖని -505209 కరీంనగర్‌జిల్లా (ఆం ప్ర.)
74/Advt/76.77/18.10 76

దక్షిణమండలం సూపర్ థర్మల్ కేంద్రానికి స్థల నిర్ణయం జరగలేదు

పార్లమెంటరీ సంప్రతింపుల కమిటీ సమావేశంలో శ్రీ ఈశ్వరరెడ్డికి మంత్రి సమాధానం

న్యూఢిల్లీ, అక్టోబర్ 25

దక్షిణ మండలంలో సూపర్ థర్మల్ కేంద్రం నిర్మాణానికై స్థలం ఎంపిక విషయంలో ఇంకా నిర్ణయం జరగలేదని, ఇంధనం మంత్రిత్వశాఖ పార్లమెంటు సభ్యుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ వై. ఈశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీ కె సి పంత్ సమాధానంగా తెలియచేశారు

సమావేశం అక్టోబర్ 16 న ఇంధనం శాఖ మంత్రి శ్రీ కె సి పంత్ అధ్యక్షతన జరిగింది

శ్రీపంత్ సమాధానం చెబుతూ సూపర్ థర్మల్ కేంద్రాలకు సంబంధించిన 5 సాధ్యాసాధ్యాల నివేదికలను 1975లో ప్రపంచ బ్యాంకుకు పంపబడ్డాయని, ప్రపంచబ్యాంకు అంచనాల బృందం సింగ్రౌలి సూపర్ థర్మల్ కేంద్రం (2 వేల మెగావాట్లు) అంచనావేయడానికై 1967 జనవరి, ఫిబ్రవరి నెల్లో భారతదేశం సందర్శించడం జరిగిందని, అతరువాత ఇద్దరు ప్రపంచబ్యాంకు అధికారులు 1976 జులైలో రావడంకూడా జరిగిందని తెలిపారు ఈ ప్రాజెక్టుకు రుణం విషయమై త్వరలో సంప్రదింపులు జరగ వచ్చునని అన్నారు

ఒక్కొ ప్రాజెక్టు విషయంలో సంప్రదింపులు పూర్తి కావడానికి 2 సంవత్సరాలు పట్టడంవల్ల శ్రీ ఈశ్వరరెడ్డి ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తూ, ఈ లెక్కన మిగతా సూపర్ థర్మల్ కేంద్రాల విషయంలో ఎంతకాలం పడుతుందోనని ఆందోళన వెలిబుచ్చారు

అన్ని సూపర్‌థర్మల్ కేంద్రాలకు ఎంత వ్యయమవుతుందని శ్రీ ఈశ్వరరెడ్డి ప్రశ్నించగా, దాదాపు 2 వేల కోట్లు అవసరముంటుందని, అందులో 60శాతం పరికరాల రూపంలో వుంటుందని మంత్రి తెలియజేశారు

రామగుండంలో సూపర్ థర్మల్ స్టేషన్ నిర్మించే విషయమై గత పార్లమెంటు సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్లమెంటు సభ్యులు కలుసుకొన్నప్పుడు మంత్రి చేసిన సూచనను వివరించమని శ్రీ ఈశ్వరరెడ్డి కోరారు

ఆంధ్రప్రదేశ్‌తో సహా కర్ణాటక, కేరళ సంయుక్తంగా ఈ విషయంలో ఒక అవగాహనకు రాగలరేమో పరిశీలించమని తాను కోరినది యథార్థమేనని మంత్రి తెలియచేశారు

ఆయనింకా అదేఅభిప్రాయంతో వున్నట్లు ఇందుకు సంబంధించిన వారి వైఖరి తెలుసుకొన్న తరువాత, ఈ విషయాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకెళతానని మంత్రి అన్నారు

మూడు రాష్ట్రాలు ఒక ఒప్పందానికి వస్తే ఈ కేంద్ర నిర్మాణానికి ఎవరు పెట్టుబడి పెడుతారని శ్రీ ఈశ్వరరెడ్డి సూటిగా ప్రశ్నించగా అప్పుడు ఆ విషయాన్ని పరిశీలించగలమని మంత్రి సమాధానం చెప్పారు.

జమ్మూ-కాశ్మీర్ మంత్రివర్గ ప్రమాణ స్వీకారం వాయిదా

శ్రీనగర్, అక్టోబరు 25

నేడు ప్రమాణస్వీకారం చేయాల్సిన జమ్మూ - కాశ్మీర్ విస్తృత మంత్రివర్గ కార్యక్రమం వాయిదా పడింది.

ముఖ్యమంత్రి షేక్ అబ్దుల్లా కాంగ్రెస్‌ల మధ్య తలెత్తిన సమస్యలు సామరస్యంగా పరిష్కరింపబడేందుకు వాయిదా వేసినట్టు తెలియవచ్చింది

వాయిదా వేయాలని తాము చేసిన అభ్యర్థనను గవర్నర్ శ్రీ ఎల్ కె ఝా అంగీకరించారని రాజభవన్‌లో శ్రీ అబ్దుల్లా తమ ప్రకటనను చదివారు

కాశ్మీర్ లోయలో నవంబరులో జరగాల్సిన మున్సిపల్ ఎన్నికలను కూడ వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు

పెదతిప్పలో పట్టాల పంపిణీ

రాజోలు, అక్టోబరు 25

తూర్పు గోదావరిజిల్లా రాజోలు తాలూకా రామరాజు లంక గ్రామంవారు పెదతిప్ప గ్రామంలోని హరిజనులు, వెనుకబడిన జాతులకు చెందిన 87 మందికి రాజోలు తహశీలుదారు శ్రీ ఎ ఎన్ ప్రకాశరావు యిళ్ళస్థలాల పట్టాలు పంచిపెట్టారు

తహశీల్దారు జోరున వర్షంకురుస్తున్నా సుమారు రెండుమైళ్ళ దూరం కాలినడకన వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు

తాలూకా డిప్యూటీ తహశీల్దారు, గ్రామ సర్పంచ్ శ్రీ బొరుసు వెంకటబ్రహ్మానందం పిర్కా రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ శ్రీరామమూర్తి గ్రామమునసబు శ్రీ ఎం భాస్కరరావు, కరణం శ్రీ ఎస్ కృష్ణమూర్తి పంచాయతీ సభ్యులు శ్రీ తిరుమల గవరయ్య శ్రీ మేడిశర్ల పులావావుకూడా యీ కార్యక్రమంలో పాల్గొన్నారు

భారీవర్షాలవల్ల అలస్యమైన రైళ్ళు

కలకత్తా, అక్టోబరు 25

దక్షిణ మధ్య రైల్వేలో మనుబోలు - గూడూరు మధ్య భారీవర్షాల కారణంగా రైళ్ళ సర్వీసులకు ఆటంకం ఏర్పడింది

ఆగ్నేయ రైల్వే ప్రధాన కార్యాలయానికి అందిన సమాచారం ప్రకారం 38 డౌన్ మద్రాస్ - హౌరా జనతా ఎక్స్‌ప్రెస్, 4 డౌన్ మద్రాస్ హౌరా మెయిల్ (వయా) అర్కోనం, రేణిగుంట, గూడూరు మీదుగా రూట్ మారి 19 న మమూలు సమయానికి అలస్యంగా హౌరా చేరింది

అలాగే 80 డౌన్ రేణిగుంట - పూరి ఎక్స్‌ప్రెస్ 90 డౌన్ మద్రాస్ - టాటా, బొకారో స్టీల్ సిటీ ఎక్స్‌ప్రెస్ కూడా పూరి బొకారో స్టీల్ సిటీలకు ఆలస్య మయ్యాయి

ఇటీవల హైదరాబాదులో ప్రదర్శన లిచ్చిన సోవియట్ సాంస్కృతిక బృందం సభ్యులతో రాష్ట్ర వినోద పర్యటనశాఖ మంత్రి డా॥ సి హెచ్. దేవానందరావు, సమాచారశాఖ డైరెక్టర్ శ్రీమతి శ్రీ రాజ్యంసిన్హా ప్రభృతులు.

ప్రజాతంత్ర ఉద్యమంలో ముస్లింల భాగస్వామ్యం

తెనాలి తాలూకా ముస్లిం మైనారిటీల మహాసభలో శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ ఉద్బోధ

(విశాలాంధ్ర విలేకరి)

తెనాలి అక్టోబరు 25

ప్రజాస్వామ్యంపై విశ్వాసం వున్న శక్తులు, పార్టీలు సమైక్యంగా నిలిచి, విదేశీ శక్తుల సహకారం, అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు శక్తులు సాగించే కుట్రలను ఎదిరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవాలని, ఆ కర్తవ్య నిర్వహణలో ముస్లిం ప్రజానీకం భాగస్వాములై తమవంతు బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసర మెంతో వుందని శాసనసభలో ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ ఉద్బోధించారు.

తెనాలి తాలూకా ముస్లిం మైనారిటీస్ బ్యూరో మహాసభను ప్రారంభిస్తూ మైనారిటీ ప్రజలలో తమకి అన్యాయం జరుగుతుందనే భావం కలగకుండా వారి సంక్షేమానికై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నొక్కి చెప్పారు

స్థానిక ముస్లిం ఎలిమెంటరీ పాఠశాలలో యీ నెల 24 న తాలూకాలోని 21 గ్రామాల నుండి, పట్టణంలోని వివిధ పేటల నుండి 180 మంది ప్రతినిధులు, జిల్లాలోని వివిధ తాలూకాల నుండి 30 మంది సోదర ప్రతినిధులతో యీ మహాసభ అత్యంత ఉత్సాహపూరితంగా జరిగింది

ప్రతినిధుల సమావేశంలో "20 అంశాల కార్యక్రమం ముస్లిం ప్రజల సమస్యలు" అనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి

అనంతరం హైదరాబాద్‌లో జరిగిన మహాసభ ఆమోదించిన అంశాలను ప్రదేశ్ ముస్లిం మైనారిటీస్ బ్యూరో కౌన్సిల్‌సభ్యులు శ్రీ సయ్యద్ మహబూబ్‌సాహెబ్ వివరించారు.

సాయంత్రం 5 గంటలకు స్కూలు ఆవరణలో ప్రత్యేకంగా బహిరంగసభ వేదిక నిర్మించారు. 80 ఏళ్ళ తర్వాత ముస్లిం ప్రజలు ఒకే వేదికమీదకువచ్చిన యీ సభకు తాలూకా నలుమూలల నుండి 2 వేలమంది పైగా వచ్చారు

జిల్లా వక్ఫ్ కమిటీ అధ్యక్షులు శ్రీ ముస్లిమ్ మహమ్మద్ హసన్ సభకు అధ్యక్షత వహించారు. వేదికపై శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ, గుంటూరు జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ ఈదర సాంబశివరావు, తాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ లోకం వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖ న్యాయవాది శ్రీ షేక్ ఖయ్యూం, మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు శ్రీ అబ్దుల్ రషీద్, ఉపాధ్యక్షులు శ్రీ రహంతుల్లా కార్యదర్శులు శ్రీ ఎస్.వి అజీం, ముబారక్ అలీఖాన్, ముస్తాన్‌బేగ్ తదితరులు ఆసీనులయ్యారు

శ్రీ శ్రీకృష్ణ సభను ప్రారంభిస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో, దేశ స్వాతంత్ర్యం అనంతరం జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో ముస్లిం ప్రజలు తమ కర్తవ్యాన్ని నిర్వహించారనటం నిర్వివాదాంశం అన్నారు

ఇటీవల కాలంలో దేశంలో మతతత్వ శక్తులు, అభివృద్ధి నిరోధకపార్టీలు, ప్రజాస్వామ్య వ్యవస్థనే ధ్వంసం చేయబూనుకున్నాయని, యీ ఫాసిస్టు శక్తుల ప్రమాదాన్ని గురించి కమ్యూనిస్టుపార్టీ మొదటినుండి హెచ్చరిస్తూనే వుందని అన్నారు

ఆ ప్రమాదం నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవటంలో నూ, నూతన ఆర్థిక కార్యక్రమాన్ని అమలు జరిపించుకో వలసిందిగా ప్రజాతంత్ర శక్తులన్నీ కలసి ఉద్యమించాల్సివుందని, ఈ కార్యక్రమంలో భాగంగానే ఒకే భాష, ఒకే సంస్కృతి వున్న ఏడుకోట్ల మంది ముస్లింలకు ఉర్దూభాష విషయంలోనూ, ఇళ్ళస్థలాలు, ఉద్యోగ నియామకాల విషయంలోనూ జరుగు యితర ప్రజాతంత్ర పోరాటాల్లో కలసి పోరాడాల్సి వుందన్నారు. ఇంత సంఖ్యాబలం గల ముస్లిం ప్రజల న్యాయమైన కోర్కెలను దత్తబద్ధం చేసి పరిష్కరింపటకు కాంగ్రెసుతోపాటు, కమ్యూనిస్టుపార్టీ పూర్తి సహకారం యిస్తుందన్నారు.

శ్రీ ఈదర సాంబశివరావు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సమస్యలు ఒక్క ముస్లింల సమస్యలే కావని, అవి మొత్తం జాతి సమస్యలని, వాటి పరిష్కారానికి ఉద్యమంలో మొత్తం వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ భాగస్వాములు కావాలంటూ ప్రపంచ దేశమైన సోవియట్ యూనియన్‌లో ముస్లిం ప్రజల ఆర్థిక, సాంఘిక స్థితి గతులను వివరించారు.

శ్రీ లోకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 7 కోట్ల మందివున్న ముస్లింప్రజలు దారిద్ర్యంతో, సమస్యలతో సతమతమవ్వటం దేశానికే నష్టదాయకమని, వారి సమస్యల పరిష్కారానికై సోషలిస్టు పోరాటాలకు వెనుకాడక ముందుకొచ్చి పోరాడాలన్నారు.

(మిగతా 7 వ కాలంలో)

(5 వ కాలం తరువాయి)

శ్రీ సయ్యద్ మహబూబ్, మాట్లాడుతూ భారతదేశంలో ద్వితీయ స్థానంలో వున్న ఆర్థికంగా, సాంఘికంగా తగు ప్రోత్సాహం లేక వెనుకబడివున్న ముస్లింలు స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన ఘర్షణలనుండి బైటపడి జాతీయజీవనంలో భాగస్వాములు కావాలని, ప్రజాస్వామిక శక్తులతో ముస్లిం ప్రజలు సంఘటితమవుతున్న యీ దశలో కొన్ని స్వార్థపర శక్తులు చేసే దుష్ట యత్నాలను ముస్లింప్రజలు చైతన్యంతో ఎదుర్కొని ఇరవై అంశాల కార్యక్రమం అమలుకు తమవంతు హక్కులతో సమీకృతం కావాలని అన్నారు.

తెనాలి పట్టణ న్యాయవాది శ్రీ మహ్మద్ సైదా, గుంటూరు పట్టణ న్యాయవాది శ్రీ షేక్ ఖయ్యూం, గుంటూరు వక్ఫ్ కమిటీ అధ్యక్షులు శ్రీ ముస్తీమస్తాన్ కూడా సందేశాలిచ్చారు.

ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ముబారక్ అలీఖాన్ యీ మహాసభ ఇంత ఉత్తేజకరంగా జరిగేందుకు ఆర్థికంగా సహాయపడిన దాతలకు, అహర్నిశలు కృషి చేసిన ముస్లిం యువజన, విద్యార్థి కార్యకర్తలకు, ప్రముఖులకు అభినందనలు తెలియజేశారు.

గుంటూరు జిల్లా చేనేత సమాఖ్య మహాసభ అకుంఠితమయిన ఐక్యతకు నాంది కావాలి

అసూయ అహంభావం మానవసంఘములో దుష్పరిణామాలు వాటి పరాకాష్టయే స్వార్థపర, సంకుచిత దురభిమానాలు అట్టి విషవాయువుతో నిండిన కారుమేఘాలు చేనేత వుద్యమాన్ని అలముకొనివున్నాయి వాటిని ఛేదించగల క్రాంతిరేఖలాగా అకుంఠితమైన ఐక్యతకు యీ మహాసభ నాందిగావాలి

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియను కాంగ్రెసు సూత్రప్రకారం ఒక వృత్తికి ఒకేసంఘము ఏర్పడాలి ఏ రాజకీయాలకు చెందినవారయినా అందులో యిమిడిపోవాలి బలీయమయిన చేనేత ఉద్యమ నిర్మాణం జరగాలి అందుకు యీ మహాసభ నాందిగావాలి

చేనేతశాఖమంత్రి శ్రీ కె వి కేశవులు అక్టోబరు 26 వ తేదీ తెనాలిలో జరుగుచున్న యీ మహాసభకు హాజరుఅవుతున్న సందర్భముగా సముచితమయిన నిర్ణయాలుజరిగి, చేనేతసమస్యలు పరిష్కరించబడాలి ఇందిరా గాంధీ 20 సూత్రాల పథకం ఎక్కడెక్కడ వర్తింప చేయాలో వర్తింపజేసి, వాటి ప్రయోజనంపొందాలి

ఈ జిల్లాలో 1 లక్ష చేనేత మగ్గాలు వున్నాయి 5 లక్షల మంది యీ పరిశ్రమపై ఆధారపడియున్నారు 170 చేనేత సహకార సంఘాలు వున్నాయి వాటిలో 22 మాత్రమే పనిచేస్తున్నాయి ఇంటిలో మనుష్యులు అంతా పనిచేసినా పొట్టనిండని యీ పరిశ్రమను విడిచి యితర వృత్తులలోకి వెళ్ళాలనే కాంక్ష, ముఖ్యముగా యువకులలో ప్రబలుతూ వుంది ఇది గ్రామీణ పరిశ్రమ యిప్పుడిప్పుడే కార్ఖానాపద్ధతిలోకి మార్పు చెందుతూంది పవరుమగ్గాల రూపములో ఆధునికీకరణ జరుగుతోంది ఈ మార్పు మంచిదేగాని దీనితోపాటు సాంకేతిక శిక్షణ యిచ్చి పనిలో నైపుణ్యం పెంచాలి

ఈ సంవత్సరము యీ జిల్లాలో చేనేత సహకార సంఘాలకు 21 లక్షల రూపాయలు కేష్ క్రెడిటు యిచ్చారు నూలు సప్లయి ధరలు నిలకడ లేకుండా వున్నాయి బట్ట విడుదల సమస్య యెప్పుడూ కష్టంగానే వుంది చేనేత సహకార ఎపెక్సు సంఘము విలీనం జరిగిన తరువాత ఆప్కో హ్యాండ్లూమ్స్‌వారు ప్రాథమిక సంఘాల వుత్పత్తిలో 80 వంతులు కొనుగోలు చేస్తామని ప్రకటించినారు. అది గట్టిగా అమలు జరిపితే చాల వుపయోగంగా వుంటుంది

నూలు సప్లయికి పూర్తిగా వర్తకులపై ఆధారపడవలసి వస్తోంది అందువల్ల ప్రాథమిక సంఘాలకు సకాలంలో సరసమయిన ధరలకు నూలు లభించుటలేదు, అంతేగాక ప్రాథమిక సహకార సంఘం అనేక వక్రమార్గములు అనుసరించుటకు అవకాశము కలుగుతుంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ చేనేత సహకార సంఘమువారు గాని, మిల్లు ఫెడరేషన్ గాని జిల్లాలో ముఖ్య కేంద్రాలలో గుంటూరు, తెనాలి, రేపల్లె సత్తెనపల్లి పట్టణాలలో డిపోలు తెరచి నూలు సప్లయి చేయాలి నూలుతో పాటురంగులు, రసాయనము కూడా సప్లయి చేయాలి

శ్రీ గంజి వుసలయ్య
అధ్యక్షులు
గుంటూరుజిల్లా చేనేత సంఘం
సభ్యులు
గుంటూరుజిల్లా చేనేత డెవలప్‌మెంట్ కమిటీ

నూలు సమస్య యింతటితో పరిష్కారము గాదు నూలుమిల్లులు జాతీయం చేసి, పంపిణీ ప్రభుత్వ ఆధ్వర్యమున జరిపినప్పుడే పరిష్కారమవుతుంది

బట్టవిడుదల సమస్యకు పూర్తి పరిష్కార మార్గం మిల్లులనూ, పవరు మగ్గాలనూ, చేనేత మగ్గాలకునూ వాటి వుత్పత్తి స్థాయిని బట్టి వుత్పత్తి కేటాయింపులు జరగాలి ప్రాథమిక సహకార సంఘాలు డెవలప్‌మెంటు కార్పొరేషను, వుత్పత్తి కేంద్రములూ, వుత్పత్తి సంస్థలుగాను ఆంధ్ర ప్రదేశ్ చేనేత సహకార సంఘమూ, వాటి డిపోలు కార్పొరేషను, వాటి డిపోలు, సేల్సు కేంద్రాలుగాను, పరిణామం చెందితే యీ బట్ట విడుదల సమస్య పరిష్కారమవుతుంది తాత్కాలికముగా యీ దిగువ కోర్కెలుకూడా నెరవేర్చాలి.

(తెనాలిలో నేడు జరుగనున్న చేనేత సమాఖ్య మహాసభ సందర్భంగా ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం -సం॥)

1. అధిక సంఖ్యలో మగ్గములున్న వేటపాలెంలో ఏర్పరచిన విధంగా గుంటూరు జిల్లాలోని మంగళగిరిగాని లేక ఫిరంగిపురంలో గాని చేనేత వుత్పత్తి కేంద్రమునెలకొల్పాలి

వుత్పత్తి ఖర్చులు పెరిగినాయి, రిబేటుకు ప్రత్యామ్నాయం లేదు కనుక ప్రాథమిక సంఘాలు పని చేయలేక మూతపడు తున్నాయి. మిల్లుల, పవరుమగ్గాల పోటీకితట్టుకొని ప్రస్తుతకాలంచే ప్రాథమిక సంఘాలు సప్లయి చేసే నూలు కార్పొరేషన్ మిల్లులు యిచ్చే రేటుతో, కోఆపరేటివ్ మిల్లుల ద్వారాగాని మిల్లు ఫెడరేషన్ ద్వారాగాని నూలు సప్లయి చేయాలి

3 మూత పడిన సంఘములు పునరుద్ధరించుటకు జిల్లాలో 2 సంఘములు చిలకలూరిపేట, రాజాపేటలు మాత్రం నిర్ణయించారు పునరుద్ధరించుటకు వీలయిన సంఘాలన్నీ పునరుద్ధరించాలి

4. చేనేత డిపార్టుమెంటువారు కొన్ని సంఘాలు నెలకొల్పాలను కున్నారు. వాటిలో (1) ముట్లూరు (2) యినిగండ్ల, అవకాశమున్నచోట్ల నెలకొల్పాలి

5 చేనేత మగ్గాలన్నీ సహకార సంఘాలలో చేరుటకు డిపార్టుమెంటు కృషి చేయాలి. అవసరమయిన షేరుధనం అప్పుగా ప్రభుత్వం మంజూరు చేయాలి

6 ప్రాథమిక సంఘాలు కొత్తగా పని చేయలేవు, అనుభవంలేక సక్రమంగా పని చేయలేవు, గనుక సంఘాలు నడవటానికి కో-ఆపరేటివ్ సీనియర్ ఇనస్పెక్టర్లను పార్టు టైం మేనేజర్లుగా వెయాలి వాటి సిబ్బందికి జీతాలు రెండేళ్ళ వరకు ప్రభుత్వం భరించాలి

7 పని వికేంద్రీకరణ జరిగి, న్యాయమయిన మజూరీ రావటానికి పనితనం పెరగటానికి యిచ్చిన నూలు సమ్మకంగా రావటానికి, ప్యాకేజీస్కీములు ఉండాలి ఇప్పుడు చిలకలూరిపేటలోగాని ఫిరంగిపురంలోగాని నెలకొల్పాలి

8 ఎగుమతి రకములయిన అమెరికన్ షర్టింగులకు ధరలు నిలకడ లేనందువల్ల చాలా మంది నష్టపడిపోతున్నారు న్యాయమయిన మజూరి గిట్టేలాగు, ధరలు నిలకడగా వుండేలాగు చూడాలి.

9 చేనేత వారికి సబ్సిడీతో పరికరాలు సప్లయిచేసి, మేస్త్రీలను పంపి ఆధునిక డిజైనులు నేర్పించాలి

10. అంతమటుకు సహకార సంఘాలకు యివ్వాల్సిన రిబేటు బకాయిలు యివ్వాలి

11. స్వంతముగా నేసి జీవించే చేనేత వారికి వ్యక్తిగత లోన్లు యిచ్చుటలో బ్యాంకు వారు కొన్ని చోట్ల యిచ్చినా చాలా చోట్ల పేచీలు పెట్టుచూ తిప్పుచున్నారుగాని, యివ్వడంలేదు. కనుక ఒకరికొకరు హామీతో లోన్లు యివ్వాలి

12 చేనేత వారికి యింటి వసతిలేక మురికి కూపాలలో క్రుగ్గి పోతున్నారు. మంగళగిరిలో యిటీవల కట్టించిన విధముగా కట్టించి యివ్వాలి. గ్రామీణ ప్రాంతాలలో హరిజన, గిరిజనులకు యిచ్చినట్లుగా వారిలోపాటుగా 25 వంతులు యిస్తామని ప్రభుత్వం ప్రకటించింది ఆ మేరకయినా అన్ని గ్రామాలలో చేనేతవారికి యిళ్ళవసతి కల్పించాలి

మహాసభ ప్రతినిధులంతా యీసమస్యలు చర్చించి, సముచితమయిన నిర్ణయాలు చేయగలరని ఆశిస్తాను.

గుజరాత్ కోఆపరేటివ్‌సంస్థల ఎన్నికల్లో ఎ. ఐ. టి. యు. సి. ఘన విజయాలు

(సి యన్. యస్)

అహమ్మదాబాద్, అక్టోబరు 25

గుజరాత్ మొత్తంగా ప్రత్యేకించి సౌరాష్ట్రప్రాంతంలో (జాయింట్) సంయుక్త మేనేజ్‌మెంటు కౌన్సిళ్ళతో సహా కో ఆపరేటివ్ బ్యాంకుల, కో ఆపరేటివ్ క్యాంటీన్ కమిటీల, కో ఆపరేటివ్ సొసైటీలకు జరిగిన ఎన్నికల్లో ఎ ఐ టి. యు సి యూనియన్ సభ్యులు ఘనవిజయాలను సాధించారు. కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కమిటీలు, కో ఆపరేటివ్ క్యాంటీన్ కమిటీల విషయంలో ఎ ఐ టి యు. సి అభ్యర్థులు లోగడ తమకున్న స్థానాలను నిలబెట్టుకోవడంతోపాటు తాము పోటీచేసిన అన్ని స్థానాలను గెలుచుకున్నారు

అహమ్మదాబాద్‌లో మినహా రాష్ట్రమంతటా ఈ నూతన వాతావరణం ఏర్పడింది

కాంగ్రెస్ నాయకత్వానగల ఐ ఎన్ టి యు సి యూనియన్ బహిరంగంగానే పాతకాంగ్రెస్, మజ్దూర్ మహాజన్ అభ్యర్థులకు మద్దతును ఇవ్వడానికి ప్రయత్నించారు

అహమ్మదాబాద్‌లో యూజీ ఎన్ ఎస్ పి నాయకులు శ్రీ మగాన్‌బరర్ వలుకుబడితో ఐ.ఎన్ టి యు సి యూనియన్ ఎ. ఐ టి యు సి. ని ప్రధాన శత్రువుగా పరిగణించింది ఏమైనప్పటికి ఎ. ఐ టి యు సి మాత్రం వారి మాదిరిగా వ్యవహరించలేదు

ఈ సందర్భంగా నిజంగా ఐ ఎన్ టి. యు సి కే నష్టం సంభవించింది ప్రత్యేకించి శ్రీ బరోత్ శాసనసభ్యులుగా ఎన్నికైన ప్రాంతం రబియార్ మిల్లుల్లో ఇది జరిగింది

కో ఆపరేటివ్ బ్యాంకు కమిటీల్లోను, సరఫరా సొసైటీలలో లభించిన విజయాలు ప్రత్యక్షం సురేంద్రనగర్, భావనగర్‌ల్లో పొందిన విజయాలకు ముందువి

సురేంద్రనగర్, కాంత కాటన్ మిల్స్ క్రెడిట్, సప్లయిసొసైటీకి సెప్టెంబరు 21 వ తేదీన జరిగిన ఎన్నికల్లో ఎ ఐ టి. యు. సి. యూనియన్‌కు చెందిన మొత్తం అభ్యర్థులు, ఐ. యన్ టి యు సి అభ్యర్థుల పైన విజయం పొందారు మజ్దూర్ మహాజన్ సంఘం ఐ యన్ టి యు సి కి పూర్తి మద్దత్తు యిచ్చింది

అతి క్లిష్టతరమైన సంయుక్త మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉన్న 5 సీట్లు ఎ ఐ టి యు సి అభ్యర్థులు గెలుపొందారు

భావనగర్‌లోని "న్యూ జహంగీర్‌వకీల్ మిల్స్ కోఆపరేటివ్ వర్కర్స్ బ్యాంకుకు జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఎ ఐ టి యు సి అభ్యర్థులకు అత్యధిక ఓట్లు లభించాయి ప్రత్యర్థులైన ఐ ఎన్ టి యు సి, మజ్దూర్‌సంఘ అభ్యర్థుల కంటె రెట్టింపు ఓట్లు అధికంగా వచ్చాయి

అదే విధంగా భావ్‌నగర్‌లో (జాయింట్) సంయుక్త మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో ఐ ఎన్ టి.యు సి, సి ఐ టి యు మజ్దూర్ మహాజన్ సంఘ అభ్యర్థులను నిలబెట్టారు ఇక్కడకూడా ఎ ఐ టి యు సి అభ్యర్థులు తిరుగులేని ఆధిక్యతతో 6 సీట్లను గెలిచారు

సూరత్ జిల్లాలోని ద్వారకాలో కూడా ఎ ఐ టి యు సి కి చెందిన అభ్యర్థులు విజయం సాధించారు

అదే విధంగా అదే జిల్లాలోని మాధిలో ఎ ఐ. టి యు. సి కి చెందిన ఐదుగురు అభ్యర్థులు ఘన విజయం పొందారు

రాజకోట్ జిల్లాలోని వంకారలో ఐదు సీట్లలో ఎ ఐ టి యు సి కి మూడు సీట్లు లభ్యమయ్యాయి

అహమ్మదాబాద్‌లో మొత్తంమీద ఎ ఐ. టి యు సి ఎనిమిది సీట్లు పొందింది

బరోడాలోని టెక్స్‌టైల్స్‌లో నాలుగు సీట్లు, అలెంబిక్ కెమికల్స్‌లో మొత్తం ఐదు సీట్లను ఎ ఐ. టి యు సి. గెలుచుకున్నది రాజకోట్‌లో మాత్రం రెండు సీట్లు విజయం పొందింది

జాబితా అసంపూర్తిగానే వుంది అన్ని కేంద్రాలనుండి నివేదికలు అందిన అనంతరం మాత్రమే పూర్తి వివరాలు తెలియగలవు.

ఐదవ ప్రణాళికా ప్రతి లోక్‌సభకు సమర్పణ

న్యూఢిల్లీ, అక్టోబరు 25

ప్రణాళికామంత్రి శ్రీ శంకర్ ఘోష్ నేడు లోక్‌సభకు ఐదవ పంచవర్ష ప్రణాళిక ప్రతిని సమర్పించారు.

1974-79 ప్రణాళికకు ప్రణాళికాసంఘం యిటీవలే తుదిరూప మిచ్చింది దానిని జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది.

విందూరు ఏటి వెల్లువకు కొట్టుకుపోయిన నిరుపేద

గూడూరు అక్టోబరు 25

నెల్లూరుజిల్లా గూడూరు తాలూకా విందూరు ఏరు దాటుతున్న ఒక అరుంధతీయుడు యీనెల 19 న ఏటి వెల్లువకు కొట్టుకొనిపోయి మృతి చెందాడు

విందూరుకండ్రిక గ్రామ కాపరస్తుడైన బోలిపాటి పెంచలయ్య ఏరు దాటి చెన్నూరు గ్రామానికి కూలి కోసం వెళ్ళివస్తూ సాయంత్రం 5 గంటలకు ఏట్లో నగోరు దూరంవచ్చి కొట్టుకొని పోయాడు

మరునాటి ఉదయం 9 గంటలకు 1½ మైలు దూరంలో ఎందూరు రేవు వద్ద శవం కనిపించింది

భార్య, నలుగురు ఆడపిల్లలు యిద్దరు మగ పిల్లలు వున్న యితనికి స్వంత ఆస్తి ఏమీలేని నిరుపేద కూలి

"జీవితమే నిజమైన విద్య"

ప్రధాని వెల్లడి

అజ్మీర్, అక్టోబరు 25

జీవితమే వాస్తవమైన విద్య అని, ప్రపంచమే ఒక బ్రహ్మాండమైన పాఠశాల అని ప్రధాని నిన్న అన్నారు.

మెయో కాలేజీ శతజయంతోత్సవాల సందర్భంగా విద్యార్థుల సభలో ఆమె ప్రసంగిస్తూ డిగ్రీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమే జరుగుతున్నదని, ఆర్జించిన విజ్ఞానాన్ని మిగతా జీవితంలో ఏ ప్రయోజనం కొరకు వినియోగిస్తున్నామన్నదే ముఖ్యమైన విషయమని ఆమె అన్నారు

మంచి తర్ఫీదు మంచి అలవాట్లు ఎప్పటికి కాలం చెల్లినవి కాబోవని కేవలం ఆధిక్యత గాదు కావాల్సింది సామూహిక, అవగాహన అవసరమని ఆమె అన్నారు

ప్రతి విద్యార్థిలోను ఒక ప్రతిభ మరుగున వుంటుంది ఆప్రతిభ బయటపడటానికి మనం అనుమతించాలి అని ఆమె అన్నారు.

తిరుపతి 1 వ డిపో ఆర్. టి. సి. యూనియన్ నూతన కార్యవర్గం

తిరుపతి అక్టోబరు 25

ఎ. పి. ఎస్. ఆర్. టి. సి, ఎంప్లాయీస్ యూనియన్, తిరుపతి ఒకటవ డిపో జనరల్‌బాడీ సమావేశం అక్టోబరు 19 వ తేదీన తిరుపతి మున్సిపల్ గెస్టుహౌస్ ఆవరణలో జరిగింది. కేంద్ర యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, శ్రీ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు అధ్యక్షతవహించారు

సమావేశంలో ఈ క్రిందివారిని నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు

శ్రీ పిన్ ఈశ్వరయ్య డిపో కార్యదర్శి, శ్రీ పి. వెంకట్రామశెట్టి డిపో సహాయ కార్యదర్శి, శ్రీ విఠోభా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ ఎస్ ఆర్ జి, రాజు కోశాధికారి, శ్రీయుతులు బి నాగిరెడ్డి, హెచ్. ఎం డి హనీఫ్ జి ఎస్ రాజు, బి ఎస్ మూర్తి, కె భక్తవత్సలం, పి చిన్నప్ప, ఎం. రామారావు, బి శ్రీనివాసులు, ఎం రాజేంద్రన్‌లు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

డిపోలో కార్మికుల యిబ్బందులను గూర్చి బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ వెంకటశివయ్య వివరించారు. తిరుపతి ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ అడ్‌హాక్ కమిటీ కార్యదర్శి శ్రీ వి మధ్వారావు వందన సమర్పణ చేశారు

(వి. వి.)

మినీ కథల పోటీ

విజయవాడ, అక్టోబర్ 25

యువ సాహితీ సమాఖ్య, విజయవాడ ఆధ్వర్యాన "మినీ కథలపోటీ" నిర్వహింపబడుతోంది

మొదటి మూడు ఉత్తమ కథలకు రు 75 50, 25 నగదు బహుమతులు ఇవ్వబడును

పోటీలో పాల్గొనే రచయితలు, రచయిత్రులు తమ రచనలను నవంబరు 15వ తేదీలోగా శ్రీ సి ఎస్ రామచంద్రరావు, కార్యదర్శి యువ సాహితీ సమాఖ్య, ఈశ్వరం నిలయం, మొగల్రాజపురం విజయవాడ-10 కి స్వంత చిరునామా రు 25 పైసల స్టాంపు గల కవరు జత చేస్తూ వ్రాయలెను

ముఠాలు కట్టవద్దని షాంఘై 'గ్రూపు'కు మావో సలహా?

హాంగ్‌కాంగ్, అక్టోబరు 25

పెకింగ్‌లో ముఠా కట్టవద్దని భార్య చియాంగ్ చింగ్‌కు మావో అవసానకాలంలో పదే పదే హెచ్చరించారట షాంఘై గ్రూప్ వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాల్సిందిగా పార్టీ పొలిట్‌బ్యూరోకు వదలివేశారట !

పీపుల్స్ డైలీ, సిద్ధాంత, పత్రిక రెడ్ ఫ్లాగ్, విముక్తి సైన్యం దినపత్రిక నిన్న సంయుక్తంగా రాసిన సంపాదకీయంలో పై విషయం పేర్కొన బడింది హువా కో ఫెంగ్ విజయాన్ని, షాంఘై ముఠా పతనాన్ని హర్షిస్తూ సంపాదకీయం రాశారు

పార్టీ ఛైర్మన్‌గా హువా ఎన్నికయిన అక్టోబరు 7 న అరెస్టయిన నలుగురు రాడికల్స్ ఏమయ్యారో తెలియదు కానీ వారికి మళ్ళీ సరైన సిద్ధాంత బోధన తీవ్రంగా జరుగుతుందని సంపాదకీయం సూచనప్రాయంగా తెలిపింది

'నలుగురి గ్యాంగ్ అప్రతిష్ఠాకరంగా అంతమయింది' అనిచెప్పినటు సంపాదకీయం మావో సూక్తిని ఇలా ఉటంకించింది. "(మనం) భవిష్యత్ పొరపాట్లను నివారించేందుకు, పాత పొరపాట్లనుండి గుణపాఠం నేర్చుకోవాలి రోగిని రక్షించడానికి వ్యాధినయం చేయాలి మందికి విద్యగరపి సాయపడాలి దాడి లక్ష్యాన్ని తగ్గించాలి"

జనవరిలో ప్రధాని చౌఎన్‌లై మరణించిన తర్వాత ప్రధాని పదవికి, పార్టీ ప్రథమ ఉపాధ్యక్ష పదవులకు హువాకో ఫెంగ్‌ను నియమించాలని మావో ప్రతిపాదించినట్లు రాసింది "నువ్వు బాధ్యత తీసుకున్నావు నాకు తృప్తి కలిగింది" అని మావో హువాతో ఏప్రిల్ 29 న రాశారని పేర్కొంది నలుగురు రాడికల్స్ పార్టీని చీల్చేందుకు ముఠా కార్యకలాపాలు సాగిస్తున్నట్టు మావోకు తెలుసునని రాసింది.

1974 జులై 17న తనభార్య యితరరాడికల్స్‌తో మావో ఇలా అన్నారట '[illegible] తీసుకోవాలి. నలుగురు వ్యక్తులతో చిన్న ముఠా కట్టకండి" మళ్ళీ అదే సంవత్సరం క్రిస్మస్ దినాన "ముఠా పెట్టకండి. అలా పెట్టినవాళ్లు పతనమవుతారు"

చూ మూ-చీ పునః ప్రత్యక్షం

చైనాలో గత ఏప్రిల్ రాజకీయకల్లోలంలో అంతర్థానమైన ప్రముఖులు మళ్ళీ కొద్ది రోజులుగా పెకింగ్ వీధుల్లో ప్రదర్శనల మధ్య ప్రత్యక్షమయ్యారు

ఒయినచూ మూ-చీ చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అధికార పత్రికా సంస్థ డైరెక్టర్ తిన్ అమిన్ స్క్వేర్‌లో ఆనాడు జరిగిన ఉత్సవంలో ప్రదర్శన అగ్రభాగాన ఆయన నడిచారు

టెంగసియావోపింగ్‌ను ప్రధాని పదవి నుండి తొలగించినప్పుడు చూమూ-చీ కూడా కనిపించకుండాపోయారు ఈయన మాదిరిగానే పునరాగమనం కల్పించబడినవ్యక్తి రైల్వేమంత్రి వాన్‌లీ అని పరిశీలకుల అంచనా.

తమిళనాడులో 20 అంశాల కార్యక్రమ ప్రచారోద్యమం

మధురై, అక్టోబరు 25

తమిళనాడులోని 4 దక్షిణ జిల్లాలలో కాంగ్రెసుపార్టీ కార్యకలాపాలను, ఇరవై అంశాల కార్యక్రమ ప్రచారోద్యమానికి ఎ. ఐ. సి. సి కేంద్ర ప్రచారోద్యమ కమిటీ కార్యదర్శి శ్రీ యశ్‌పాల్ కపూర్ నిన్న యిక్కడ ప్రారంభోత్సవం చేశారు,

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ పరిపాలన, ఆర్థికాభివృద్ధి విషయాలలో ఈ రాష్ట్రాన్ని అగ్రశ్రేణిలోవుంచడం ప్రజల, ప్రత్యేకించి కాంగ్రెసువాదుల బాధ్యత అని పేర్కొన్నారు

రాష్ట్ర ప్రచారోద్యమ కమిటీ కన్వీనరు శ్రీ ఎ. పి. సి. వీరబాహు సభకు అధ్యక్షత వహిస్తూ, కాంగ్రెసు వాదులు 20 అంశాల కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు.

మాజీ ముఖ్యమంత్రి శ్రీ యం. భక్తవత్సలంకూడా మాట్లాడారు

'క్రమశిక్షణ తెచ్చిన అత్యయిక స్థితి'

— త్యాగి

జలంధర్ అక్టోబరు 25

దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన క్రమశిక్షణ తెచ్చినమాటనిజమేనని జనసంఘ్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శ్రీ ఓం ప్రకాశ్ త్యాగి (ఎం పి) నిన్న అన్నారు

కొన్ని రంగాలలో పురోగతి సాధింపబడిన విషయంకూడా వాస్తవమేనని అయితే బయటినుంచి వత్తిడితో కాక స్వతస్సిద్ధక్రమశిక్షణ వుండాలని ఆయన అన్నారు వత్తిడి ద్వారా వచ్చిన క్రమశిక్షణ దీర్ఘకాలం మనజాలదన్నారు

ఎన్నికలపై అమెరికా ప్రజల అనాసక్తి

ప్రచారం ఎత్తుగడలు మార్చాలని ఫోర్డ్, కార్టర్

న్యూయార్క్, అక్టోబరు 24

అభ్యర్థుల ఎంపిక, అధ్యక్ష పదవికై పోటీ గురించి నెలల తరబడి కోట్లాది డాలర్ల ఖర్చుతో భారీ ప్రచారం సాగించిన తర్వాత ఎన్నిక ఇంకా 9 రోజులే వున్నప్పటికీ అమెరికా ఓటర్లలో ఎలాంటి ఉత్సాహం, ఆసక్తి కనిపించడం లేదు.

ప్రారంభ దశలో ప్రచారమంతా వ్యక్తుల పైనే కేంద్రీకరించడంవల్ల ఇలా జరిగిందని, ఇది పొరపాటని ఫోర్డ్, కార్టర్‌లు యిద్దరూ నిన్న విశ్లేషించారు

ఎన్నికలపై ప్రజల అనాసక్తిని పోగొట్టాలంటే ఈ కొద్ది రోజులలోనయినా దేశ సమస్యలపై ఎన్నికలప్రచారం కేంద్రీకరింపచేయటం ఒకటే మార్గమని వారిద్దరూ అభిప్రాయపడ్డారు

ప్రచారం చివరి దశలో ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రిపబ్లికన్ డెమొక్రాటిక్ అభ్యర్థులిద్దరి మధ్య తీవ్ర ఘర్షణ సాగుతోంది ఫోర్డ్, కార్టర్‌లు మూడవ (తుది) బహిరంగ చర్చలో నిన్న ఉభయం పాల్గొన్నారు.

రెండేళ్ళుగా తాను అధ్యక్ష పదవిలో వుండి ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, అధిక ధరలను తగ్గించానని ఫోర్డ్ చెప్పగా అలా చెప్పడానికి కొంత సిగ్గూ, శరం ఉండాలి అని కార్టర్ తిప్పికొట్టారు

అమెరికాలో ఇప్పుడు 70 లక్షల మంది నిరుద్యోగులున్నారు. ఫోర్డ్ పాలనా సాగిన రెండేళ్ళలో 25 లక్షల మంది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయారు ఈ నిరుద్యోగం నల్లవారు ఇతర మైనారిటీలలో 30 నుండి 40 శాతం వరకు ఉందని కార్టర్ అన్నారు

అమెరికా భద్రతకు ముప్పు వస్తేతప్ప విదేశీ యుద్ధాల్లో అమెరికాను దించబోనని కార్టర్ చెప్పగా తానుచేయబోయేది ఏమిటో ముందేచెప్పటం అభ్యర్థి అవివేకమవుతుందని ఫోర్డ్ అన్నారు.

800 రోజులుగా అధికారంలో వున్న ఫోర్డ్ అమెరికా ప్రజలకు చేసిందేమిటని కార్టర్ ప్రశ్నించారు.

తమిళనాడులో సినిమాథియేటర్లపై దాడులు

మద్రాసు, అక్టోబరు 24

అనేక సినిమాథియేటర్లలో నకిలీ టిక్కెట్లు ఒకే నంబరుగల టిక్కెట్లను తమిళనాడు ఇంటలిజెన్సు శాఖ కనుగొన్నది.

ఫలితంగా రు. 2,05,494 పన్ను రూపంలోను రు 1,30,026 లు జరిమాన రూపంలోను రు. 500 అదనపు పన్ను రూపంలోను వసూలు చేసినట్లు అధికార ప్రకటనలో తెలిపారు.

సెప్టెంబరు మాసంలో 8272 థియేటర్లపై దర్యాప్తు జరిపి 398 కేసులను నమోదు చేశారు.

షెడ్యూల్డు కులాలలో హరిజనక్రిష్టియన్లచేర్పుకై విజ్ఞప్తి

తిరుచురాపల్లి, అక్టోబరు 25

షెడ్యూల్డు కులాలలో హరిజనక్రిష్టియన్లను చేర్చి, సామాజికార్థిక అభ్యున్నతికి సంబంధించిన అన్ని విషయాలలో హిందూ హరిజనులతో సమానంగా అన్ని రాజ్యాంగపరమైన హామీలను, సమానావకాశాలను వారికి విస్తరింపచేయవలసిందిగా అఖిల భారత షెడ్యూల్డు కులాల క్రిస్టియన్ మహాసభ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది

20 అంశాల కార్యక్రమం ఫలితాలు సమాజంలోని బలహీన వర్గాలకు చేరునట్లు చూడవలసిందిగా మహాసభ మరోతీర్మానంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది

సెకండ్లలో కంటి పొర వున్నవారికి కంటి చూపు

న్యూఢిల్లీ అక్టోబరు 24

దేశవ్యాప్తంగా వేలకు వేలుగా కంటి పొరలున్నవారు ప్రస్తుత సెకండ్లలో మామూలుగా చూడవచ్చు కంటి పొరలను తొలగించే నూతన సాధనాన్ని రూపొందించడం వల్ల యీ సౌకర్యం కలిగింది నూతన సాధనం పేరు 'క్రియో ప్రోబ్సు' ఇక్కడ జాతీయ ఫిజికల్ లాబొరేటరీ వారు దీన్ని రూపొందించారు

దేశంలోని 10 లక్షల మంది కంటిపొర వ్యాధి కలిగినవారు త్వరలో చూపు పొందవచ్చునని దీనివల్ల సులభంగా ఆపరేషన్ చెయ్యవచ్చునని యీ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి. జి. భిడే చెప్పారు.

నిర్ణయాత్మక దశలో జింబాబ్వే, నాంబియా విముక్తి పోరాటాలు

కెన్నెత్ కౌండా ఉద్ఘాటన

లుసాకా, అక్టోబరు 24

జింబాబ్వే (రొడీషియా) నాంబియాలలో విముక్తి పోరాటాలు నిర్ణయాత్మక, సానుకూల దశలో ప్రవేశించాయని జాంబియా అధ్యక్షులు కెనెత్ కౌండా అన్నారు

గత రాత్రి రేడియోలో స్వాతంత్ర్య దినోత్సవ సందేశమిస్తూ ఆయన పై విధంగా ప్రకటించారు నాంబియా పోరాటానికి తమ సంపూర్ణ తోడ్పాటు యధావిధిగా కొనసాగుతుందని స్పష్టీకరించారు

జాంబియన్లు, అంగోలా, మొజాంబిక్, నాంబియా, జింబాబ్వే విముక్తి పోరాటాలకు సదా తోడ్పాటు ప్రకటించారన్నారు.

ఆఫ్రికా జాతీయ నాయకుల ప్రకటన

జెనీవా, అక్టోబరు 24

జెనీవా చర్చల్లో స్వాతంత్ర్య ప్రకటనకు అంగీకారం కుదిరేదాకా సాయుధపోరాటం కొనసాగి తీరుతుందని రొడీషియా జాతీయ నాయకులు నేడిక్కడ ప్రకటించారు

రొడీషియాలో గెరిల్లా యుద్ధానికి దారి తీసిన కారణాలను తొలగించేదాకా సాయుధ పోరాటం కొనసాగడమె గాక ఉధృతం కూడా అయి తీరుతుందని జింబాబ్వే ఆఫ్రికన్ పీపుల్స్ యూనియన్ నాయకులు జాసువా కోమో నేడిక్కడ విమానాశ్రయంలో దిగగానే స్పష్టీకరించారు

జెనీవా చర్చలకు తాను శాంతియుతంగా పరిష్కారం కోసం రాలేదని పదేళ్ళనుంచి పోరాటం కొనసాగుతున్న సమస్యకు శాంతియుత పరిష్కారం ప్రస్తావనే వుండబోదని ఆయన హెచ్చరించారు

రాబర్టు ముగాబే ప్రకటన

సంపూర్ణంగా అధికారం సాధించే దాకా సాయుధ పోరాటం కొనసాగుతుందని జింబాబ్వే ఆఫ్రికన్ నేషనల్ యూనియన్ నాయకులు రాబర్ట్ ముగాబే స్పష్టీకరించారు రొడీషియాలో మైనారిటీపాలనకొనసాగింపుకు అమెరికా విదేశాంగ మంత్రి కిసింగర్ పథకాన్ని ఆయన తిరస్కరించారు

కొన్ని మాసాల్లోనే జింబాబ్వేకు స్వాతంత్ర్యం ప్రకటించ వలసిందిగా ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

బహిష్కృత ఎ.డి.ఎం.కె. నాయకులు ఢిల్లీ పయనం

మద్రాసు, అక్టోబరు 24

ఇటీవల అన్నా డి యం కె పార్టీ నుంచి బహిష్కరింపబడిన నాయకులు ప్రధాని శ్రీమతి గాంధీతో చర్చించేందుకు ఢిల్లీ వెళ్ళనున్నారు

పార్లమెంటు సమావేశానికి హాజరయ్యేందుకు తాను నేడు ఢిల్లీకి వెడుతున్నానని అలాగే ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీని కలిసి చర్చిస్తానని ఎ డి యం కె నుండి బహిష్కరింపబడిన పార్లమెంటుసభ్యులు శ్రీ జి విశ్వనాథన్ నేడిక్కడ వెల్లడించారు ఆయనతోపాటు శ్రీయుతులు కోళై చెజియన్ (మాజీ యం. యల్ ఏ) పి శ్రీనివాసన్ (తమిళనాడు శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్) లను అన్నా డి యం కె ప్రాథమిక సభ్యత్వం నుంచి ఇటీవల తొలగించారు

తమతో మరికొంతమంది చేరడానికి సిద్ధంగా వున్నట్లు తాము ఇటీవల కొన్ని జిల్లాల్లో జరిపిన పర్యటనవల్లతెలియ వచ్చిందని శ్రీ విశ్వనాథన్ అన్నారు.

పార్టీ ప్రధాన కార్యదర్శి యం జి రామచంద్రన్ ఎ డి ఎం కె ను అలిండియా ఎ డి ఎం కె గా మార్చడానికి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు కాబట్టి తాము ఎ డి ఎం కె సభ్యులుగానే కొనసాగుతామని శ్రీ విశ్వనాధన్ అన్నారు

తమ పార్టీ అఫీసు బేరర్ల పేర్లను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు

సహకార పంచదార ఫ్యాక్టరీలో బాయిలర్ల యూనిట్ ప్రారంభం

భీమ్‌సింగిలో

విశాఖపట్నం, అక్టోబర్ 24

ఇక్కడి నుండి 40 కిలోమీటర్ల దూరంలో వున్న భీమసింగిలో రు 4 5 కోట్లఖర్చుతోనిర్మించిన సహకార పంచదార ఫ్యాక్టరీలో నేడు 6 బాయిలర్ల యూనిట్ ప్రారంభం కావడం వల్ల ఈ ఫ్యాక్టరీ క్రషింగ్‌కు సంసిద్ధమైంది

ఈ సందర్భంగా జరిగిన ఉత్సవలోం ఫ్యాక్టరీ ఉపాధ్యక్షుడు శ్రీ పి యల్ యన్ రాజు (యం యల్ సి) ఈ బాయిలర్ యూనిట్లను ప్రారంభించారు

రోజూ 1250 టన్నుల ఉత్పాదకశక్తి గల యూనిట్ విజయరామ గజపతి సహకార వ్యవసాయ, పారిశ్రామిక ఫ్యాక్టరీ 'ని పూర్తిగా, పభుత్వరంగ సంస్థ అయిన ఇంజనీర్ ప్రాజెక్ట్సు ఇండియా లిమిటెడ్ రూపొందించింది

ఈ సహకార పంచదార ఫ్యాక్టరీ విశాఖపట్నం జిల్లాలోనే పెద్దది ఈ ఏడాది డిసెంబరు మొదటివారంలో ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ఈ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం చేస్తారని ఫ్యాక్టరీ డైరెక్టర్ వెల్లడించారు

అక్టోబర్ 26 వ తేదీ కార్యక్రమం

విద్యార్థి నాయకుల ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 24

సాంఘిక సంక్షేమ హైస్కూల్ విద్యార్థులకు చెల్లిస్తున్న ప్రస్తుతబోర్డింగ్ గ్రాంటు రు 40 నుండి 80 కి హెచ్చింపు చేయాలని కోరుతూ అక్టోబరు 26 వ తేదీన వూరేగింపులు, సమావేశాలు జరపాలని, జిల్లా, తాలూకా కేంద్రాలలో విజ్ఞప్తి పత్రాలు సమర్పించాలని రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ శ్రీనివాసులునాయుడు శ్రీ వి రామనర్సింహారావు నేడొక ప్రకటనలో విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు

కొత్తగూడెంలో పేపరు ఉత్పత్తికి అనుమతి

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్ అక్టోబర్ 24

ఖమ్మంజిల్లా, కొత్తగూడెంలో 8 వేల టన్నుల వార్షిక ఉత్పాదకశక్తితో రాపింగ్, ప్యాకింగ్, వ్రాత, ప్రచురణకు పనికివచ్చే కాగితాన్ని ఉత్పత్తి చేయడానికి పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరుకు చెందిన శ్రీ వట్టి తుమ్మయ్యకు కేంద్ర ప్రభుత్వం అనుమతి పత్రాలను యిచ్చింది

ఈ పరిశ్రమవల్ల అన్ని తరగతులలో దాదాపు 514 మందికి ఉపాధి సౌకర్యం కలుగుతుందని భావించబడుతోంది.

ప్రప్రథమ మహిళా కమాండర్

న్యూఢిల్లీ, అక్టోబరు 24

డాక్టర్ శ్రీమతి బార్బారాఘోష్‌ను భారత నౌకాదళంలో కమాండర్‌గా నియమించారు ఒక మహిళకు నౌకాదళంలో ఈ హోదా ఇవ్వడం ఇదే మొదలు

ఆమె పెడియాట్రిక్స్ శాఖలో గత 16 ఏండ్లుగా సేవచేస్తున్నారు

గుండెపోటు పసికట్టే కాయితం

న్యూఢిల్లీ, అక్టోబరు 24

గుండెపోటుతో బాధపడే రోగి మూత్రంలో ముంచితే రంగుమారే కాయితాన్ని స్వీడిష్ శాస్త్రజ్ఞులు రూపొందించారు

ఇది చాలా సులభమైన,ప్రయోజనకరమైన పద్ధతి గుండెపోటు ప్రమాణాన్ని,తీవ్రతనుకూడాకనిపెట్టేవిధంగా దీన్నిప్పుడు రూపొందిస్తున్నారు

మానవుడి కండరాల్లోని మయోగ్లోబిన్‌వల్ల కాయితం రంగు మారుతుంది ముఖ్యంగా గుండె కండరాలు దెబ్బతింటే మయోగ్లోబిన్ వెలుపడి రక్తంద్వారా మూత్రం నుండి పోతుంది స్వీడిష్ యూనివర్శిటీ ఈ కాయితాన్ని రూపొందించింది.

సిక్కిం మాజీ రాజుకు పూర్తి స్వస్థత

కలకత్తా, అక్టోబరు 24

నిద్రమాత్రలు అమితంగా సేవించిన కారణంగా కలకత్తాలోని ఒక నర్సింగ్‌హోమ్‌లో చేర్చబడి చికిత్సపొందుతున్న సిక్కిం మాజీ రాజు పాల్డెన్‌తోండప్ నంగ్యాల్ ప్రమాదస్థితి నుంచి బయటపడ్డారని కులాసాగా, పూర్తి స్వాకరస్థితిలో వున్నారని ఆయనకు చికిత్స చేస్తున్న కర్నల్ కల్వార్ నేటి ఉదయం సమాచార్‌కు తెలియ చెశాడు నిన్న ఆయన తమ గదిలో పచార్లు చేశారని సంపూర్ణ అహారం తీసుకున్నారని వైద్యుడు తెలిపాడు

కేరళలో గృహవసతి పథకం

కొట్టాయం, అక్టోబర్ 24

ప్రతి పంచాయతీలో 100 ఇళ్ళను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పథకం వల్ల నిరుపేదవర్గాలకు అత్యంతావశ్యకమైన గృహవసతి కలుగుతుందని కేరళ గవర్నర్ శ్రీ యన్ యన్ వాంఛూ నేడిక్కడ పేర్కొన్నారు

ఎలికులం పంచాయతీ 101 ఇళ్ళను నిర్మించడం పూర్తయిన సందర్భంగా జరిగిన ఉత్సవంలో ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రభుత్వ సహాయం, ప్రజలు పాల్గొనడం అన్న ప్రాతిపదికపై 1 లక్ష గృహాల నిర్మాణ పథకం గణనీయంగా విజయవంతమైందని ఆయన అన్నారు.

రు. 241 వేలతో కొండపల్లి కోట అభివృద్ధి

[విశాలాంధ్ర విలేకరి]

విజయవాడ, అక్టోబరు 24

కొండపల్లి కోటను రు 241 వేలతో దశల వారిగా అభివృద్ధి చేయటానికి నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాఖమంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి నేడు యిక్కడ పత్రికా గోష్ఠిలో ప్రకటించారు.

రాణీమహల్, దర్బార్ హాల్‌లకు కొన్ని మరమ్మత్తులు చేయించటానికి యీ సంవత్సరం రు 50 వేలు మంజూరు చేసినట్లు వెల్లడించారు

కొండపై మంచినీటి సౌకర్యాన్ని త్వరలో కల్పించనున్నట్లు తెలిపారు

కొండపల్లి కోటను మంచి టూరిస్టు కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు ఐదు సంవత్సరాలలో ఘాట్ రోడ్ అభివృద్ధి, కొండపైన విద్యుదీకరణ, టూరిస్టులకు రెస్టుహౌస్ ఏర్పాటు అభివృద్ధిపథకంలో భాగాలన్నారు

బొగ్గుగనినుండి మరో రెండు మృతదేహాలు వెలికితీత

హజారీబాగ్, అక్టోబరు 24

గతనెల 16 న వరద నీటివల్ల హతిదారి బొగ్గుగనిలో చిక్కుకుపోయిన గని కార్మికుల్లో మరో ఇద్దరు కార్మికుల మృతదేహాలను సహాయక బృందం నిన్న వెలికితీసినట్లు అధికారవర్గాలద్వారా తెలుస్తున్నది.

గుంటూరులో ఇళ్ళస్థలాలకు మెమొరాండం

గుంటూరు, అక్టోబరు 24

పట్టణ ఆస్తుల గరిష్ట పరిమితి చట్టం అమలు జరుగుట వలన లభించే మిగులు భూములలో తమకు నివేశన స్థలాలు యివ్వాలని, పాత గుంటూరు 19 వ వార్డుకు చెందిన 250 మంది పేద కుటుంబాల వారు ఇటీవల శాసనసభ ప్రతిపక్ష నాయకులు, శ్రీ వేములపల్లి శ్రీకృష్ణకు మెమొరాండం సమర్పించారు (వి వి)

వివిధ హైకోర్టుల్లో 5 లక్షలకు చేరిన అపరిష్కృత వివాదాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 25

ఈ ఏడాది జూన్ అంతానికి దేశంలోని 18 హైకోర్టులముందు సివిల్, క్రిమినల్‌కు చెందిన దాదాపు 5 లక్షల కేసులు అపరిష్కృతంగా వున్నాయి

అలహాబాద్ హైకోర్టు ముందు గరిష్ట స్థాయిలో 91,386 సివిల్ కేసులు, 21,494 క్రిమినల్ కేసులు అపరిష్కృతంగా వున్నట్లు నేడు లభ్యమైన సంఖ్య వల్ల తెలుస్తున్నది

కలకత్తా హైకోర్టులో 70,254 సివిల్, 4790 క్రిమినల్ కేసులు, మద్రాసు హైకోర్టులో 38 731 సివిల్, 2396 క్రిమినల్ కేసులు అపరిష్కృతంగా వున్నాయి

సిక్కిం హైకోర్టులో కనిష్టస్థాయిలో 20 సివిల్, 5 క్రిమినల్ కేసులు అపరిష్కృతంగా వున్నాయి

1976 జూన్ 30 నాటికి వివిధ హైకోర్టులలో అపరిష్కృతంగా వున్న సివిల్, క్రిమినల్ కేసులు ఈ క్రింది విధంగా వున్నాయి

ఆంధ్రప్రదేశ్ 18405-1462 బొంబాయి 30,983 - 4431, ఢిల్లీ 22003- 1361, గౌహతి 5167-1805, గుజరాత్ 11,620-1558, హిమాచల్ ప్రదేశ్ 3981-745, జమ్ము-కాశ్మీర్ 2725-701, కర్నాటక 19,296-522, కేరళ 20 877-579, మధ్య ప్రదేశ్ 21,130-9250, ఒరిస్సా 5386-976, పాట్నా 18629-7398, పంజాబ్, హర్యానా 30,228-6909 రాజస్థాన్ 11,487-3784

1975 డిసెంబర్ 31 నాటికి సుప్రీం కోర్టులో 10,937 సివిల్, 1594 క్రిమినల్ కేసులు, ఆర్టికల్ 32 క్రింద 1057 రిట్ పిటిషన్లు అపరిష్కృతంగా వున్నాయి

సుప్రీంకోర్టు, హైకోర్టులలో కేసులు ఈ విధంగా పెరిగిపోతున్న విషయం కొంత కాలం క్రితం కేంద్ర ప్రభుత్వ దృష్టికి వచ్చింది

1969 చివరి నాటికి భారతప్రధాన న్యాయమూర్తి సహకారంతో కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసింది హైకోర్టుల్లో కేసులను సత్వరం పరిష్కరించడానికి గల అవకాశాలను అధ్యయనంచేసి చర్యలనుసూచించడానికి ఆ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది ఈ కమిటీ 1972 లో తన నివేదికను సమర్పించింది

హైకోర్టుల్లో కేసులు పేరుకుపోవడానికి గల కారణాలను ఈ కమిటీ పేర్కొంది వాటిని తగ్గించి వేయడానికి వీలుగా అనేక చర్యలను సూచించింది

రాజ్యాంగ సవరణల పరిశీలన వాయిదాకు విజ్ఞప్తి

బొంబాయి, అక్టోబరు 24

రాజ్యాంగ సవరణలను పరిశీలించడాన్ని వాయిదా వేయవలసిందిగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖ న్యాయమూర్తులు, విద్యావేత్తలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు

"సిటిజన్‌ఫర్ డెమొక్రసీ" నేడు ఆ ప్రకటనను విడుదల చేసింది

44 వ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలించడానికి లోక్‌సభ సమావేశమౌతున్న సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేయబడింది

లోక్‌సభకు ఎన్నికలు జరిగే దాకా ఈ రాజ్యాంగ సవరణలను వాయిదా వేయాలని శ్రీయుతులు యం సి చాగ్లా, జె సి షా, వి. మాతర్‌కుండే, వి పి అదార్ కర్, ఆలూ దస్తూర్, ఎస్, ఎం జోషి, ఎన్ జి గోరే (సోషలిస్టు) ఉత్తమ రావ్ పాటిల్ (జన సంఘ్), ప్రాణ్‌లాల్‌ఓరా (సిండికేట్), యస్ వై. కొల్హాట్కర్ (మార్కిస్టు) డి బి పాటిల్(పి డబ్ల్యు పి) వై బి అంద్కర్ (రిపబ్లికన్), గోవింద రావ్‌షిండే (సర్వోదయ) తదితరులు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు

తమిళనాడు బార్ కౌన్సిల్ సూచనలు

రాజ్యాంగ సవరణలపై

మద్రాసు, అక్టోబరు 24

ఆదేశక సూత్రాల అమలుకు అవకాశం కల్పించే చట్టాలను కోర్టులలో సవాలు చేయకుండా వాటి రక్షణకు వీలు కల్పించే ప్రతిపాదించబడిన సవరణను వదలి వేయవలసిందిగా తమిళనాడు బార్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది

ఓటు హక్కు వినియోగించుకోవడంలో విఫలమైన వారిని శిక్షించేందుకు వీలు కల్పించే ఒక క్లాజును పౌరుల ప్రాథమిక విధుల్లో చేర్చవలసిందిగాకౌన్సిల్ ఒక తీర్మానంలో సూచించింది

ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణలను కొత్తగా ఎన్నికైన పార్లమెంటు మాత్రమే పరిశీలించాలని కౌన్సిల్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది

44 రాజ్యాంగ సవరణపైఏర్పాటు చేసిన తన కమిటీ అభిప్రాయాలను కౌన్సిల్ చర్చించి కొన్ని తీర్మానాలను ఆమోదించింది

విద్యను రాష్ట్ర జాబితాలో వుంచాలని, అన్ని అంతర్ రాష్ట్ర నదులకు సంబంధించిన విషయాలను కేంద్ర జాబితాలో చేర్చాలని అది కోరింది

4 పార్టీలచే సమావేశం బహిష్కరణ

జలంధర్, అక్టోబర్ 24

44 వ రాజ్యాంగ సవరణ పరిశీలనకు సంబంధించి రేపటి నుండి ప్రారంభమయ్యే పార్లమెంటు కార్యక్రమంలో 4 పార్టీలు జనసంఘ్ సోషలిస్టు, భారతీయ లోక్‌దళ్, సిండికేట్‌లు పాల్గొనబోవని పార్లమెంట్ సభ్యుడు జనసంఘ్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శ్రీ ఓ పి త్యాగి వెల్లడించారు

ఈ సవరణను పరిశీలించడానికి ప్రస్తుత పార్లమెంటుకుగల అధికారాన్ని ప్రస్తావిస్తూ, ప్రాథమిక హక్కుల సవరణ పార్లమెంటు పరిధికి మించింది కాబట్టి ఇందుకోసం రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటు చేయాలని శ్రీ త్యాగి చెప్పున్నారు

అంజాద్ ఖాన్ పరిస్థితి మెరుగు

బొంబాయి, అక్టోబరు 24

గత సోమవారం కారు ప్రమాదంలో గాయపడిన సినిమా నటుడు అంజాద్ ఖాన్ పరిస్థితి మెరుగ్గా వుంది ఈయనను గోవా ఆసుపత్రినుంచి బొంబాయి ఆసుపత్రికి తరలించారు

నవంబర్ 19 నుండి కాంగ్రెసుచే ప్రజా సమీకరణవారోత్సవం

మదురై, అక్టోబరు 25

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా నవంబర్ 19 నుండి 'ప్రజా సమీకరణ వారోత్సవం" జరుపుతారని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ కేంద్ర ప్రచార విభాగంకార్యదర్శి శ్రీ యశ పాల్‌కపూర్ చెప్పారు.

ఈ వారోత్సవం సందర్భంగా ప్రధాని శ్రీమతి గాంధీ అధికారంలోకి వచ్చిన అనంతరం సాధించిన విజయాలను,కాంగ్రెస్ విధానాలనుప్రచారంచేయడం జరుగుతుందని, అత్యవసర పరిస్థితి ప్రకటించిన అనంతరం ఈ సంవత్సర కాలంలో సాధించిన విజయాలను వివరించే కరపత్రాలు ప్రచురించాలని కేంద్ర ప్రచారవిభాగం తలపెట్టిందని ఆయన చెప్పారు

కాంగ్రెసు ప్రచార కమిటీల కార్యకలాపాలను ఉధృతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా పార్టీ కమిటీలకు సాహిత్యాన్ని పంపుతున్నట్లు ఆయన చెప్పారు

క్రీడారంగం

రెండవ ఇన్నింగ్స్‌లో కేరళ జట్టుచే 113 పరుగులు

వరంగల్, అక్టోబరు 24

హైదరాబాద్, కేరళజట్ల మధ్య నిన్న యిక్కడ ప్రారంభమైన రంజీట్రోఫీ క్రికెట్ పోటీలో నేడు రెండవ రోజున కేరళజట్టు తన రెండవ ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 113 పరుగులు సాధించింది

మొదటి ఇన్నింగ్స్‌లో 137 పరుగులు చేసింది

హైదరాబాదు జట్టుకు చెందిన బౌలర్ యం వి నరసింహారావు అద్భుతంగా బౌల్ చేసి 45 పరుగులకు 4 వికెట్లు తీసుకున్నారు.

కేరళ మొదటి ఇన్నింగ్స్ లంచ్ విరామ సమయం అనంతరం 40 నిమిషాలకే ముగిసింది

నిన్న మొదటి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 315 పరుగులు సాధించి డిక్లేర్ చేసిన హైదరాబాదు జట్టు చేతిలో ఓడిపోకుండా నిలబడాలంటే రెండు వికెట్లతో మాత్రమే మిగిలివున్న కేరళ జట్టు యింకా 65 పరుగులు చేయాల్సి వుంది

పాక్ జట్టుచే 383 పరుగులు

హైదరాబాద్, (సింద్), అక్టోబర్ 24

పాకిస్తాన్-న్యూజిలాండ్‌లమధ్య యిక్కడ జరుగుతున్న రెండవ క్రికెట్ టెస్టు పోటీలో నేడు రెండవరోజు లంచ్ విరామ సమయానికి పాకిస్తాన్‌జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 3వికెట్ల నష్టానికి 383 పరుగులు చేసింది

కర్నాటక జట్టుచే 355-7 పరుగులు

హుబ్లీ, అక్టోబరు 24

ఆంధ్ర-కర్నాటక జట్ల మధ్య యిక్కడ జరుగుతున్న 3 రోజుల రంజీట్రోఫీ క్రికెట్ పోటీలో నేడు రెండవరోజున కర్నాటక జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా జట్టుపై 118 పరుగుల ఆధిక్యతతో వుంది

యస్ యం హెచ్ కిర్మాణి అద్భుతంగా ఆడి 86 పరుగులు చేశారు ఆట ముగిసే సమయానికి కర్నాటక జట్టు 7 వికెట్ల నష్టానికి 355 పరుగులు చేసింది.

అంతకు ముందు నిన్న ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసిన ఆంధ్రజట్టు నేడు తన ఆటను కొనసాగించి 38 పరుగులు చేసి తన ఇన్నింగ్స్‌ను పూర్తి చేసింది

కర్నాటక జట్టు ఆట ప్రారంభించిన మొదటి ఓవర్‌లోనే ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ సంజయ్‌దేశాయ్ ఔటయినప్పటికీబోనస్ పాయింట్‌ను పొందడానికి త్వర త్వరగా పరుగులు సాధించటానికి ప్రయత్నించింది

కర్నాటక జట్టు 200 నిమిషాలలో 55 ఓవర్లలో, 4 వికెట్లను కోల్పోయి, 213 పరుగులు చేసిన ఆంధ్రా జట్టును అధిగమించింది

జూనియర్ బాల్ బ్యాడ్‌మింటన్ నేషనల్స్

వచ్చే డిసెంబర్ చివరి వారంలో ఇక్కడి మున్సిపల్‌స్టేడియంలోజూనియర్‌బాల్ బ్యాడ్‌మింటన్ నేషనల్స్‌ను నిర్వహించడానికి గాను కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్‌మింటన్ అసోసియేషన్‌కు పూర్తి తోడ్పాటివ్వాలని జిల్లా క్రీడా మండలి నిర్ణయించింది

వచ్చే నవంబర్ రెండవ వారంలో పంజాబ్‌లో జరిగే అఖిల భారత రూరల్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొనడానికి ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బాస్కెట్‌బాల్ టీముకు ఈ క్రింది బాలికలను ఎంపిక చేశారు

నాగలక్ష్మి (కెప్టెన్), జ్యోతి (వైస్ కెప్టెన్) వేణి సత్యలక్ష్మి, ఉమావేణి మల్లీశ్వరి- వీరంతా కృష్ణాజిల్లాకు చెందినవారు ప్రసూనా, ఎ సుబ్బలక్ష్మి (ప్రకాశంజిల్లా), షీలా, గ్లోరి (తూర్పు గోదావరిజిల్లా), సుగుణ (ఖమ్మంజిల్లా), శశి, రాణి (అనంతపూర్ జిల్లా)

కబాడీ ఛాంపియన్ షిప్పులు

పురుషులు, మహిళలు, బాలురు, బాలికలకు సంబంధించి ప్రకాశంజిల్లా కబాడీ ఛాంపియన్‌షిప్, జిల్లా టీముల సెలక్షన్లు ఈనెల 29, 30, 31 తేదీల్లో మద్దిపాడులో జరుగుతాయి

ఎన్నికయిన టీములు వచ్చేనెల 12, 13,14 తేదీలలో కందుకూరులో జరిగే స్టేట్ ఛాంపియన్‌షిప్ స్టేట్ సెలక్షన్లలో పాల్గొంటాయి

ఈనెల 27న తిరుపతిలో వాలీబాల్ టీమ్ సెలక్షన్ ట్రైల్స్

గుంటూరు అక్టోబరు 24

ఈనెల 27 న తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో ఆంధ్రా జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ వాలీబాల్ టీమ్ సెలక్షన్ ట్రైల్స్ నిర్వహించబడతాయి

గుంటూరుజిల్లా జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ టీము సెలక్షన్ ట్రైల్స్ నేడు యిక్కడి బి. ఆర్. స్టేడియంలో నిర్వహింపబడ్డాయి

తిరుపతిలో జరిగే ఆంధ్రా జూనియర్ టీమ్సు సెలక్షన్ ట్రైల్స్‌లో పాల్గొనేందుకు ఎన్నికయే ఆటగాళ్ళను పంపుతారు

విజయవాడలో

విజయవాడ, అక్టోబరు 21

నేడిక్కడి మున్సిపల్ స్టేడియంలో కృష్ణాజిల్లా "జూనియర్ వాలీబాల్ టీమ్ ఎన్నిక జరిగింది ఎన్నికయిన టీము తిరుపతిలో ఈ నెల 27 న జరిగే జూనియర్ స్టేట్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటుంది

వాలీబాల్ ఛాంపియన్ షిప్పు పోటీలు

న్యూఢిల్లీలో

న్యూఢిల్లీ అక్టోబరు 24

ఈనెల 28 న యిక్కడి యన్ డి యం ఎ ఇండోర్ స్టేడియంలో 8 వ జాతీయ జూనియర్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఢిల్లీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ శ్రీ రాధారమణ్ ప్రారంభోత్సవం చేస్తారు

ఈ ఛాంపియన్‌షిప్పు పోటీల్లో 8 మహిళా టీములతోసహా 20 టీములు పాల్గొంటున్నట్లు మీట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ యస్ సి మల్హోత్రా నేడు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు



లేఖలు

"వైద్య విద్వాన్" గుర్తింపు కోసం...

మహాశయా,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1975 లో వైద్య విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి గుర్తింపు నిరాకరించడంతో ఆ విద్యార్థులు తీవ్ర నష్టానికి గురికావలసి వస్తోంది

ఈ విషయమై ఆంధ్రాయుర్వేద పరిషత్ వారు యితర వైద్య సంఘాలవారు విజ్ఞప్తులు పంపారు ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ రాజమల్లుగారు కాకినాడ వచ్చిన సందర్భంగా శాసన మండలి సభ్యురాలు శ్రీమతి సావిత్రీదేవి, శాసన సభ్యులు శ్రీ సాధనాల సత్తిరాజు, జిల్లాయువజన కాంగ్రెస్ నాయకులు శ్రీ చెలికాని ధర్మారావు జిల్లా అనువంశిక ఆయుర్వేద వైద్యసంఘ కార్యదర్శి శ్రీ శంకరశెట్టి కొండలరావు, ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులు శ్రీ గొట్టుముక్కల సుబ్రహ్మణ్యం 'వైద్యవిద్వాన్' గుర్తింపును కొనసాగించాలని విజ్ఞాపన పత్రం సమర్పించారు

ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ రాజమల్లుగారు ఆయుర్వేద వైద్య విద్యార్థుల భవిష్యత్ ఎట్ల శ్రద్ధ వహించి గుర్తింపును కొనసాగించే నిర్ణయాన్ని ప్రకటిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నాం

ఇట్లు,
మండా మాణిక్యాలరావు,
ఆయుర్వేద వైద్య విద్యార్థి
కాకినాడ

రిటైర్డ్ టీచర్ల పెన్షన్!

మహాశయా :

ఐదేళ్లు విధాన సభ సభ్యులుగా వున్న వారికి రు 250 పెన్షన్ యివ్వనున్నట్లు యిటీవల ప్రకటించారు ఈ సహాయం ఇదివరలో సభ్యులుగా వున్నవారికి సైతం వర్తించునట్లు నిర్ణయించారు

కాని రిటైర్ అయిన ఉపాధ్యాయుల విషయంలో మాత్రం 1969 72 అనే భేదం కల్పించి 69 ఏప్రిల్ తర్వాత రిటైర్‌అయిన వారి ఎలాంటి సౌకర్యం కలుగజేయలేదు ఎన్నడో శాసనసభ్యులుగా రిటైరయినవారికి కిచ్చేడి యీ పెన్షన్ సౌకర్యం, ఉపాధ్యాయుల కెందుకు కల్పించకూడదు ?

కనుక ఉదారత్వంతో ఉపాధ్యాయుల జీవం పరిస్థితిని గుర్తించి యీ సౌకర్యం 1972 లో రిటైరన వారికి వలెనే మంజూరు చేయాలని కోరుతున్నాను ఇట్లు,

ఎం వి సుబ్బారావు
రిటైర్డ్ హెడ్మాస్టర్
విజయగోపాలపురం, నెల్లూరు

హెడ్మాస్టర్ల డ్యూటీ అలవెన్సు, కంటింజెన్సీలు పెంచకపోతే ఎలా?

మహాశయా :

ఎలిమెంటరీ స్కూళ్ళలో హెడ్మాస్టర్ల అలవెన్సులు రు 2 నుండి 5 వరకే ఇస్తున్నారు అప్పర్ ప్రైమరీ స్కూళ్ళలో రు 15, హైస్కూళ్ళలోవిద్యార్థుల సంఖ్యను బట్టి రు 25, రు 40 వుంది ఈ రేట్లు 1960 నాటివి

ఈ పదిహేనేళ్ళలో వేతనాలు మూడు సార్లు, కరువుభత్యం మరికొన్ని సార్లు పెంచారు హెడ్మాస్టర్ల డ్యూటీ ఎలవెన్స్ ఎందుకు పెంచరో తెలియడంలేదు

అలాగే స్వాతంత్ర్యం వచ్చిన, తొలి రోజుల్లో నిర్ణయించిన పాఠశాలల నిర్వహణకైన కంటింజన్సీలు కూడా యీ నాటికీ పెంచబడలేదు

పదిహేనేళ్ళ నాటికీ, యిప్పటికీ పోలిస్తే బ్రతుకు బరువుతోపాటు, హెడ్మాస్టర్ల బాధ్యత రెన్నోరెట్లు పెరిగాయి

కనుక యీ అలవెన్సులు ప్రస్తుత పరిస్థితినిబట్టి పెంచాలని కోరుతున్నాను

ఇట్లు,
వి. కృష్ణమూర్తి,
కార్యదర్శి
ప్రదేశ్ ప్రాథమికోపాధ్యాయ
ఫెడరేషన్ (రిజి)

వేసినస్తంభాలు వంగిపోతున్నా వెలుగు మాత్రంరాని సుద్దాల గ్రామం

మహాశయా :

నల్గొండ జిల్లా రామన్నపేట తాలూకా సుద్దాల గ్రామంలో కరెంటువారు స్తంభాలు వేశారు వైరింగ్‌కూడా పూర్తయింది. ఒక ట్రాన్స్‌ఫారమ్ కూడా వచ్చి దాదాపు 6 నెలలవుతుంది కరెంటు సప్లయి మాత్రం కాలేదు

అయితే ట్రాన్స్‌ఫారం మాత్రం వూరికి మైలుదూరంలోగల బావిదగ్గరికి మార్చారు ఇక వూళ్ళో వేసిన స్తంభాలు అస్తవ్యస్తమై వంకరగా తయారై, కొన్నివంగిపోయాయి. చేసిన వైరింగ్ ఉయ్యాలలూగుతున్నాయి.

విద్యుచ్ఛక్తిశాఖ అధికారులు యీ దిక్కుమాలిన పరిస్థితిని గుర్తించి ట్రాన్స్‌ఫారంను వెంటనే వూరికి సమీపంలో యిదివరకు వేస్తామన్న ప్రదేశానికి మార్చి తరువాత కరెంటు సప్లైకి తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను

ఇట్లు,
కె వి కొండలబాబు,
సుద్దాల, పోరుపల్లి(పోస్టు)
రామన్నపేట తాలూకా

పోస్టాఫీసు మార్పుకై విజ్ఞప్తి

మహాశయా,

ఇల్లెందు పట్టణంలో ఒకే ఒక సబ్-పోస్టాఫీసు పట్టణం నడిబొడ్డునవుంది. కాని ఇప్పుడు దానికి సరియైన సౌకర్యం లేదన్న కారణంతో అక్కడనుండి తీసివేసి, ఆఫీసర్ల క్లబ్బువద్దకుమార్చారు

ఫలితంగా అక్కడవున్న కార్మికులకు, వ్యాపారులకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడానికి చాలా ఇబ్బంది ఏర్పడింది దీని గురించి ప్రభుత్వం మరియు కంపెనీవారు ఆలోచించి, ఇప్పుడు మార్చిన పోస్టాఫీసును తిరిగి యథాస్థానంలోకి మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నాను

ఇట్లు
పి రాంబాబు
ఇల్లెందు



ప్రత్తి పైరు - కలుపు నివారణ

ప్రత్తి పైరుకు పైరు దశనుబట్టి ఇపుడు ఎరువులను వేసి కలుపు నివారణ చేయాలి యం సి యు- ఐదు రకం ప్రత్తిక విత్తిన ముప్పయి రోజులకు మొదటిసారి అరవై రోజులకు రెండుసారి పైరు మీద నత్రజని ఎరువును వేయాలి ప్రత్తిసారి ఎకరానికి పదిహేను కేజీల నత్రజనినిచ్చే ఎరువును వరుసల ప్రక్కగా లోతుగావేసి; వెంటనే మట్టిలో కలిసేటట్లు అంతర కృషి చేయాలి విత్తిననలభై, నలభై ఐదు రోజులకు మట్టిన మొలకళ్ళకు ఎగ్రదోయాలి వంలక్ష్మి రకం ప్రత్తికి విత్తిన అరవై రోజులకు మొదటిసారి, తొంభై రోజులకు రెండవసారి నూట ఇరవై రోజులకు మూడవసారి ప్రత్తిసారి ఎకరానికి పదికిలోల నత్రజనినిచ్చే ఎరువుసువేయటం అవసరం హైబ్రిడ్‌పాలుగు రకం ప్రత్తికి ఎకరానికి 30 కిలోలనత్రజనినిచ్చే ఎరువును మూడు సమభాగాలుగా చేసి దఫాల వారీగా విత్తిన అరవై రోజులకు మొదటిసారి, తొంభై రోజులకు రెండవసారి, నూట ఇరవై రోజులకు మూడవసారి పైరుమీద వేయాలి పైరుమీదవేసే ఎరువును మొక్కల వరుసల ప్రక్కగా అరుసుండి తొమ్మిది అంగుళాల దూరంలో నాలుగు నుండి ఆరు అంగుళాల లోతు సాళ్ళలో వేసి మట్టి కప్పాలి.

2 ప్రత్తిపైయుపు యూరియా ఎరువును కార్బోరిల్, మిథైల్, పెరాథియాన్ సస్యరక్షణ మందులను కలిపి చల్లటంవల్ల దిగుబడులను అధికంగా పొందవచ్చును 1974-75, 1975-76 సంవత్సరాలలో జరిగిన పరిశీలనలో ఋజువైంది ప్రత్తి పైరుమీద విత్తిన అరవైయవ రోజున హెక్టారుకు ఎది కేజీల యూరియాను ఎంత్తె ఐదు కాలం కార్బోరిల్ మందు ఒక లీటరు నీటికి ఒకటిన్నర మిల్లీలీటర్లమందుచొప్పున కలిపి దీనిని మిథైల్ పెరాథియాను ఒక లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పునకలిపి ఈ మిశ్రమాన్ని పైరుమీద చల్లితేంవల్ల దిగుబడులను అత్యధికంగా పొందవచ్చునని కేయాలి పరిశోధనలు పైబడి హెక్టారుకు తేలింది. యూరియాను ఈ సస్యరక్షణ మందులను విడివిడిగా చల్లటంవల్ల కూడ దిగుబడులలో ఎక్కువవత్యాసం కనబడలేదు

మిరప నాటి నలభై ఐదురోజులైన చోట్ల ఇప్పుడు పైరు మీదనత్రజని ఎరువును ఇరవై నుండి ఇరవై ఐదు కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువును నాటిన నలభైఐదవరోజున వరుసలమధ్య గ్రాంతతో వేయాలి, దీనిని మంచివర్షంపడిన తరువాత వేయటం మంచిది నీటి పారుదల పంటకు హెక్టారుకు నూరు కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువును రెండు లేక మూడు సమ భాగాలుగా, నాటిన నలభై ఐదవరోజున మొదటిసారి తరువాత మూడు వారాలకు రెండవసారి వేయాలి నత్రజని ఎరువును వేసినప్పుడల్లా పైరుకు బాగా నీరు కట్టాలి. తేలిక నేలల్లో నూరు కిలోల నత్రజనిని ఐదు, ఆరు దఫాలుగా వేయవచ్చు

ఆలస్యంగా ఖరీఫ్ వరినాట్లు

కొన్ని ప్రాంతాలలో ఖరీఫ్ వరి నాట్లు బాగా ఆలస్యంగా జరిగినవి హైదరాబాద్ జిల్లాలోని తాండూరు తాలూకాలోని జుంటుపల్లి ప్రాజెక్టు క్రింద ఆలస్యంగా వేసిన దీర్ఘకాలిక వరి రకాలు ఇప్పుడు దుబ్బుపట్టే దశలో వున్నాయి అదే విధంగా ఇతర ప్రాంతాలలో కూడ నాట్లు బాగా ఆలస్యంగా జరిగినచోట్ల పైరు ఇప్పుడు లేత దశలో వుండి వుండవచ్చు ఇటువంటి ప్రాంతాలలో పైరు బాగా దుబ్బు చేయటానికి, దిగుబడులు ఎక్కువగా రావటానికి పైరు మీద వేసే నత్రజని ఎరువును సకాలంలో సరైన పద్ధతిలో వేయాలి నల్లరేగడి భూముల్లో జయ, సోనా ఐ-ఆర్-ఇరవై వంటి మధ్యకాలపరిమితిగల రకాలను నాటిన ముప్పై, ముప్పై ఐదు రోజులకు రత్న, తెల్లహంస, కావేరి వంటి తక్కువ కాలపరిమితి గల రకాలను నాటిన ఇరవై, ఇరవై ఐదు రోజులకు పైరు నత్రజని ఎరువును వేయాలి ఎర్ర భూముల్లోను చెల్క భూముల్లోను నాటిన ఇరవై ఐదు, ముప్పై రోజులకు ఒకసారి, నాటిన నలభై ఐదు రోజులకు రెండవసారి రెండు దఫాలుగా పైరుమీద నత్రజని ఎరువు వేయాలి తేలికభూముల్లో నత్రజని ఎరువును తక్కువ ప్రమాణంలో ఎక్కువ దఫాలుగా వేయటం మంచిది నాట్లు వేసిన రెండు నెలల్లో ప్రతి పదిహేను రోజులకు ఒకసారి తగిన మోతాదులలో నత్రజని ఎరువును పైరుమీద దఫాలుగా వేయటం మంచిది. ఒక వేళ దమ్ములో ఎరువులను వేసి వుండకపోతే నత్రజని, భాస్వరం ఎరువులను సంకీర్ణ ఎరువుగా గాని సూది ఎరువులుగా గాని నాటిన ఇరవై ఐదు రోజులలోగా వేయవచ్చు నాటిన పైరు పెరుగుదల సరిగా లేకపోయినా, దుబ్బు సరిగా చేయకపోయినా, పైరు పాలిపోయిన పసుపు రంగులో వున్నా, ఇటువంటిచోట్ల నాటిన నలభై ఐదు, యాభై ఐదురోజులలోపల ఎరువునువేసి లోపాలను సరిదిద్ద వచ్చును అయితే ఎరువులను వేసేటప్పుడు గమనించవలసిన విషయం ఏమిటంటే, ముందుగా పొలంలోని నీటినితీసివేసి పొలం బురద బురదగా వున్నప్పుడు ఎరువులనువేసి తరువాత ఇరవై నాలుగు గంటలనుండి ముప్పై ఆరు గంటలకు మళ్ళీ నీరు కట్టాలి అమ్మోనియం సల్ఫేట్ అయితే ఇరవై నాలుగు గంటల తరువాత, యూరియా సంకీర్ణ ఎరువులయితే ముప్పై ఆరు గంటల తరువాత తిరిగి పొలానికి నీరు కట్టాలి ఈ విధంగా చేసినటయితే వేసిన ఎరువు వృధా కాకుండా పైరుకు బాగా ఉపయోగపడతాయి

రబీ జొన్న

వివిధ ప్రాంతాలలో ఇప్పుడు వర్షాలు బాగా పడుతున్నాయి కనుక ఇది అదనుగా తీసుకొని రబీ జొన్నను ఇంకా వేయని చోట్ల వెంటనే వేసుకోవచ్చు రబీ జొన్న వెసే జిల్లాలలో సి.ఎస్ హెచ్ - ఒకటి, సి ఎస్ హెచ్ ఏడు ఆర్ సి ఎస్ హెచ్ 8ఆర్ అనే సంకరజాతి జొన్న రకాలను గాని ఆర్, పదహారు, యం. ముప్పయిఐదు ఒకటి అనే యితర మేలు రకాలను గాని వేసుకోవటం లాభదాయకంగా వుంటుంది ఎందుకంటే ఈ రకాలు ఈ జిల్లాలకు అనువైన అధిక దిగుబడి నిచ్చే రకాలు ఈ రకాల విత్తనాలు ఆయా జిల్లాలలోని వ్యవసాయ శాఖ గోదాములలో తగినంతగా నిల్వ వుంచబడి, సరఫరాచేయబడుతున్నవి కూడ ఈ రకాల విత్తనాలను యింకా సేకరించు కొనవివారు వెంటనే సేకరించుకొని ఇప్పుడు ఎదే వర్షాలను వినియోగించుకొని వెంటనే విత్తుకోవాలి

విత్తనం ఆలస్యం చేసిన కొద్ది పంట దిగుబడులు తగ్గిపోయే అవకాశం వుంది అందుకని అదనుచూచుకొని ఎంత ముందుగా వీలయితే అంత ముందుగా రబీ జొన్నను విత్తుకోవటం మంచిది

విత్తేముందు విత్తనానికి కార్బోఫ్యూరాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసినట్లయితే మొవ్వు చంపే ఈగవల్ల పైరుకు నష్టం కలుగకుండా వుంటుంది సమీపంలో వున్న సహాయ వ్యవసాయ అధికారిని సంప్రదించి విత్తన శుద్ధి విధానాన్ని సరైన పద్ధతిలో జరిపించి ఆ విత్తనాన్ని వాడటం మంచిది.

చిల్లకల్లు పంచాయతీ సమితిలో పాఠశాలల తీరుతెన్నులు

జగ్గయ్యపేట, అక్టోబరు 25

జగ్గయ్యపేట తాలూకా వేదాద్రి గ్రామంలో సమితి ప్రాథమిక పాఠశాల స్థానిక సర్పంచ్‌కు చెందిన ఒక పశువుల పాకలో నడుస్తూంది హాజరు పట్టి ప్రకారం పాఠశాల విద్యార్థుల సంఖ్య 88. అయితే పాఠశాలలో 20 మంది విద్యార్థులకు మాత్రమే సౌకర్యం వుంది.

ఇక్కడికి 19 కిలోమీటర్ల దూరంలోగల ఈ గ్రామ జనాభా 800 ఎక్కువగా గిరిజనలున్నారు

జగ్గయ్యపేటకు చెందిన పత్రికా విలేకరులు కొన్ని పాఠశాలలను సందర్శించిన సందర్భంగా ఆశ్చర్యకరమైన అనేక విషయాలు వెల్లడయ్యాయి ఇదే తాలూకాలో రవిరాల గ్రామంలో పాఠశాల కూలి పోయేందుకు సిద్ధంగా ఉన్న సత్రంలో వుంది జయంతిపురంలోని ప్రాథమిక పాఠశాల స్థానిక జమీందారుకు చెందిన ధాన్యపు కొట్టులో నడుస్తోంది దగ్గరున్న లంబాడీ తండాలో 100 మంది చదువుకునే వయస్సు గలపిల్లలున్నారు. అయితే పాఠశాల మైలు దూరానికి పైగా ఉన్నందున వారు చదవడం లేదు ఈ పాఠశాలలన్నీ చిల్లకల్లు పంచాయతీ సమితి నిర్వహణలో వున్నాయి ఇన్‌ఛార్జీ బి డి ఓ శ్రీ ఎ బాబురావు దృష్టికి తీసుకురాగా తగిన చర్యలు తీసుకుంటామని పత్రికల వారికి హామీ యిచ్చారు. (వి. వి.)

చెన్నకేశవస్వామి దేవస్థానము, పావులూరు

టెండరు నోటీసు

ప్రకాశం జిల్లా చీరాల తాలూకా పావులూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ చెన్నకేశవస్వామి వారి దేవస్థానం తాలూకు ఈ దిగువ వివరించిన పనులకు ది. 30 10-76 లోగా టెండర్లు కోరబడుచున్నవి.

	పని పేరు	ఎస్టిమేటు విలువ
1.	ఆలయ విమాన గోపుర నిర్మాణం	రు 11,700-00
2.	సింహద్వార నిర్మాణం	రు 11 300 00

(సం.) మ. వెం. సుబ్బారావు,
చైర్మన్,
ట్రస్టు బోర్డు.

పావులూరు
14 10-76

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్

హైదరాబాదు మరియు విజయవాడ (విద్యాధరపురం)లోని స్క్రాప్ వెహికల్స్ మరియు స్క్రాప్ మెటీరియల్స్

టెండరు మరియు వేలం అమ్మకం

టెండరు మరియు వేలం అమ్మకంలోని ఐటములు

వెహికల్స్, స్ప్రింగ్ బ్లేడులు, గేర్‌బాక్స్‌లు, ఇంజన్‌లు, లేతుమెషీన్‌లు పిస్టన్స్, రేడియేటర్స్, పేపర్ కటింగ్స్ టైర్లు

ఆంధ్రప్రదేశ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ జనరల్ మేనేజరుగారి ఆర్డరు ప్రకారం ఐటమ్స్ ఎలా ఉన్నవో ఆదే స్థితిని హైదరాబాదులో 1976 నవంబరు 23 24 తేదీలలో విజయవాడ (విద్యాధరపురంలో) 1976 నవంబరు 26, 27 తేదీలలో వేలంలో అమ్మబడును.

టెండరు ఫారముల కొరకు హైదరాబాదు, విజయవాడలలోని ఆయా స్టోర్స్ ఆఫీసర్లు (డిస్పోజల్స్) నుండి తిరిగి ఇవ్వబడని పద్ధతిని రు 5/- (ఐదు రూపాయలు మాత్రం) నగదు లేదా రు 7/- (ఏడురూపాయలు మాత్రం) మనియార్డరు ద్వారా చెల్లించి పొందవచ్చును

టెండరు ఫారములు అయిటములు ఎల్. పి వెహికల్స్ స్ప్రింగ్ బ్లేడులు, గేర్‌బాక్సులు, ఇంజను లేతుమెషీన్, పిస్టన్, రేడియేటర్స్, పేపర్ కటింగ్స్‌కు హైదరాబాదులోను మరియు టి ఎం బి వెహికల్స్, టైర్లకు స్టోర్స్ ఆఫీసర్ (డిస్పోజల్) విజయవాడలోను పొందవచ్చును

సీలువేసిన టెండర్లు హైదరాబాదులో లభించు అయిటములకు స్టోర్స్ ఆఫీసర్, (డిస్పోజల్) ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, హైదరాబాదు మరియు విజయవాడలో లభించు అయిటములకు స్టోర్స్ ఆఫీసర్ (డిస్పోజల్స్) ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ విజయవాడ వారికి వేలం నిర్వహించబడు తేదీలలో ఒక గంటముందు వరకు అందునట్లు పంపాలి.

చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ (ఐ/సి)
హైదరాబాదు - 00020.
APSRTC/290/76



మీ ఫ్యూయల్ ఇంజక్షన్ పంప్, ఎల్లప్పుడూ మైకో సర్వీస్ సెంటర్‌లోనే సర్వీసుకు ఇవ్వండి. ఈ విధంగా మీకు అసలైన మైకో విడిభాగములు, మరియు ఫ్యాక్టరీలో శిక్షణ పొందిన మెకానిక్‌ల సేవలు ఖచ్చితంగా పొందగలరు. దీనివలన. మీ ఫ్యూయల్ ఇంజక్షన్ పంప్ ఓవర్ హాల్స్ మధ్య కనీసం 1,50,000 కి.మీ.లు నడుస్తుంది.

MICO
LICENCE BOSCH

విజయవాడకు అనుమతింపబడిన విక్రయదారుడు :
శ్రీ దుర్గా డీసెల్ హౌస్
గోపాలరెడ్డి రోడ్, గవర్నర్ పేట, విజయవాడ 520 002
గ్రామ్స్ : ప్రెసిషన్. ఫోన్ ; 74259

Sista's-MICO-[illegible]-Tel

మార్కెట్ ధరలు

విజయవాడ అక్టోబరు 25

విజయవాడ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ నేడు అందజేసిన 23-10-76 నాటి టోకు ధరలు (క్వింటాల్‌కు సంచి ఖర్చులు, పన్నులు మినహా)

ధాన్యం

	మసూరి	అక్కుళ్ళు
విజయవాడ	100-00	88-00

బియ్యం

విజయవాడ	175-00	160-00

అపరాలు

	కందులు	మినుములు
విజయవాడ	155-00	220-00
రాజమండ్రి	150-00	225-00
గుంటూరు	165-00	235-00
	పెసలు	**శనగలు**
విజయవాడ	130-00	140-00
రాజమండ్రి	140-00	—
గుంటూరు	135-00	180-00

వేరుశనగ

	పప్పు	నూనె
విజయవాడ	—	800-00
నంద్యాల	—	730-00

బెల్లం

	1వ రకం	2వ రకం
అనకాపల్లి	—	—
తాడేపల్లిగూడెం	—	—

చింతపండు

	1వ రకం	2వ రకం
విజయవాడ	—	—

ధనియాలు

విజయవాడ		730-00
గుంటూరు		—

పసుపు

	కొమ్ములు	దుంపలు
దుగ్గిరాల	—	—
కడప	—	—

ప్రత్తి

	ఫారం	లక్ష్మి
ఆదోని	—	—

మిర్చి

	1వ రకం	2వ రకం
గుంటూరు	650-00	550-00

కొబ్బరికాయలు

(1000)	కొత్త	పాత
విజయవాడ	800-00	900-00
పాలకొల్లు	600-00	800-00

బంగారం - వెండి

బంగారం స్టాండర్డు 10 గ్రాములు	60 00
వెండి స్పాట్ (కిలో)	1170-00

రేడియో

బుధవారం అక్టోబరు 27
శక 1898 కార్తీక 5

హైదరాబాదు-ఎ

ప్రసారము I

6-00 వందేమాతరం, మంగళధ్వని, కార్యక్రమ వివరణ; 6-10 భక్తిరంజని, 6-55 వ్యాఖ్య; 7-15 జానపద గేయాలు; 7-30 చిత్రసీమ - రంగుల రాట్నం, ముత్యాలముగ్గు, దొరలు దొంగలు, చందన, అందాల రాముడు, మా దైవం, అమ్మాయిల శపథం, సౌభాగ్యవతి; 8-30 ఎ. మృణాళిని-గానం; 9-00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11-45 ఉన్నత పాఠశాలలకు; 12-05 ప్రాథమిక పాఠశాలలకు - రాము నిజాయితీ కథ; 12-20 హిందీ పాఠం; 1-00 చిత్రసీమ - మాయా మశ్చీంద్ర, కథానాయకుని కథ, రామ్. రహీమ్, ఆడదాని అదృష్టం, తీర్పు, దొరబాబు; 1-30 మహిళా సమాజం - కె. రాధా సుబ్రహ్మణ్యం ప్రసంగం. 2-10 ఉన్నత పాఠశాలలకు; 2-30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5-30 సంగీత శిక్షణ (విజయవాడనుండి) 5-45 సంగీత సుధ - ఈమని శంకరశాస్త్రి - వీణ; 6-35 గ్రామసీమలు - తంగిరాల ఆంజనేయ శాస్త్రిచే పురాణ కాలక్షేపం; 7-45 వార్తావాహిని; 8-00 మీరు కోరిన పాటలు; 8-30 ప్రసంగం; 8-45 లలిత సంగీతం - డా॥ కనకవల్లి నాగేందర్; 9-45 ధ్వని-సాహిత్య పత్రికా కార్యక్రమం; 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

ప్రసారము I

6-00 వందేమాతరం, శుభోదయం ప్రసార విశేషాలు, దేశభక్తిగేయం, 6-15 భక్తిరంజని; 7-15 జానపద గేయాలు. 7-40 ఈ మాసపు పాట; 7-45 చిత్రతరంగిణి; 8-30 కె. శేషాద్రి - గానం; 9-00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11-45 ఉన్నత పాఠశాలలకు; 12-05 కె. శేషాద్రి - గానం; 1-00 పొన్నా - పొగడ; 1-05 చిత్రతరంగిణి; 2-10 ఉన్నత పాఠశాలలకు, 2-30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5 30 సంగీత శిక్షణ (సీనియర్లకు) 5-45 లలిత సంగీతం 6-30 యువవాణి, 7-45 వార్తావాహిని, 8-30 వాద్యబృందం, 9-15 ఆంగ్లమున, 9-45 ధ్వని-సాహిత్య పత్రికా కార్యక్రమం; 10-30 ప్రసార సమాప్తి

విశాఖపట్టణం

ప్రసారము I

6-00 వందేమాతరం, శుభోదయం, 6-05 భక్తిరంజని, 7-45 మధురిమ

ప్రసారము II

12-05 మధుమంజరి; 1-05 లాల్‌గుడి జి జయరామన్ - వయొలిన్.

(I, II ప్రసారాలలో మిగతాకార్యక్రమాలు వి. వలె)

ప్రసారము III

5-45 వాద్యగోష్ఠి, 6-50 ఉషఃకాంతులు 7-00 ధరలు, వాతావరణం, 8-00 మనోరంజని, 8-30 ప్రసంగం, 9-30 కె కృష్ణమాచారి - వయొలిన్, 9-45 ధ్వని-సాహిత్య పత్రికా కార్యక్రమం, 10-30 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

(మిగతా కార్యక్రమాలు హైదరాబాదువలె)

కడప

ప్రసారము I

6-00 వందేమాతరం, సుప్రభాతం, 6-10 భక్తిరంజని; 7-30 కర్ణాటకసంగీతం జాన్ బి. హిగ్గిన్స్ - గానం, 8-30 చిత్రమంజరి - మిస్సమ్మ, మహామంత్రి తిమ్మరుసు, మంగమ్మ శపథం, మైరావణ, మల్లీశ్వరి, నడమంత్రపు సిరి, లక్ష్మీ కటాక్షం,

ప్రసారము II

12-05 సంగీతామృతం - బి ఎస్ రాజా అయ్యంగార్ - గానం, 1-00 చిత్రలహరి - కథానాయకుడు, తోట రాముడు, జమీందారుగారిఅమ్మాయి, పండంటికాపురం ఊర్వశి, పరివర్తన.

ప్రసారము III

5-45 చిత్రమాల - పవిత్ర హృదయాలు నుండి. 6-50 రాయలసీమ ధరలు, వాతావరణం; 8-00 అభిరుచి, 9-30 పిల్లల పెంపకం - తల్లిదండ్రుల బాధ్యత - డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి ప్రసంగం, 9 45 ధ్వని-సాహిత్య పత్రికా కార్యక్రమం (మిగతా కార్యక్రమాలు హైదరాబాదు వలె)

ఈనెల 21 న ఢిల్లీలోని దయాబస్తీలో రైల్వే రక్షకదళ సభ్యులు ఇన్‌స్పెక్టర్ శ్రీ ఆర్ డి. సింగ్ నాయకత్వాన మృతవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం.

కుటుంబనియంత్రణకు ఇస్లాం విరుద్ధం కాదు

ఢిల్లీసభలో కేంద్రమంత్రి మహమ్మద్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 2,

కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి ఇస్లాం వ్యతిరేకమేమీ కాదని, పాకిస్తాన్ ఇరాన్‌లాటి దేశాలు పెద్దఎత్తున కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టుతున్నాయని న్యాయ కంపెనీ వ్యవహారాల శాఖ స్టేట్ మంత్రి డాక్టర్ సయ్యద్ మహమ్మద్ అన్నారు

ఢిల్లీకి దగ్గరలో స్థానిక రోటరీక్లబ్బువారు నిర్వహించిన కుటుంబ నియంత్రణ శిబిరం సందర్భంగా జరిగిన సభలో నిన్న ఆయన ప్రసంగించారు.

ఇటీవల రాష్ట్రపతి వెంట తాను ఇరాన్‌లో పర్యటించిన సందర్భంగా ఇస్లాంలో కుటుంబ నియంత్రణను వ్యతిరేకించే ఆదేశాలు, సూత్రాలు ఏమీ లేవని అక్కడి మత సంస్థల ప్రతినిధులు తనతో అన్నారని తెలిపారు.

కేరళలో నూటికి 19 మంది ముస్లిములున్నారని వీరిలో 21 శాతం మంది కుటుంబ నియంత్రణ కార్యక్రమాల అమలు పరుస్తున్నారని మహమద్ వివరించారు

విపత్కరంగా తయారవుతున్న అధిక జనాభా సమస్యను పరిష్కరించకపోతే అది దేశాన్ని నిలువునా ముంచుతుందని ఆయన హెచ్చరించారు

డాక్టర్ నక్కా సూర్యనారాయణమూర్తికి సన్మానం

విజయవాడ, అక్టోబరు 25

పారిశ్రామిక ప్రవీణ డక్టర్ నక్కా సూర్యనారాయణమూర్తికి స్థానిక ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ యిటీవల సన్మానించింది

ఆటోమొబైల్ టెక్నీషియన్లు సంయుక్తంగా ఆటోమొబైల్ విభాగాలనుతయారు చేసే సంస్థను నెలకొల్పాలని శ్రీ సూర్యనారాయణ యీ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

సన్మానసభకు శ్రీ గాజుల నారాయణరావు అధ్యక్షత వహించారు. అసోసియేషన్ కార్యదర్శి శ్రీ డి సుందరావు శ్రీ జె రాఘవేంద్రరావు శ్రీ మాగంటి సూర్యనారాయణ పంతులు శ్రీ నారాయణమూర్తిని అభినందించారు

విజయవాడలో పృథ్వీసింగ్‌కు సన్మానం

విజయవాడ, అక్టోబరు 25

అఖిలభారత స్వాతంత్ర్య సమరయోధుల సంఘాధ్యక్షులు శ్రీ బాబా పృథ్వీ సింగు ఆజాద్‌గారిని జయవాడ మొగల్రాజపురం మధుకళామండపములో 28వతేదీమధ్యాహ్నం ఒంటి గంటకు సన్మానిస్తారు

సన్మానసభకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రగడ కోటయ్య అధ్యక్షత వహిస్తారు అఖిలభారత స్వాతంత్ర్య సమరయోధుల సంఘం పశ్చిమబెంగాలు అధ్యక్షులు శ్రీ శీలభద్రయాజి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ మహేష్ వక్తలుగా మిత్రులు పాల్గొంటారు శ్రీ పృథ్వీసింగు 27 వ తేదీ రాత్రి కలకత్తా మెయిల్‌లో వస్తారు.

అద్దంకిలో కుటుంబ నియంత్రణ శిబిరం

అద్దంకి, అక్టోబరు 2

కుటుంబ నియంత్రణ ఆపరేషనులు చేయించుకున్న వారికి ముందుగా ఇండ్ల స్థలాల భూముల పట్టాలను మంజూరు చేయడం జరుగుతుందని ఈ నెల 20 వ తేదీన ఇక్కడప్రభుత్వఆసుపత్రిలో యువజన కాంగ్రెసు ఏర్పాటుచేసిన కుటుంబనియంత్రణ శిబిరాన్ని ప్రారంభిస్తూ ఒంగోలు సబ్‌కలెక్టరు శ్రీ వి. ఎస్. సంపత్‌కుమార్ చెప్పారు ముందుగా శ్రీ జాగర్లమూడి హనుమయ్య, ఆహ్వానితులకు స్వాగతం పలికారు. శ్రీ నాంపాటి వెంకటేశ్వర్లు అద్దంకి తహసిల్‌దారు శ్రీ కె. వెంకటరెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీ ఆర్ సి. మహేంద్ర, శ్రీ గోరంట్ల రాఘవయ్య, శ్రీ ఎ. వి సుబ్బారావు శ్రీ వి. సుబ్బరామయ్య శ్రీ సి కనకసేనారావులు ఈ సందర్భంగా ప్రసంగించారు కుటుంబ నియంత్రణ ప్రోత్సాహానికి ప్రభుత్వం యిచ్చే సహాయంతోపాటు శిబిర నిర్వాహకు లిచ్చిన చీరలు, పంచెలు శ్రీ ఆర్. సి. మహేంద్ర అందజేశారు ప్రకాశంజిల్లా యువజన కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కె బలరామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ శాశ్వత షెడ్‌ను ఏర్పరచడానికి ప్రజల నుండిరు 2,500 వేలువసూలు చేశారు తహసీల్దారు శ్రీ కె. వెంకటరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి శ్రీ డి రామయ్య కొరిశపాడు వైద్య అధికారి శ్రీ ఎ. అంకయ్య తదితరులు ఈమొత్తాన్ని వసూలు చేశారు తాలూకా కార్యాలయంలో వసతి లేనందున షెడ్ నిర్మాణం తలపెట్టారు శ్రీ బి కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. అనంతరం తాలూకా పౌరసంబంధ శాఖవారు చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు

తృతీయ ప్రపంచ దేశాలకు భారత్ మార్గదర్శకత్వం

ఐ. రా. స. ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్టోబరు 24

తృతీయ ప్రపంచానికి భారత్ మార్గదర్శి అని ఐ రా.స అభివృద్ధి కార్యక్రమాల అడ్మినిస్ట్రేటర్ మోర్సే ఐ రా.స దినోత్సవ సందేశంలో భారత్ ప్రభుత్వం, ప్రజలను ప్రత్యేకంగా పేర్కొన్నారు.

ఆయన సందేశంలో ఇలా వుంది.

ఐ రా. స. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు భారత్ 1970లో 500మందికి పైగా నిపుణులనుసమకూర్చింది ఇపుడు వర్ధమాన దేశాల సాంకేతిక సహకార ప్రాజెక్టుల్లో సమధిక పాత్ర వహించి తీరుతుంది

భారత్ ఆర్థిక సామాజికాభివృద్ధి ప్రయత్నాల్లో ఐరాసఅభివృద్ధి కార్యక్రమసాంకేతిక సహకార కార్యకర్తల పాత్రను నేను గత జనవరిలో బాధ్యతలను స్వీకరించి నప్పటి నుండి ఆసక్తితో గమనిస్తున్నాను. ఐ రా.సకు భారత్‌తో యితోధిక సాంకేతిక సహకార కార్యక్రమాలున్నందువల్లనే కాకుండా అది తృతీయ ప్రపంచ దేశాలకు మార్గదర్శిపాత్ర వున్నందువల్ల కూడా భారత్ ప్రాధాన్యత వుంది. తన అభివృద్ధి అవసరాలకు అందుబాటులోవున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో అసాధారణ ప్రజ్ఞ చూపడమేకాకుండా సాధించిన పరిజ్ఞానంతోనే సంతృప్తి పడిపోలేదు.

తనకు, తక్కువ ఆదాయాలు గల దేశాలకు అనుగుణమైన పరిశోధనల అభివృద్ధిలోనూ, మధ్యస్థాయి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంలోనూ భారత్ శాస్త్రవేత్తలు, సాంకేతిక వేత్తలు నాయకత్వ పాత్రను ప్రదర్శించారు.

భారత్‌కు గల అసంఖ్యాక ఇంజనీర్లు సాంకేతిక వేత్తలు నిపుణుల వనరులను యితర దేశాల ఆర్థికసామాజికాభివృద్ధికి కూడా ఉపయోగించు కోవడం జరుగుతుందన్నారు.

రాజ్యాంగ సవరణలపై న్యాయవాదుల సదస్సు

విజయవాడ, అక్టోబరు 25

రాజ్యాంగ సవరణలను ప్రవేశపెట్టటాన్ని వాయిదా వేయాలని నిన్న యిక్కడ జరిగిన "ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సదస్సు' కోరింది.

సదస్సుకు శ్రీ వి. రాజేశ్వరరావు, అధ్యక్షత వహించారు శ్రీ పెయ్యేటి వెంకటరావు సదస్సును ప్రారంభించారు శ్రీ ఎం వి. రామమూర్తి స్వాగతం చెప్పారు దాదాపు 30 మంది యీ సదస్సులో పాల్గొన్నారు

తలపెట్టిన సవరణలు ప్రాథమిక హక్కులను భంగం కల్గించేవిగా వున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు.

ముత్యాలంపాడు శాఖా మహాసభ

విజయవాడ, అక్టోబరు 25

పట్టణ కమ్యూనిస్టు సమితి ముత్యాలంపాడుశాఖ మహాసభ వార్డు యువజనసంఘ కార్యాలయంలో శ్రీ జంపన రామమూర్తి రాజు అధ్యక్షతన నిన్న ఉదయం జరిగింది

పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీవెల్లంకి సుబ్బారావు, శ్రీ మాలెంపాటి ఉదయ భాస్కరరావు, శ్రీ వెల్లంకి రాఘవయ్యలు సమావేశానికి హాజరై సందేశాలిచ్చారు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై శ్రీ భాస్కరరావు నివేదిక విచ్చారు

బుడమేటి వంతెన ఏలూరు కాల్వమీద వంతెనను నిర్మించాలని వార్డులో రోడ్లను అభివృద్ధి చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

యువజన సమాఖ్య కార్యాలయం, వయోజన పాఠశాల ప్రారంభం

—బ్రాహ్మణపల్లి గ్రామంలో

దేవరకొండ, అక్టోబరు 25

దేవరకొండ తాలూకా బ్రాహ్మణపల్లి గ్రామంలో ఈనెల 17 వ తేదీన యువజన సమాఖ్య కార్యాలయం, వయోజన పాఠశాలలను శాసన సభ్యులు శ్రీ బి రామశర్మ ప్రారంభోత్సవం చేశారు

ముందుగా తాలూకా యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ టి శేఖర్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు

డిండి ప్రాజెక్టులోని యువజనులు వెయ్యి మంది ఇరవై అంశాల అమలును కోరుతూ వూరేగింపు జరిపారు

అనంతరం గ్రామ కమ్యూనిస్టుపార్టీశాఖ కార్యదర్శి శ్రీ జి. రాంచంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో శ్రీయుతులు రామశర్మ, శేఖర్ రెడ్డి, పి లక్ష్మా రెడ్డి, డి రాఘవేందర్‌రావు, వై వెంకట్రాంరెడ్డి, సర్పంచ్ శ్రీ బి వెంకటరమణ ప్రసంగించారు

రాత్రి 9 గంటలకు వయోజన పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు పలకలు, బలపాలు పంచిపెట్టారు శ్రీయుతులు శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌రావు పాఠశాల ప్రాధాన్యతను వివరించారు ఈ సందర్భంగా సభ్యులంతా సమావేశమై శ్రీ బి. పర్వతరెడ్డి అధ్యక్షులుగా, శ్రీ బి బుచ్చిరెడ్డి కార్యదర్శిగా కమిటీని ఎన్నుకున్నారు.

అద్దాలు లేకుండా 83 నిమిషాలు సూర్య గ్రహణం చూసిన వ్యక్తి

కొచ్చిన్, అక్టోబర్ 25

నేడు సూర్యగ్రహణం సంభవించినపుడు కళ్ళకు ఏ అద్దం అడ్డు పెట్టకొనకుండా గ్రహణం వున్న 83 నిమిషాల పాటు వై. జి. కృష్ణమూర్తి అనే ఒక వ్యక్తి సూర్యునివైపు దీక్షగా చూడగలిగాడు గ్రహణ సమయంలో ఇంతసేపు సూర్యుని చూడడం ప్రమాదకరమని వైద్యులుకూడా పేర్కొన్నారు

ఈ విధంగా గ్రహణాన్ని చూసినా తన కళ్ళకు ఎటువంటి చెరుపు జరగ లేదని ఇంతకు ముందుకూడా రెండు సూర్య గ్రహణాలను తానీ విధంగా చూశానని అన్నారు

ఈ వ్యక్తికి తంత్ర విద్యలు తెలుసునని చెప్పబడుతున్నది.



అధికారం తన చేతికొచ్చిందనుకొన్నాడు
కాని అది తిరిగి తన చేతులతోనే అప్పగించాల్సి వస్తుందనుకోలేదు తప్పదుమరి

జైలు నుండి తప్పించుకు పారిపోయిన భయంకర ఖైదీల అపూర్వ సాహస గాథ!
హీరో కృష్ణ నటించిన యాక్షన్ చిత్రం!

త్రిమూర్తి ప్రొడక్షన్స్
కలర్
దర్శకత్వం: కె.యస్.ఆర్.దాస్
నిర్మాతలు: సాంబశివరావు-బాబ్జీ
అక్టోబర్ 29 విడుదల! ఉదయం ఆటతో..
DIMPLE

గమనిక :- విజయవాడ అన్నపూర్ణ (ఎ.సి.) థియేటర్‌లో 28-10-76న ఉదయం 9-30 గంటలనుండి 11-30 గం॥ వరకు మొదటి వారంరోజులకు డీలక్స్ సర్కిల్‌కు అడ్వాన్సు బుకింగ్ కలదు.

ఏజెంట్లు కావలెను

ఆకర్షణీయమైన కమీషన్ పద్ధతిపై
ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రతి పట్టణం-ప్రతి గ్రామంలోను
పురుషులు, మరియు స్త్రీలు ఏజెంట్లుగా కావలెను.

మీ తీరిక వేళలలో
నెలకు రు.500 నుండి రు.2000 వరకు సంపాదించండి

వివరాలకు సంప్రదించండి.
మీ దగ్గరలోని బ్రాంచి లేక ఏజెన్సీ ఆఫీసు

లేదా

గుజరాత్ సేవింగ్స్ బ్రాంచీలు

5-1-751 బ్యాంకు స్ట్రీట్ కోఠీ టెలిఫోన్ 53706 హైదరాబాద్-1
గాంధీనగర్ సిమెంట్‌రోడ్ విజయవాడ-3.
46-22-5 స్టేషన్‌రోడ్ వైజాగ్ 530004

లేదా మీ దగ్గరలోని బ్రాంచి
లేదా హెడ్ ఆఫీసు 518 కల్బాదేవి రోడ్ బొంబాయి-400002
టెలిఫోన్స్ : 310605. 310633

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు, ఎడిటర్ : సి రాఘవాచారి, ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ 520004. R. No. 1138/75